ఈనాడు

కరీంనగర్ 4-2-2019 సోమవారం సిటీ సంపుటి 45 సంచిక 175

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50. పేజీలు 14+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

మోడీ సీబీఐ X పోలీస్ దీదీ

కోల్‌కతాలో అనూహ్య పరిణామాలు

పోలీసు కమిషనర్ నివాసానికి సీబీఐ బలగాలు

సీబీఐ అధికారుల్ని నిర్బంధించిన బెంగాల్ పోలీసులు

- మోదీ ప్రభుత్వంపై మండిపడ్డ పశ్చిమబెంగాల్ సీఎం మమత
- విపక్షాలతో సభ నిర్వహించినందుకే ఈ ప్రతీకారమని ధ్వజం
- రాత్రికి రాత్రి నడిరోడ్డుపై ధర్నా
- దీదీకి విపక్షాల మద్దతు
- నేడు సుప్రీంకోర్టు తలుపు తట్టనున్న కేంద్ర దర్యాప్తు సంస్థ



ఆదివారం కోల్‌కతాలోని పోలీసు కమిషనర్ రాజీవ్ కుమార్ నివాసం నుంచి బయటకు వస్తున్న పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ

కోల్‌కతా: కేంద్రానికి, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి మధ్య పోరు తీవ్రస్థాయికి చేరింది. ఇప్పటికే మోదీ, మమత మధ్య ఉప్పూనిప్పులా పరిస్థితి ఉండగా కోల్‌కతా పోలీస్ కమిషనర్‌ను ప్రశ్నించడానికి కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) రావడంతో అగ్గి మరింత రాజుకుంది. శారదా కుంభకోణం కేసులో కోల్‌కతా పోలీసు కమిషనర్‌ను ప్రశ్నించే నిమిత్తం సీబీఐ అధికారులు ఆదివారం సాయంత్రం అనూహ్య రీతిలో నేరుగా ఆయన నివాసానికి వెళ్లే ప్రయత్నం చేశారు. సీపీ 'పరారీ'లో ఉన్నందునే తాము ఈ చర్యకు దిగాల్సి వచ్చిందని సీబీఐ సమర్థించుకుంది. తక్షణం అప్రమత్తమైన పోలీసు బలగాలు సీబీఐ అధికారుల్ని ఆయన నివాసానికి వెలుపలే అడ్డుకోవడమే కాకుండా వారిని జీపులో పడేసి పోలీసు స్టేషన్‌కు తీసుకుపోయాయి. సీబీఐ దూకుడుపై మమత అగ్గిమీద గుగ్గిలమయ్యారు. హుటాహుటిన నేరుగా పోలీసు కమిషనర్ రాజీవ్ కుమార్ నివాసానికి చేరుకుని రాష్ట్ర సర్కారు తరఫున పూర్తి సంఘీభావాన్ని ప్రకటించారు. డీజీపీ కూడా ఆ సమయానికి అక్కడకు చేరుకున్నారు. గత నెల 31న ఒక్కరోజు సెలవు పెట్టడం మినహా కమిషనర్ నగరంలోనే ఉన్నారని, పరారీలో ఉన్నట్లుగా ఎలా నింద వేస్తారని మమత కేంద్రాన్ని నిలదీశారు. ఆయన్ని విచారించేందుకు సీబీఐ వద్ద ఎలాంటి వారెంటు లేదని చెప్పారు. పోలీసు శాఖతో పాటు అన్ని వ్యవస్థల్ని తమ గుప్పిట పెట్టుకోవాలని కేంద్రం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. తన పాలన యంత్రాంగం మీద దాడికి కేంద్ర బలగాలను పంపిస్తున్నారని ఆక్షేపించారు. దీనిపై తాను తక్షణం దీక్షకు దిగుతానని ప్రకటించి, రాత్రికి రాత్రి ఎస్ప్లనేడ్ వద్ద సత్యాగ్రహం చేపట్టారు. సోమవారం నాటి శాసనసభ కార్యకలాపాలు తాను కూర్చొన్నచోటనే జరుగుతాయని తేల్చి చెప్పారు. ...మిగతా 2లో



యాదాద్రి ఆలయం మాడ వీధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై శిల్పి ఆనంద్‌సాయి, యాడా ఉపాధ్యక్షుడు కిషన్‌రావు, ఈవో గీతారెడ్డి, సంబంధిత అధికారులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి

మహా దివ్యక్షేత్రంగా యాదాద్రి

- విశ్వఖ్యాతి గాంచేలా అద్భుత కట్టడాలు
- సర్వహంగులతో ఆలయనగరి నిర్మాణం
- పనులు భేషుగ్గా జరుగుతున్నాయి.. ఇంకా వేగం పెరగాలి
- మొత్తం పూర్తయ్యాకే మహాకుంభాభిషేకం
- యాదాద్రి పర్యటనలో సీఎం కేసీఆర్
- ఆరుగంటలపాటు క్షేత్రంలో పనుల పరిశీలన, అధికారులతో సమీక్ష

2 లో

‘ఆలయ పునర్నిర్మాణ పనులన్నీ పూర్తయిన తర్వాతే ప్రతిష్ఠాపన కార్యక్రమం (మహాకుంభాభిషేకం) చేపడతాం. రాష్ట్రపతి, ప్రధాన మంత్రి, గవర్నర్లు, సీఎంల సమక్షంలో 1008 హోమగుండాల్లో పూజలు జరుగుతాయి. 133 దేశాల నుంచి వైష్ణవ ఆధ్యాత్మికవేత్తలు, బద్రినాథ్ నుంచి వైష్ణవ స్వాములు వస్తారు. 12 వేల మంది రుత్వికులు, సహాయకులు పూజలు నిర్వహిస్తారు. 5 లక్షల నుంచి 15 లక్షల మంది భక్తజనం హాజరవుతారు. ఓ కార్యకర్తగా పనిచేసి ఈ మహాక్రతువును పూర్తిచేస్తా. పక్షం రోజుల్లో చినజీయర్ స్వామితో కలిసి ఇక్కడికి వచ్చి తేదీ నిర్ణయిస్తాం

– ముఖ్యమంత్రి కేసీఆర్

వారెవ్వా!

- చిన్ని చిన్ని వానచినుకులు కలిస్తే అదే ప్రవాహంగా మారుతుంది.

ఆ చిన్నారులూ అంతే...
అందరొక్కటయ్యారు...
కోటి రూపాయల పైనే కూడబెట్టారు...
ఓ రెండు స్వచ్ఛంద సంస్థలకు
జీవనాధారమయ్యారు...

- ఓ గుడిలో సొరకాయలు మొక్కుబడిగా చెల్లిస్తారు... ఎక్కడో తెలుసా?
- ఆ హోటల్‌కు వెళ్లి వృధా చేశారో... ఫైన్ పడుద్ది!



- విజయనగరం సంగీత కళాశాలకు వందేళ్లు...

మరి దాన్ని ఎవరి కోసం ఏర్పాటు చేశారో తెలుసా?

- ఆసక్తికరమైన కథనాల సమాహారం నేటి 'వారెవ్వా!'లో

నైతికతే గీటురాయి

- ప్రజలకు న్యాయం చేయడంలో అదే కీలకం
- పేరుకున్న పెండింగ్ కేసులు న్యాయవ్యవస్థకు మచ్చే
- 25లక్షల కేసుల్ని వెంటనే పరిష్కరించాలి
- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయి వెల్లడి
- ఏపీ హైకోర్టు శాశ్వత భవనానికి శంకుస్థాపన చేసిన సీజేఐ
- జ్యుడీషియల్ కాంప్లెక్స్ ప్రారంభం
- సీఎం చంద్రబాబు రాజ్యాంగ బాధ్యతను నిర్వర్తించారని వ్యాఖ్య
- ఆంధ్రప్రదేశ్ ప్రజలకు హైకోర్టు అంకితం

నవ్యాంధ్రలో న్యాయశకం

6 లో

‘కోర్టు భవనాన్ని కేవలం ఇటుకలు, రాళ్లతో కట్టిన నిర్మాణంగా మాత్రమే చూడకూడదు. న్యాయాన్ని అందరికీ అందుబాటులోకి తెచ్చే గొప్ప విలువైన చిహ్నంగా భావించాలి. ఏపీ హైకోర్టు భవనాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రజలకు అంకితం చేస్తున్నాను.

– సీజేఐ జస్టిస్ రంజన్ గొగొయి



గుంటూరు జిల్లా నేలపాడు హైకోర్టు తాత్కాలిక భవనం ప్రారంభోత్సవ శిలాఫలకం వద్ద సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయి దంపతులు. చిత్రంలో ఉత్తరాఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్‌రంగనాథన్, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ రమణ, ఏపీ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్ కుమార్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తదితరులు

మరో సమరానికి తెరాస సన్నద్ధం

- రెండు దశల్లో ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రకటన
- తొలుత ఉపాధ్యాయ, పట్టభద్ర నియోజకవర్గాలకు ఎంపిక
- తర్వాత మిగిలిన స్థానాలపై దృష్టి

3 లో

మంత్రివర్గ విస్తరణలో సమతూకం

- ప్రధాన సామాజికవర్గాలకు అవకాశం
- 17 జిల్లాలకు ప్రాతినిధ్యం
- ముఖ్యమంత్రి కేసీఆర్ యోచన

3 లో

క్యాన్సర్‌పై సర్కారు పోరు

- ముమ్మరంగా ముందస్తు పరీక్షలు
- 12 జిల్లాల్లో 24 లక్షల మందికి..
- అత్యధికులు సిరిసిల్ల జిల్లాలో, అత్యల్ప కేసులు మెదక్‌లో..

3 లో

వారికిక పోలీసు ధ్రువీకరణ తప్పనిసరి

- చిన్నారులుండే కేంద్రాల్లో పని చేసే ఉద్యోగులపై నజర్
- పిల్లల రక్షణకు వాళ్లు హామీపత్రమూ ఇవ్వాలి
- కేంద్ర స్త్రీ, శిశు సంక్షేమశాఖ కొత్త భద్రత, ప్రవర్తనా నియమావళి
- రాష్ట్రాల అభిప్రాయ సేకరణ

6 లో

అంకుర వ్యవసాయం

- సాగులో వినూత్న ప్రయోగాలకు ప్రోత్సాహం
- స్టార్టప్‌లతో కొత్త ఆవిష్కరణలు
- అన్నదాతకు అండగా ఆలోచనల వెల్లువ

ఈనాడు, హైదరాబాద్: వ్యవసాయం దాని అనుబంధ రంగాల్లో సులభంగా సేవలు అందించి రైతులకు సాయపడే వినూత్న ఆలోచన ఉన్న వారికి సాంకేతిక, ఆర్థిక సాయం అందించేందుకు తాము సిద్ధమంటూ కేంద్ర వ్యవసాయశాఖ 'వ్యవసాయ అంకురాల (అగ్రి స్టార్టప్)ను' ప్రోత్సహిస్తోంది. దేశంలోని ఉన్నత విద్యావంతులు, విదేశీవిద్య అభ్యసించిన వారు వినూత్న ఆలోచనలకు ఐటీ పరిజ్ఞానాన్ని జోడించి అంకురాలను ఏర్పాటు చేస్తున్నారు. వీటిద్వారా వ్యవసాయ అనుబంధ రంగాలకు సులభంగా సేవలందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు రాజేంద్రనగర్‌లోని 'జాతీయ వ్యవసాయ విస్తరణ, నిర్వహణ సంస్థ' (మేనేజ్) స్పష్టం చేసింది. అంకురాల ఏర్పాటుకు ఆసక్తి గల వారు మేనేజ్ వెబ్‌సైట్‌లో వివరాలను చూడవచ్చని సంస్థ సంచాలకుడు శరవణన్ 'ఈనాడు'కు చెప్పారు. ...మిగతా 2లో



మహిళా కూలీలు భుజానికి తగిలించుకుని మందు చల్లే యంత్రాన్ని ప్రదర్శిస్తున్న మేనేజ్ ఇంక్యుబేషన్ కేంద్రం ప్రొఫెసర్ సాగర్‌దాస్

తెగులు..

పంటకు ఏదైనా తెగులు సోకితే దానికి ఏం రసాయన మందు వాడాలో తెలియదు. రైతు దుకాణదారు ఇచ్చిన మందు చల్లుతున్నాడు. దానికి తెగులు తగ్గకపోతే రైతు మళ్లీ దుకాణానికి వెళ్లి మరో మందు తీసుకుని మళ్లీ పిచికారి చేస్తున్నాడు. ఇదీ ఇప్పుడు గ్రామాల్లో జరిగే తంతు..

పరిష్కారం

“మొక్కలో తెగులు సోకిన ఆకులను స్మార్ట్‌ఫోన్‌లో ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడు చేయాలి. వెంటనే సోకిన తెగులు, దానికి వాడాల్సిన మందు వివరాలు ఫోన్ తెరపై యాప్‌లో కనిపిస్తాయి. నేరుగా దుకాణానికి వెళ్లి ఆ మందు కొని పంటపై చల్లితే చాలు” ఇది దిల్లీకి చెందిన ఓ యువకుడి వచ్చిన ఆలోచన. దీన్ని 'పెస్టోజ్' పేరుతో అంకురం అభివృద్ధి చేసేందుకు మేనేజ్ సాంకేతిక సహకారం అందించింది.

ఇదీ సంగతి!



మనకాయన పాతబాసే, కాని ఇప్పుడు మనం ఆయన్ను విచారణ జరపటానికి వచ్చాం, ఏంటది?!



యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రధాన మంటపం లోపలి భాగం



యాదాద్రి బాలాలయంలో ఆదివారం స్వామివారిని దర్శించుకున్న అనంతరం అర్చకుల ఆశీర్వాదం తీసుకుంటున్న సీఎం కేసీఆర్. గాదరి కిశోర్, సంతోష్‌కుమార్, గొంగిడి సునీత తదితరులు



యాదాద్రి ఆలయ అభివృద్ధి ప్రణాళిక నమూనా పటాన్ని పరిశీలిస్తున్న సీఎం కేసీఆర్

మహా దివ్యక్షేత్రంగా యాదాద్రి

ఈనాడు - నల్గొండ

స్వయంభువులతో విలసిల్లుతున్న యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ విస్తరణ పనులు భేషుగ్గా సాగుతున్నాయని.. ఇవి మరింత వేగవంతం కావాలని ముఖ్యమంత్రి కేసీఆర్ పేర్కొన్నారు. ఆలయ ఖ్యాతిని ప్రపంచ నలుదిశలా చాటేందుకే అద్భుత శిల్పకళా సంపదతో పునర్నిర్మిస్తున్నామని వెల్లడించారు. రెండోసారి ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యాక తొలిసారిగా ఆదివారం యాదాద్రికి వచ్చిన కేసీఆర్ దాదాపు ఆరుగంటల పాటు పనుల పరిశీలన, సమీక్షలతో తీరిక లేకుండా గడిపారు. విహంగ వీక్షణంలో పరిసర ప్రాంతాలను పరిశీలించారు. క్షేత్రానికి ఉదయం 11.50 గంటలకు చేరుకున్న ముఖ్యమంత్రి బాలాలయాన్ని సందర్శించి స్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం పండితుల వేదాశీర్వచనం పొందారు. అనంతరం కొండపై జరుగుతున్న పనులను పరిశీలించారు. ఆ తర్వాత ఆలయ నగరిలో విలేకర్లతో మాట్లాడారు.

"ఆలయాలు వర్తమాన, భవిష్యత్ తరాల మధ్య సంస్కృతీ, సంస్కారాన్ని బదిలీ చేసే వారధులు. సమైక్య రాష్ట్రంలో మన దేవుడు మనకు కాకుండా పోయాడు. స్వరాష్ట్రంలో మన ఆలయాలను బాగు చేసుకోవాల్సిన అవసరం ఉంది. అందుకే రెండు వేల ఏళ్లపాటు మన్నికగా ఉండేలా యాదాద్రి పునర్నిర్మాణ పనులు సాగుతున్నాయి.

"యాదాద్రి గొప్ప క్షేత్రంగా రూపొందుతోంది. ఉద్యమ నాయకుడిగా తెలంగాణలోని అన్ని సమస్యలు చూశాను. ఇప్పుడు వాటిని దశలవారీగా పరిష్కరించుకుంటూ వస్తున్నాం. శక్తిపీఠంగా పేరుగాంచిన జోగులాంబ ఆలయం గతంలో అభివృద్ధికి నోచుకోలేదు. పుష్కరాల సమయంలో నేను అక్కడే జోగులాంబ పేరుతో ఘాట్ కట్టించి స్నానం చేశాను. ఇప్పుడు స్వరాష్ట్రంలో ఆ క్షేత్రం ప్రశస్తి పొందుతోంది.

"ఎక్కడా లేనివిధంగా యాదాద్రిలో మహారాజ గోపురంతోపాటు అన్ని గోపురాలు, మండపాలు కృష్ణశిలతోనే రూపొందుతున్నాయి. ఇది చాలా అరుదైన విషయం. రామలింగేశ్వరుడి ఆలయం సైతం మహాద్భుతంగా రూపొందుతోంది. వారాంతాల్లో ఈ క్షేత్రానికి 70 నుంచి 80 వేల మంది భక్తులు వస్తున్నారు. వారికి అవసరమయ్యే అన్ని సౌకర్యాలు కల్పించే విధంగా పనులు సాగుతున్నాయి. ఈ పనులన్నీ పూర్తయితే ప్రపంచంలోనే యాదాద్రి ఓగొప్ప పుణ్యక్షేత్రంగా విలసిల్లడంతో పాటు భక్తులు దివ్యమైన ఆధ్యాత్మిక అనుభూతి పొందుతారు.

ఆగమశాస్త్రం ప్రకారమే మార్పులు

ప్రస్తుతం జరుగుతున్న పనుల్లో కొన్ని మార్పులు చేయాల్సిన అవసరం ఉంది. ఇవన్నీ ఆగమ శాస్త్ర ప్రకారమే జరుగుతాయి. చినజీయర్ స్వామి ఆదేశానుసారమే యాగశాల, నిత్య కల్యాణమండపం, రామానుజ కూటమి, గర్భాలయంపై దివ్యవిమాన గోపురం, ఆంజనేయస్వామి మందిరాల పనులు కొనసాగుతున్నాయి. వ్రత మండపం పక్కన రథశాల నిర్మాణంలో వాస్తు ప్రకారం కొన్ని మార్పులు చేయాల్సిఉంది.

మహాకుంభాభిషేకంపై ఊహాగానాలొద్దు

భక్తుల సౌకర్యార్థం పెద్దగుట్టపై ఆలయ నగరి పేరిట కాటేజీల నిర్మాణానికి ఇప్పటికే 250 ఎకరాల్లో లేఅవుట్ పనులు పూర్తయ్యాయి. దాదాపు 1100 ఎకరాల్లో నిర్మించనున్న ఆలయ నగరి కోసం 832 ఎకరాలను సేకరించాం. మరో 250 ఎకరాలను త్వరలోనే సేకరిస్తాం. 250 ఎకరాల్లో 354 ప్లాట్లు అభివృద్ధి చేసి దాతల సహకారంతో కాటేజీలు నిర్మిస్తున్నాం. ఇందులో రూ.2 కోట్లు, రూ.కోటి, రూ.50 లక్షలు, రూ.25 లక్షల వ్యయంతో నిర్మించే కాటేజీలున్నాయి. తిరుపతి, ఇతర పుణ్యక్షేత్రాల్లో ఉన్న విధంగా ఇవి పలు పేర్లతో నిర్మితమవుతాయి. ఇప్పటికే రూ.2 కోట్ల కేటగిరీ కాటేజీల నిర్మాణానికి 43 మంది ముందుకు వచ్చారు. వీటికి డిజైన్‌లను త్వరలోనే రూపొందిస్తాం. నిర్మాణాలను 'యాడా' చేపడుతుందా? లేదా దాతలా? అనేది త్వరలోనే నిర్ణయిస్తాం. ప్రెసిడెన్షియల్ సూట్ల (కాటేజీ)కు సంబంధించి పనులు జరుగుతున్నాయి. ఇవి ఈ ఏడాది సెప్టెంబరు నాటికి పూర్తవుతాయి. మహాకుంభాభిషేకం సమయంలో ఇక్కడకు వచ్చే అతిథులు ఈ సూట్లలో ఆతిథ్యం పొందుతారు. మహాకుంభాభిషేకం ఎప్పుడన్నది స్వయంగా నేనే వెల్లడిస్తా. దయచేసి పత్రికలు ఊహాగానాలకు తావివ్వొద్దు.

ఆధ్యాత్మిక సర్క్యూట్ ఏర్పాటు

యాదాద్రి క్షేత్ర రింగురోడ్డుకు కావాల్సిన నిధులను మంజూరు చేశాం. పనులు ఇప్పటికే మొదలయ్యాయి. ఈ క్షేత్రంతోపాటు సమీపంలోని భువనగిరి ఖిల్లా, కొలనుపాక జైన మందిరంతో కలిపి ఆధ్యాత్మిక సర్క్యూట్‌గా ఏర్పాటు చేస్తాం. ఈ ప్రాంతంలో నిర్మాణం కాబోతున్న బస్వాపూర్ జలాశయానికి సమీపంలో 260 ఎకరాలు ఉంది. మరో 250 ఎకరాలు తీసుకొని హైదరాబాద్ హెచ్ఐసీసీలో ఉన్న హాళ్ల మాదిరిగా నిర్మాణాలు చేస్తాం" అని సీఎం కేసీఆర్ తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఎంపీలు బూర నర్సయ్యగౌడ్, సంతోష్‌కుమార్, బడుగుల లింగయ్య, స్థానిక ఎమ్మెల్యే సునీత, మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, ఉమా మాధవరెడ్డి, ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, గాదరి కిశోర్, సీఎం కార్యాలయ కార్యదర్శి భూపాల్‌రెడ్డి, యాదాద్రి కలెక్టర్ అనితా రామచంద్రన్, యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధి ప్రాధికార సంస్థ (యాడా) ఉపాధ్యక్షుడు కిషన్‌రావు, ఆలయ ఈవో గీతారెడ్డి, ఆలయ శిల్పి ఆనంద్‌సాయి, స్థపతి వేలు తదితరులు పాల్గొన్నారు.

భూ సేకరణకు రూ. 70 కోట్లు విడుదల

ఆలయం కుడివైపున రహదారులు, ఇతర నిర్మాణాలకు కావాల్సిన 173 ఎకరాల భూసేకరణకు సంబంధించి అధికారులతో మాట్లాడి ఇప్పుడే రూ.70 కోట్ల నిధులు విడుదల చేశాం. కొండ కింద ఉన్న గండిచెరువును జూన్‌లో కాళేశ్వరం జలాలతో నింపి అందులో స్వామి వారి తెప్పోత్సవాన్ని నిర్వహిస్తాం. 173 ఎకరాలకుగాను 143 ఎకరాల్లో ప్రయాణ ప్రాంగణం, క్యూకాంప్లెక్స్, దుకాణాల సముదాయం నిర్మిస్తాం. బ్రహ్మోత్సవాల సమయంలో సుమారు 2 లక్షల మంది భక్తులు వచ్చినా కొండ కింద కల్యాణం నిర్వహించడానికి నిర్మాణాలు చేస్తాం. నిత్యాన్నదాన సత్రాలను నిర్మించనున్నాం. రూ.10 కోట్లతో నిత్యాన్నదాన సత్రాన్ని నిర్మించేందుకు వేగ్నాస్ సంస్థ ముందుకొచ్చింది. ఇంకా చాలా మంది దాతలు ముందుకు వస్తున్నారు. గంధమల్ల, బస్వాపూర్ జలాశయాలు సైతం సమీపంలో నిర్మిస్తుండటంతో ఈ ప్రాంతమంతా ఆధ్యాత్మికతతోపాటు ఆర్థికంగానూ అభివృద్ధి చెందుతుంది.

మోదీ X దీదీ

సీబీఐ X పోలీస్

(మొదటిపేజీ తరువాయి)

'బెంగాల్‌పై భాజపా కత్తికట్టింది. రాష్ట్రాన్ని నాశనం చేయాలని చూస్తోంది. విపక్షాల ఐక్యత సభను ఇక్కడ నిర్వహించినందుకే ఇదంతా చేస్తోంది. ఇది ముమ్మాటికీ రాజకీయ ప్రతీకారమే. సాక్షాత్తూ ప్రధాని నన్ను బెదిరించేలా ఎలా మాట్లాడారో చూశారుగా... ఉన్నతాధికారుల్ని వేధించడం ద్వారా రాష్ట్రంలో రాజకీయ తుపాను సృష్టించాలని భాజపా ప్రయత్నిస్తోంది. రాష్ట్రంలో తిరుగుబాటు రావాలని మోదీ-అమిత్‌షా ద్వయం కోరుకొంటోంది. ప్రధాని ఆదేశాలకు లోబడి రాజకీయ ప్రత్యర్థుల్ని వేధించడానికి జాతీయ భద్రత సలహాదారుడు అజిత్ డోభాల్ తగు రీతిలో ఆదేశాలిస్తున్నారు. చేతికి రక్తపు మరకలు అంటిన చరిత్ర ఉన్న ఇలాంటి ప్రధాని గురించి మాట్లాడడానికి నేను సిగ్గుపడుతున్నా' అని నిప్పులు చెరిగారు. ప్రాణాలనైనా అర్పిస్తానే గానీ కేంద్ర సర్కారు ముందు తలొంచేది లేదని చెప్పారు. కమిషనర్ కుమార్ ప్రపంచంలోనే ఉన్నతమైన అధికారి అని నేను ఇప్పటికీ చెప్పగలను అని స్పష్టం చేశారు. 'శారద యజమానుల్ని అరెస్టు చేసింది మేం. విచారణకు సిట్‌ను ఏర్పాటు చేసింది మేం. పోలీసులకు రక్షణ కల్పించడం ప్రభుత్వాధినేతగా నా బాధ్యత. సీబీఐ అధికారుల్ని అరెస్టు చేసే అవకాశమున్నా విడిచిపెట్టాం. శాంతిభద్రతలు రాష్ట్రానికి సంబంధించిన అంశం. సీబీఐకి అన్నింటినీ మేమెందుకు ఇవ్వాలి? వారెంటు లేకుండానే కమిషనర్ నివాసంపైకి రావడానికి వారికి ఎంత ధైర్యం?' అని ప్రశ్నిస్తూ అపర కాళిక అయ్యారు. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని ఎన్డీయే సర్కారు కోరుకొంటోందా అని ప్రశ్నించారు. ప్రస్తుత అత్యవసర పరిస్థితుల దృష్ట్యా సోమవారం శాసనసభలో రాష్ట్ర బడ్జెట్ సమర్పణకు తాను హాజరు కావడం లేదని ప్రకటించారు. విపక్ష నేతలైన చంద్రబాబు (తెదేపా), అఖిలేశ్ యాదవ్ (సమాజ్‌వాదీ), తేజస్వీ యాదవ్(ఆర్జేడీ), ఒమర్ అబ్దుల్లా (నేషనల్ కాన్ఫరెన్స్), అహ్మద్ పటేల్ (కాంగ్రెస్), ఎం.కె. స్టాలిన్ (డీఎంకే) తదితర నేతలు తనతో ఫోన్లో మాట్లాడి సంఘీభావం ప్రకటించారని చెప్పారు. మోదీ ప్రభుత్వ తీరును ఖండించడానికి కేంద్ర-రాష్ట్ర భద్రత బలగాల సిబ్బందీ ముందుకు రావాలని ఆమె కోరారు. సీబీఐ ఉదంతంపై తాను సోమవారం స్పందిస్తానని కమిషనర్ చెప్పారు. సోమవారం బెంగాల్ అంతటా ఆందోళనలు నిర్వహించేందుకు తృణమూల్ కాంగ్రెస్ సిద్ధమయింది.

సీబీఐ కార్యాలయం చుట్టూ పోలీసులు

పోలీసు కమిషనర్ నివాసం ఉన్న లౌడాన్ స్ట్రీట్ ప్రాంతం సీబీఐకి-రాష్ట్ర పోలీసులకు మధ్య సమరాంగణంగా మారింది. సీపీ నివాసానికి వచ్చిన సీబీఐ అధికారుల్లో కొందరిని పోలీసులు అరెస్టు చేసినట్లు కూడా వార్తలు వచ్చాయి. విధి నిర్వహణలో ఉన్న తమ అధికారుల్ని పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని సీబీఐ పేర్కొంది. అయితే ఈ అరెస్టులపై స్పష్టత కొరవడింది. సీబీఐ అధికారుల్ని అరెస్టు చేయలేదని, సీపీని ప్రశ్నించేందుకు వారివద్ద తగిన పత్రాలు ఉన్నాయో లేదో సరిచూసేందుకే పోలీసు ఠాణాకు తరలించామని సీనియర్ అధికారి ఒకరు వివరణ ఇచ్చారు. తమ ఉన్నతాధికారిపైనే సీబీఐ గురి పెట్టడంతో కోల్‌కతా పోలీసులు దానికి ప్రతిగా సీబీఐ ప్రధాన కార్యాలయం ఉన్న సీజీవో కాంప్లెక్సును చుట్టుముట్టారు. రాత్రి పొద్దుపోయాక అక్కడకు చేరుకున్న కేంద్ర దళాలు వారిచుట్టూ మోహరించాయి. దీంతో మరోసారి ఉద్రిక్తత తలెత్తింది. ఆ తర్వాత కోల్‌కతా పోలీసులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. కోల్‌కతాలో సీబీఐ కార్యాలయాల చుట్టూ సీఆర్‌పీఎఫ్ బలగాలు కనిపిస్తున్నాయి. ఒక రహస్య ఆపరేషన్ నిమిత్తం వచ్చినట్లు మాత్రమే సీబీఐ అధికారులు చెప్పారని, అది ఏమిటని ఎంత ప్రశ్నించినా సంతృప్తికరంగా స్పందన రాలేదని సంయుక్త పోలీసు కమిషనర్ ప్రవీణ్ త్రిపాఠి చెప్పారు. వారివద్ద ఎలాంటి పత్రాలు లేవని స్పష్టం చేశారు. శారదా, రోజ్‌వ్యాలీ పోంజీ కేసుల్లో ప్రత్యేక దర్యాప్తు బృందాలకు నేతృత్వం వహించిన సీపీని కొన్ని పత్రాల నిమిత్తం ప్రశ్నించాల్సి ఉండగా ఆయన పరారీలో ఉన్నారంటూ శనివారమే సీబీఐ ఆరోపించింది. ఆదివారం సీపీ నివాసం వద్దకు వచ్చిన సీబీఐ అధికారులకు, రాష్ట్ర పోలీసులకు మధ్య తోపులాట నెలకొంది. తర్వాత కొంతమంది సీబీఐ అధికారుల్ని షేక్స్పియర్ సారణి పోలీసు ఠాణాకు చర్చల నిమిత్తం తీసుకువెళ్లారు. ఆ వెంటనే మరికొంత మంది అధికారులు ఘటనా స్థలానికి చేరుకోవడంతో ఉద్రిక్తత పెరిగింది. ఆ పరిస్థితుల్లో కొందరు సీబీఐ అధికారుల్ని పోలీసు జీపుల్లోకి నెట్టి, ఠాణాకు తరలించారు. సీపీ కుమార్ నగరంలోనే ఉన్నారని, గత నెల 31న మినహా అన్ని రోజులూ కార్యాలయానికి కూడా వచ్చారని ఆయన కార్యాలయం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. అవాస్తవాలు ప్రచారం చేస్తే చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.



పోలీసు కమిషనర్ రాజీవ్ కుమార్‌ను ప్రశ్నించేందుకు కోల్‌కతా వచ్చిన సీబీఐ అధికారులను ఆదివారం రాత్రి అదుపులోకి తీసుకుంటున్న కోల్‌కతా పోలీసులు



సీబీఐ అధికారులను పోలీసులు ఆదివారం రాత్రి అదుపులోకి తీసుకున్న అనంతరం తన నివాసం నుంచి బయటకు వస్తున్న పోలీసు కమిషనర్ రాజీవ్ కుమార్

నేడు సుప్రీంకు వెళ్తాం: సీబీఐ

కోల్‌కతా సీపీని ప్రశ్నించడానికే తమ అధికారులు వెళ్లారని సీబీఐ సంయుక్త సంచాలకుడు పంకజ్ శ్రీవాస్తవ చెప్పారు. ఆయన తమకు సహకరించకపోవడం వల్లనే వెళ్లాల్సి వచ్చిందన్నారు. సీబీఐ కార్యాలయాలు, అధికారుల నివాసాలను పోలీసులు చుట్టుముట్టారని, తన నివాసం వెలుపలా పోలీసులు ఉన్నారని చెప్పారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారమే తాము నడుచుకుంటున్నామని, సోమవారమే మరోసారి సర్వోన్నత న్యాయస్థానానికే వెళ్లి పరిస్థితి నివేదిస్తామని సీబీఐ వర్గాలు తెలిపాయి.

మమతకు మద్దతు ప్రకటించిన రాహుల్

మమత ఆందోళనకు కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ మద్దతు ప్రకటించారు. ఈ విషయంలో ప్రతిపక్షాలన్నీ ఒకే మాటపై ఉన్నాయని, ఫాసిస్టు శక్తుల్ని అవి ఓడిస్తాయని దిల్లీలో చెప్పారు.

కోల్‌కతా ఘటనను ఖండిస్తున్నా

- ట్విటర్‌లో ఏపీ సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: రాష్ట్రాల్లోని రాజకీయ ప్రత్యర్థులపై దాడులు చేయిస్తూ ప్రధాని నరేంద్రమోదీ, భాజపా అధ్యక్షుడు అమిత్ షాల ద్వయం రాజ్యాంగబద్ధ వ్యవస్థలను ధ్వంసం చేస్తోందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు విమర్శించారు. కోల్‌కతా ఘటనే దీనికి తాజా నిదర్శనమని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ట్విటర్‌లో స్పందించారు.



మేనేజ్‌లోని అంకురాలపై మేధోమథనానికి ఏర్పాటు చేసిన ఇంక్యుబేషన్ కేంద్రం



రాగులు, గోధుమల సహజ పంటల ఉత్పత్తులతో తయారుచేసిన బిస్కెట్లు. వీటి తయారీని కూడా అంకురంగా గుర్తించారు

అంకుర వ్యవసాయం

(మొదటి పేజీ తరువాయి)

ఎవరైనా మేనేజ్‌ను తన ఆలోచనతో సంప్రదిస్తే అది కొత్తగా ఉందని వారు భావిస్తే వెంటనే రూ.5 లక్షలు ఇస్తారు. దాని అభివృద్ధికి ఇంక్యుబేషన్ కేంద్రంలో సదుపాయాలు కల్పించి 3 నెలలు అవకాశమిస్తారు. దాన్ని వ్యాపారంగా మార్చడానికి రూ.20 లక్షలు గ్రాంటుగా ఇస్తారు.

ఏం చేస్తారంటే

దేశవ్యాప్తంగా వినూత్న ఆలోచనలతో అంకురాలు ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చే వారిని గుర్తిస్తారు. వారి ఆలోచనను అంకురంగా మార్చేందుకు మేనేజ్‌తో పాటు రాజేంద్రనగర్‌లోని 'జాతీయ వ్యవసాయ పరిశోధన, నిర్వహణ సంస్థ' (నార్మ్) సాంకేతిక సాయం అందిస్తుంది. ఇప్పటికే మేనేజ్‌లో 17 అంకురాలను వినూత్నమైనవిగా గుర్తించి ప్రారంభించారు. ఏటా దేశవ్యాప్తంగా కృషి వికాస్ కార్యక్రమంలో భాగంగా 100 అంకురాలను ప్రోత్సహించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఐటీ పరిజ్ఞానంతో యాప్‌లు, ఫోన్‌ల ద్వారా సేవలందించే ఆలోచనలకు ఎక్కువగా ప్రోత్సాహమిస్తున్నారు. ఇప్పటివరకూ మేనేజ్‌లో 59,211 మందికి శిక్షణ ఇచ్చారు. వీరిలో దేశవ్యాప్తంగా 25,763 మంది 'వ్యవసాయ క్లినిక్'లు ప్రారంభించారు.

ఉపాధి కల్పన ఇలా

వ్యవసాయ అంకురాలను ప్రారంభించిన వారిలో కొందరు వ్యాపారంగా మార్చి కొందరికి ఉద్యోగాలిచ్చి ఉపాధి కల్పిస్తున్నారు. రాజస్థాన్‌కు చెందిన ఓ యువకుడు తృణధాన్యాల ఉత్పత్తుల విక్రయాలకు అంకురం ఏర్పాటు చేశాడు. హైదరాబాద్‌లోని సుస్థిర వ్యవసాయ కేంద్రం(ఎస్ఎస్ఏ) వారు 'గ్రీన్ దునియా' పేరుతో సామాజిక సంస్థను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా 'ఈ-కృషి ఫార్మర్ సపోర్ట్ సర్వీసు' పేరుతో అంకురం ఏర్పాటు చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించడమే దీని లక్ష్యమని ఈ కేంద్రం వ్యవస్థాపకుడు జీవీ రామాంజనేయులు పేర్కొన్నారు.

సాంకేతిక, ఆర్థిక సాయం అందిస్తాం

-వేమూరి ఉషారాణి, డైరెక్టర్ జనరల్, మేనేజ్, రాజేంద్రనగర్



వ్యవసాయ అనుబంధ రంగాల్లో వినూత్న ఆలోచనలతో ముందుకొచ్చే వారికి సాంకేతిక, ఆర్థిక సాయం అందించడం ద్వారా ప్రోత్సహిస్తాం. పంటల సాగు, పాడి, చేపలు, కోళ్ల పెంపకం, పంటల మార్కెటింగ్ ఇలా రైతులకు ఉపయోగపడే కార్యక్రమం ఏదైనా అంకురం ఏర్పాటుకు ముందుకు రావచ్చు. దేశవ్యాప్తంగా భారత వ్యవసాయ పరిశోధన మండలికి చెందిన సంస్థల్లో పనిచేసే అనుభవజ్ఞులైన శాస్త్రవేత్తలతో సలహాలు, సూచనలు అందిస్తాం. మేనేజ్‌లో ఇంక్యుబేషన్ కేంద్రం ఏర్పాటు చేశాం.

చదవకుంటే అంతం!

ఒక సంస్కృతినిగానీ, నాగరికతనుగానీ ధ్వంసం చెయ్యాలంటే వాళ్లకు సంబంధించిన గ్రంథాలనేం దహనం చెయ్యాల్సిన పని లేదు. వాళ్లెవరూ ఆ పుస్తకాలు చదవకుండా చేస్తే చాలు!

- మహాత్మా గాంధీ

గ్రహం అనుగ్రహం

4-2-2019 సోమవారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
హేమంత రుతువు; పుష్య మాసం; బహుళ పక్షం
అమావాస్య: రా. 1.26 తదుపరి మాఘశుద్ధ పాడ్యమి
శ్రవణం నక్షత్రం: రా. 5.14 తదుపరి ధనిష్ట
అమృతఘడియలు: రా. 5.45 నుంచి 7.31 వరకు
వర్జ్యం: ఉ. 7.09 నుంచి 8.55 వరకు
దుర్ముహూర్తం: ప. 12.37 నుంచి 1.22 వరకు
తిరిగి మ. 2.52 నుంచి 3.38
రాహుకాలం: ఉ. 7.30 నుంచి 9.00 వరకు
సూర్యోదయం: ఉ.6-36; సూర్యాస్తమయం: సా.5.53

క్యాన్సర్‌పై సర్కారు పోరు

★ హైదరాబాద్ సంతోష్‌నగర్‌కు చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగి ఆర్.లక్ష్మీనారాయణ. ఈయన కుమారుడు ఆర్.ధీరజ్‌కుమార్(8)కి నాలుగేళ్ల వయసులో తరచూ జ్వరం వచ్చేది. వైద్యులు పలు పరీక్షలు నిర్వహించాక.. రక్తక్యాన్సర్ ఉన్నట్లు నిర్ధరించారు. ఎంఎన్‌జే ఆసుపత్రిలో అబ్బాయిని చేర్పించి, పూర్తిస్థాయిలో ఉచితంగా చికిత్స పొందారు. బాలుడు ఇప్పుడు ఆరోగ్యంగా ఉన్నాడు.

★ హైదరాబాద్‌కు చెందిన కె.అనూరాధ(51) మధ్యతరగతి గృహిణి. 46 ఏళ్ల వయసులో రొమ్ముల్లో అసహజమైన మార్పులు జరుగుతున్నట్లుగా పసిగట్టారు. వైద్యులు క్యాన్సర్ అని నిర్ధరించారు. 2015లో ఎంఎన్‌జే ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఇప్పుడు ఆమె ఆరోగ్యంగా ఉన్నారు.

ఈ రెండు కేసుల్లోనూ ప్రాథమిక దశలోనే క్యాన్సర్‌ను నిర్ధరించడంతో చికిత్స సాధ్యమయింది. క్యాన్సర్ వచ్చిందని తెలియగానే కుంగిపోకుండా ధైర్యంగా వ్యవహరించడం కూడా క్యాన్సర్‌పై విజయానికి కారణమైనట్లు ఈ వ్యాధిని జయించినవారు, వారి కుటుంబ సభ్యులు చెబుతున్నారు.



- 12 జిల్లాల్లో 24 లక్షల మంది బాధితుల గుర్తింపు

ఈనాడు, హైదరాబాద్: క్యాన్సర్‌పై తెలంగాణ ప్రభుత్వం విస్తృత కార్యాచరణను అమలు చేస్తోంది. ఇప్పటివరకు 24 లక్షల మందికి పైగా క్యాన్సర్ ముందస్తు పరీక్షలు నిర్వహించారు. సుమారు 7 వేల మంది గర్భాశయ ముఖద్వార, రొమ్ము క్యాన్సర్ అనుమానితులను గుర్తించి, నిర్ధరణ కోసం వీరిని సమీపంలోని ప్రాంతీయ, జిల్లా, బోధనాసుపత్రులకు పంపించారు. గతేడాది ముందస్తు క్యాన్సర్ పరీక్షల్లో అత్యధికంగా సిరిసిల్ల జిల్లాలో 144 గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ కేసులను, అత్యల్పంగా మెదక్ జిల్లాలో 73 రొమ్ము క్యాన్సర్ కేసులను నిర్ధరించినట్లు వైద్యవర్గాలు తెలిపాయి.


గతేడాది ఎంఎన్‌జేలో నమోదైన క్యాన్సర్ కేసులు

గర్భాశయ ముఖద్వార	1,204
రొమ్ము	1,320
ఊపిరితిత్తులు	652
ఎముక	225
కాలేయం	130
రక్తక్యాన్సర్	569

కుంగుబాటుకు.. స్థైర్యానికి మధ్య 12% వ్యత్యాసం

క్యాన్సర్ విజేతల్లో ఎక్కువ భాగం ఉమ్మడి కుటుంబాల్లో ఉండగా.. వ్యష్టి కుటుంబాల్లో రోగులు కోలుకోవడానికి ఎక్కువ సమయం తీసుకుంటున్నారని ఇటీవల ఒక అధ్యయనం పేర్కొంది. వీరిద్దరి మధ్య 12% వ్యత్యాసం ఉందని తేల్చింది. ప్రపంచంలో మరణాలకు దారితీసే ముఖ్యకారణాల్లో మొదటిది గుండెపోటు.. రెండోస్థానంలో నిలిచేది క్యాన్సర్. 30-40 ఏళ్ల వయసులోనూ 10% క్యాన్సర్ కేసుల పెరుగుదల ఉండటం ఆందోళన కలిగించే అంశం.

ముందస్తు పరీక్షలను విస్తరిస్తాం



తెలంగాణ ప్రభుత్వం క్యాన్సర్‌పై యుద్ధం ప్రకటించింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయిలోనే క్యాన్సర్‌లను గుర్తించే పరీక్ష విధానాలపై నర్సులు, ఏఎన్ఎంలకు శిక్షణ ఇచ్చాం. జీవనశైలి వ్యాధుల నివారణ పథకంలో భాగంగా రాష్ట్రంలో సిరిసిల్ల, జగిత్యాల, జనగామ, జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్, మహబూబాబాద్, పెద్దపల్లి, వరంగల్ పట్టణ, వరంగల్ గ్రామీణ, మెదక్, సంగారెడ్డి, సిద్ధిపేట, 12 జిల్లాల్లో క్యాన్సర్‌ను కనుగొనే ముందస్తు పరీక్షల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా ఈ పరీక్షల విధానాన్ని విస్తరించనున్నాం.

– డా. విక్రమ్, సంయుక్త సంచాలకులు, జీవనశైలి వ్యాధుల నివారణ పథకం

విస్తృత అవగాహన కల్పించాలి



'హెపటైటిస్ బి, సి' లు కాలేయ క్యాన్సర్లకు, హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ) గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ రావడానికి కారణమవుతున్నాయి. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌కు టీకా అందుబాటులో ఉంది. 8-18 ఏళ్ల వయసు వాళ్లకు ఈ టీకా ఇవ్వాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచిస్తోంది. కాలేయ క్యాన్సర్‌కు హెపటైటిస్ టీకా ఉంది. 40 ఏళ్లు దాటిన మహిళ ప్రతి ఏడాదికోసారి మ్యామోగ్రఫీ, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలి.

– డాక్టర్ శ్రీకాంత్, క్యాన్సర్ శస్త్రచికిత్స నిపుణులు

జిమ్స్ లక్ష్యం క్యాన్సర్ రహిత దేశం

చినజీయర్ స్వామి



శంషాబాద్ గ్రామీణ, న్యూస్‌టుడే: క్యాన్సర్ మహమ్మారిని తరిమికొట్టాలంటే ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని త్రిదండి రామానుజ చినజీయర్ స్వామి చెప్పారు. సోమవారం ప్రపంచ క్యాన్సర్ దినాన్ని పురస్కరించుకుని శంషాబాద్ పరిధి శ్రీరామ నగర్‌లోని జిమ్స్ హోమియోపతిక్ వైద్య కళాశాలలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి చినజీయర్ స్వామి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. క్యాన్సర్ కారణాలు, లక్షణాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చికిత్స విధానాలపై ప్రముఖ వైద్య నిపుణులు మోహన్‌వంశీ అవగాహన కల్పించారు. చినజీయర్ స్వామి మాట్లాడుతూ..దేశాన్ని క్యాన్సర్‌రహితంగా తీర్చిదిద్దడంలో భాగంగా వికాస తరంగిణి, జిమ్స్ సంస్థల సౌజన్యంతో మహిళా ఆరోగ్య వికాస్‌కు శ్రీకారం చుట్టామని తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, నేపాల్‌లో 863 ఉచిత క్యాన్సర్ నిర్ధారణ వైద్యశిబిరాలను ఏర్పాటు చేసి మహిళలకు పరీక్షలు నిర్వహించినట్లు వివరించారు. 40వేల మందిలో ఈ వ్యాధి ప్రారంభ దశలో ఉన్నట్లు గుర్తించి వైద్యం అందించామన్నారు. త్వరలోనే 120 వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి 60వేల మంది మహిళలకు క్యాన్సర్ పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు.

స్క్రీనింగ్ శిబిరానికి గిన్నిస్ ఘనత

మహబూబాబాద్, న్యూస్‌టుడే: మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన మెగా ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించింది. ఈ మేరకు సంస్థ ప్రతినిధి రిషినాథ్ ధ్రువపత్రాన్ని శిబిరం నిర్వాహకుడు డాక్టర్ ఎ.రాంకిషన్‌నాయక్, ఫౌండేషన్ ప్రతినిధులకు అందజేశారు. ప్రపంచ క్యాన్సర్ దినం సందర్భంగా గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్, కలెక్టివ్ పవర్ ఆఫ్ వన్-అమెరికా సహకారంతో డిప్యూటీ డ్రగ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా డాక్టర్ ఎ.రాంకిషన్‌నాయక్ ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహించారు. గతంలో ఈ విభాగంలో 2,499 మందికి పరీక్షలు నిర్వహించినట్లు రికార్డు నమోదవగా, దాన్ని అధిగమిస్తూ ఆదివారం 4,578 మందితో కొత్త రికార్డును సాధించినట్లు రిషినాథ్ తెలిపారు. దేశ, విదేశీ వైద్య నిపుణులు 200 మందితో ఈ శిబిరంలో పరీక్షలు నిర్వహించారు. 800 మందికి పైగా వైద్య సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, కరీంనగర్ జిల్లాల్లోని వివిధ ప్రాంతాల నుంచి పరీక్షల కోసం వచ్చేవారిని ప్రత్యేక బస్సుల్లో తీసుకొచ్చారు. క్యాన్సర్‌తో పాటు వివిధ వ్యాధులకు సంబంధించిన నిర్ధరణ పరీక్షలనూ చేశారు.



శిబిరం నిర్వాహకులకు ధ్రువపత్రాన్ని అందిస్తున్న గిన్నిస్ ప్రతినిధి రిషినాథ్

మంత్రివర్గ విస్తరణలో సమతూకం

- ప్రధాన సామాజికవర్గాలకు అవకాశం
- 17 జిల్లాలకు ప్రాతినిధ్యం
- ముఖ్యమంత్రి కేసీఆర్ యోచన

ఈనాడు – హైదరాబాద్

త్వరలో జరగనున్న మంత్రివర్గ విస్తరణలో ప్రధాన సామాజికవర్గాలు, జిల్లాలకు ప్రాతినిధ్యంలో సమతూకం పాటించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ యోచిస్తున్నారు. ఇందుకు అనుగుణంగా జాబితా రూపొందిస్తున్నారని విశ్వసనీయంగా తెలిసింది. మంత్రివర్గంలోకి గరిష్ఠంగా 18 మందిని మాత్రమే తీసుకోవడానికి అవకాశం ఉండగా.. గత ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు ఒక్కొక్కటి, బీసీలకు నాలుగు, ఓసీలకు 11 మంత్రి పదవులు దక్కాయి. ఈ సారి స్వల్పమార్పులు చోటుచేసుకోనున్నాయి. మొదటి, రెండో దఫా విస్తరణలో పక్కాగా సామాజిక సమీకరణాలు పాటించనున్నారు. ఇప్పటికే మంత్రివర్గంలో ముఖ్యమంత్రి కేసీఆర్, హోం మంత్రి మహమూద్ అలీ ఉన్నారు. కేసీఆర్ ఓసీ కోటాలో ఉండగా.. మైనారిటీ కోటా కింద మహమూద్‌అలీకి అవకాశం కల్పించారు. ఎస్సీ, ఎస్టీ కోటాతోపాటు మహిళా కోటా కింద మంత్రుల నియామకం ఖాయమని తెలుస్తోంది. మరోవైపు ఎన్నికల్లో తెరాస తరపున 20 మంది బీసీలు గెలిచారు. దీంతో వారికి మరో స్థానం అదనంగా కేటాయించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ భావిస్తున్నట్లు సమాచారం. మొత్తం కేబినెట్ కూర్పులో ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, మహిళా మంత్రులు ఒక్కొక్కరు.. బీసీ కోటాలో నలుగురు, ఓసీ కోటాలో పదిమందికి అవకాశం దక్కే సూచనలు ఉన్నాయి. మహిళా మంత్రిగా రేఖా నాయక్ లేదా పద్మా దేవేందర్‌రెడ్డి నియమితులైతే ఈ సమీకరణలో కొంత మార్పు వస్తుంది. రేఖా నాయక్ మంత్రి అయితే మహిళా, ఎస్టీ కోటా రెండింటి కింద ఆమెను పరిగణిస్తారు. ఒకవేళ పద్మా దేవేందర్‌రెడ్డికి అమాత్యా పదవి లభిస్తే.. ఓసీ, మహిళా రెండూ కోటాల్లో పరిగణించే అవకాశాలున్నాయి. ఇక బీసీ కోటా కింద బలమైన సామాజికవర్గాల నుంచి ఒక్కొక్కరు చొప్పున ఈటల రాజేందర్, శ్రీనివాస్‌గౌడ్, తలసాని శ్రీనివాస్‌యాదవ్/నోముల నర్సింహయ్య, దాస్యం వినయ్ భాస్కర్/బాజిరెడ్డి గోవర్ధన్/జోగు రామన్నలకు అవకాశం దక్కనుందని తెలిసింది. ఓసీ కోటాలో పోటీ బాగానే ఉంది. మాజీ మంత్రులు కేటీఆర్, తన్నీరు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి/గుత్తా సుఖేందర్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి/లక్ష్మారెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, పట్నం నరేందర్‌రెడ్డి, పువ్వాడ అజయ్ కుమార్‌లు ఈ జాబితాలో ఉన్నారు.

మొదటి విడతలో..

మొదటి విడత విస్తరణలో ఎనిమిది మందిని కొత్తగా తీసుకునే వీలుంది. ఇందులో ఎస్సీ, ఎస్టీ, మహిళా కోటా నుంచి ఒక్కొక్కరు, బీసీల నుంచి ఇద్దరు, మిగిలిన సామాజికవర్గాల నుంచి ముగ్గురు ఉండే అవకాశం ఉంది. రెండో విడతలో బీసీలు ఇద్దరు, ఆరుగురు ఓసీలు ఉండనున్నట్లు సమాచారం.

కొత్త జిల్లాల కిందే..

గత మంత్రివర్గంలో పది ఉమ్మడి జిల్లాల కింద హైదరాబాద్‌కు నాలుగు, మెదక్, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాలకు రెండేసి, నిజామాబాద్, ఖమ్మం, నల్గొండ, రంగారెడ్డిలలో ఒక్కొక్కరికి మంత్రివర్గంలో స్థానాలు దక్కాయి. ఆ తర్వాత జిల్లాల సంఖ్య పెరిగింది. ప్రస్తుతం 31 ఉండగా... త్వరలో మరో రెండు ఏర్పాటుకానున్నాయి. సిద్దిపేట జిల్లా నుంచి ఇద్దరి(కేసీఆర్, హరీశ్‌రావు)తోపాటు, మిగిలిన 16 జిల్లాల నుంచి ఒక్కొక్కరికి చోటు దక్కే అవకాశం ఉంది. పార్లమెంటరీ రాజకీయ కార్యదర్శులు, శాసనసభ చీఫ్ విప్, విప్‌ల పదవులకు మిగతా జిల్లాలను పరిగణనలోనికి తీసుకునే వీలుంది.

అమెరికాలో అరెస్టైన విద్యార్థులందర్నీ కలుస్తాం

భారత రాయబారి హర్షవర్ధన్ శృంగ్లా వెల్లడి

దిల్లీ, వాషింగ్టన్: వీసాల దుర్వినియోగం ఆరోపణలపై అమెరికాలో అరెస్టయిన విద్యార్థులందర్నీ సోమవారంలోగా మనదేశ దౌత్యాధికారులు కలవనున్నారు. అమెరికాలో భారత రాయబారి హర్షవర్ధన్ శృంగ్లా ఆదివారం ఈ విషయాన్ని స్పష్టం చేశారు. అరెస్టయిన విద్యార్థులకు భారత ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. అమెరికా వ్యాప్తంగా అన్ని నిర్బంధ కేంద్రాలకు దౌత్యాధికారులు వెళ్తున్నారని.. విద్యార్థుల పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారని చెప్పారు. అరెస్టయిన వారందర్నీ సోమవారంలోగా కలుస్తామన్నారు. ఇప్పటికే పలువురు విద్యార్థులతో తాము మాట్లాడినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం అనుసరించేందుకు వీలుగా ఉన్న పలు న్యాయమార్గాలను విద్యార్థులకు తాము వివరిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల అరెస్టు వ్యవహారాన్ని అత్యంత ప్రాధాన్య అంశంగా గుర్తించి, వారికి సహాయం చేసేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని విదేశాంగ శాఖ నుంచి తమకు ఆదేశాలు అందాయని హర్షవర్ధన్ వెల్లడించారు. అమెరికా ఇమిగ్రేషన్ అధికారులు వలపన్ని, నకిలీ వర్సిటీని ఏర్పాటుచేసి, విద్యార్థి వీసాలను దుర్వినియోగం చేస్తున్న 130 మంది విద్యార్థులతోపాటు ఎనిమిది మంది దళారులను బుధవారం అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. అరెస్టయిన విద్యార్థుల్లో ఒక్కరు మినహా అందరూ భారతీయులే.

ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు ఎంతో అవసరం

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: ప్రస్తుతం దేశంలో ఉన్న పరిస్థితుల నేపథ్యంలో ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు ఎంతో అవసరమని వక్తలు అభిప్రాయపడ్డారు. ఇన్నాళ్లుగా దేశాన్ని పాలించిన జాతీయ పార్టీలు రాష్ట్రాల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపాయని విమర్శించారు. తెలంగాణ సీఎం కేసీఆర్ ప్రతిపాదించిన ఫెడరల్ ఫ్రంట్‌కు అందరి సహకారం అవసరమన్నారు. ఆదివారం హైదరాబాద్ లక్డీకాపూల్‌లోని ఓ హోటల్‌లో మాదిగ ఐకాస, బీసీ జనసభ సంయుక్త ఆధ్వర్యంలో 'భారతదేశ రాజ్యాంగం, సమాఖ్య స్ఫూర్తి, ఫెడరల్ ఫ్రంట్ ఆవశ్యకత' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. మాదిగ ఐకాస వ్యవస్థాపక అధ్యక్షుడు పిడమర్తి రవి, బీసీ జన సభ అధ్యక్షులు రాజారాం యాదవ్‌ల అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఫెడరల్ స్ఫూర్తితో ఈ ఫ్రంట్ దేశానికి మార్గనిర్దేశం చేస్తుందని చెప్పారు. కొందరు లక్ష్యంపై అవగాహన లేకుండా జాతీయ పార్టీ అండ లేకుండా ఎలా సాధ్యమని తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. బీసీ కమిషన్ ఛైర్మన్ బీఎస్ రాములు మాట్లాడుతూ..పరిపాలనలో మార్పు రావాలన్నా, సామాజిక న్యాయం జరగాలన్నా, అధికార వికేంద్రీకరణతోనే సాధ్యమని చెప్పారు. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ శ్రీధర్ మాట్లాడుతూ.. కేంద్రంలో ఎవరు అధికారంలో ఉన్నా ప్రధానమైన వ్యవస్థల్ని ఆధీనంలో ఉంచుకుని భ్రష్టు పట్టిస్తున్నారని విమర్శించారు. ప్రెస్ అకాడమి ఛైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ..రాష్ట్రాలకు మరిన్ని హక్కులు రావాలంటే ఫెడరల్ ఫ్రంట్ అవసరమన్నారు.

ఎంపీ కవితకు ప్రపంచ తెలుగు మహిళా సదస్సు ఆహ్వానం

బర్కత్‌పుర, న్యూస్‌టుడే: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మలేసియా తెలుగు మహిళా సంఘం, ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవెలప్‌మెంట్ అసోసియేషన్‌ల సంయుక్తాధ్వర్యంలో ప్రపంచ మహిళాసదస్సును నిర్వహించనున్నారు. దీనిని మార్చి 2, 3వ తేదీలలో మలేసియాలోని కౌలాలంపూర్‌లో నిర్వహించనున్నట్లు నిర్వహణా కమిటీ ప్రతినిధులు వినయ్‌కుమార్, జఫన్యా, కోమలరాణి, ప్రమీల, జ్యోత్స్న తదితరులు తెలిపారు. ఈ సదస్సుకు తెరాస ఎంపీ కవితను ఆహ్వానించినట్లు, సదస్సుకు సంబంధించిన ప్రత్యేక బ్రోచర్‌ను ఆమెతో ఆవిష్కరింపజేసినట్లు వారు పేర్కొన్నారు.

తెలంగాణ సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

యాదవ మహిళావేదిక ఛైర్‌పర్సన్ శ్రీదేవి

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని అఖిల భారత యాదవ మహిళావేదిక ఛైర్‌పర్సన్ బొంతు శ్రీదేవి యాదవ్ అన్నారు. గొర్రెల పెంపకం వంటి పథకం ద్వారా గొల్ల, కురుమల కోసం అధిక నిధులను తెలంగాణ ప్రభుత్వం వెచ్చిస్తోందని తెలిపారు. మహారాష్ట్రలోని నాందేడ్‌లో ఆదివారం జరిగిన గొల్ల-గొల్లేవార్ యాదవ జాతీయ సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్ చవాన్, మంత్రులు, వివిధ రాష్ట్రాల యాదవ ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరయ్యారు. శ్రీదేవి యాదవ్ మాట్లాడుతూ.. తెలంగాణ సంక్షేమ పథకాలను వివరించారు.

మరో సమరానికి తెరాస సన్నద్ధం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో మరో ఎన్నికల సందడి మొదలైంది. ఎమ్మెల్సీ ఎన్నికలకు సమయం సమీపిస్తుండటంతో పలువురు ఆశావహులు తమ ప్రయత్నాలను ప్రారంభించారు. ఈ నేపథ్యంలో శాసనసభలో ఖాళీ అయిన, మార్చిలో ఖాళీ కానున్న స్థానాల భర్తీకి జరగనున్న ఎన్నికలకు తెరాస సన్నద్ధమవుతోంది. పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ అభ్యర్థుల ఎంపికపై కసరత్తు ప్రారంభించారు. రెండు దశల్లో అభ్యర్థులను ప్రకటించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ముందుగా ఉపాధ్యాయ, పట్టభద్ర నియోజకవర్గాలకు అభ్యర్థులను ఎంపిక చేసి, తర్వాత మిగిలిన స్థానాలపై దృష్టి సారించనున్నారు. శాసనసభ్యుల కోటాలో ఏడు, స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి అయిదు, ఉపాధ్యాయ నియోజకవర్గం రెండు, పట్టభద్రుల నియోజకవర్గం ఒకటి, గవర్నర్ కోటాలో ఒకటి.. మొత్తంగా 16 స్థానాలు ఖాళీ అవుతున్నాయి.

ఎవరెవరికి అవకాశాలు

ఉపాధ్యాయ నియోజకవర్గాలకు పాతూరి సుధాకర్‌రెడ్డి, పూల రవీందర్‌ల పేర్లను ముందుగా ప్రకటించే వీలుంది. ఇప్పటికే రవీందర్‌ను పీఆర్‌టీయూ తమ అభ్యర్థిగా ప్రకటించగా ఆయన ప్రచారం చేస్తున్నారు. మెదక్, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ నియోజకవర్గానికి పాతూరిని పోటీ చేయించాలని అధిష్ఠానం భావిస్తోంది. పీఆర్‌టీయూ ఇప్పటికే రఘోత్తమరెడ్డిని తమ అభ్యర్థిగా ప్రకటించినా ఆయనను తప్పించి, మద్దతు పాతూరికి సమీకరించే యత్నాల్లో అధిష్ఠానం ఉంది.

- పట్టభద్రుల నియోజకవర్గానికి పోటీ ఎక్కువగా ఉంది. మాజీ ఎమ్మెల్సీ సత్యనారాయణ, గ్రూపు-1 అధికారుల సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ గౌడ్, గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్య సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదగిరి శేఖర్‌రావు, సరోజినిదేవి కంటి ఆసుపత్రి మాజీ సూపరింటెండెంట్ రవీందర్‌గౌడ్ టికెట్ కోసం శ్రమిస్తున్నారు.
- పదవీవిరమణ పొందుతున్న వారిలో మహమూద్ అలీకి చోటు ఖాయం. ఇప్పటికే ఆయన రాష్ట్ర మంత్రివర్గంలో చోటు పొందారు. గవర్నర్ కోటాలో అవకాశం దక్కనుంది. ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డికి ఎమ్మెల్సీ పదవి ఇవ్వనున్నారు.
- శాసనసభ్యుల కోటాలో స్వామిగౌడ్‌ను మళ్లీ ఎమ్మెల్సీగా నియమించే వీలుంది. లేనిపక్షంలో ప్రత్యామ్నాయంగా మరో పదవి దక్కుతుంది. సీఎంకు సన్నిహితులైన రాజకీయ కార్యదర్శి శేరి సుభాష్‌రెడ్డి, ప్రత్యేకాధికారి దేశపతి శ్రీనివాస్‌లకు శాసనసభ్యుల కోటాలో అవకాశం రానుంది. టీఎస్ఐఐసీ ఛైర్మన్ గ్యాదరి బాలమల్లు ఎమ్మెల్సీ పదవిని ఆశిస్తున్నారు.
- ఎమ్మెస్ ప్రభాకర్ ఎస్సీ కోటాలో, మహ్మద్ సలీం మైనారిటీ కోటాలో చోటు కల్పించాలని తెరాస అధిష్ఠానాన్ని కోరినట్లు తెలిసింది.
- శాసనసభ మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీ మంత్రి చందూలాల్‌లు తమకు ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలని సీఎంకు విన్నవించారు. మరో మాజీ స్పీకర్ సురేశ్‌రెడ్డిని ఎమ్మెల్సీగా చేయాలని సీఎం భావిస్తే ఆయన నిజామాబాద్ స్థానిక సంస్థల కోటా నుంచి లేదా శాసనసభ్యుల కోటాకింద ఎమ్మెల్సీ టికెట్ ఇస్తారు. ఆయనకు రాజ్యసభ స్థానం ఇస్తారనే ప్రచారం జరుగుతోంది. అదే జరిగితే నిజామాబాద్ నుంచి మరోనేతకు ఎమ్మెల్సీగా అవకాశం వస్తుంది. ఎన్నికల సందర్భంగా వివిధ నియోజకవర్గాల్లో టికెట్ కోసం పోటీపడి అధిష్ఠానం హామీతో పనిచేసిన మాజీ మంత్రి పి.రాములు (మహబూబ్‌నగర్), ఇతర జిల్లాలకు చెందిన తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మండల శ్రీరాములు, నందకిశోర్‌వ్యాస్ వంటి వారి పేర్లను పరిశీలనలోకి తీసుకునే వీలుంది. పారిశ్రామిక రంగం నుంచి సుధీర్‌రెడ్డికి టికెట్ ఇవ్వాలని పలుసంఘాల నేతలు సీఎంను కోరారు.
- రంగారెడ్డి స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పదవిలో పోటీ చేయాలని మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి భావిస్తున్నారు. అధిష్ఠానం ఆయనను చేవెళ్ల ఎంపీ స్థానానికి పోటీ చేయించాలనే ఆలోచనలో ఉంది. ఎంపీ స్థానానికి మరొకరిని ఎంపిక చేస్తే ఆయనకు ఎమ్మెల్సీ టికెట్ లభిస్తుంది.
- వరంగల్ స్థానిక సంస్థల స్థానం నుంచి కేటీఆర్ సన్నిహితుడు, పార్టీ కార్యదర్శి పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఎమ్మెల్సీగా పోటీ చేయడం దాదాపు ఖరారైంది.
- నల్గొండ స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి చిన్నపరెడ్డి, చందర్‌రావు, తెలంగాణ జాగృతి ఉపాధ్యక్షుడు రాజీవ్‌సాగర్ తదితర పేర్లు వినిపిస్తున్నాయి. పార్లమెంటు టికెట్‌కు పలువురు ఆసక్తిగా ఉన్నందున స్థానిక సంస్థల నియోజకవర్గానికి పోటీ తక్కువగా ఉంది. మహిళా కోటా కింద మాజీ ఎమ్మెల్యేలు సత్యవతీరాథోడ్, కవిత, కోవా లక్ష్మిలు ప్రయత్నిస్తున్నారు.



సౌరశక్తితో నడిచే కారు

సిద్దిపేట జిల్లా వడ్డేపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి జి.అనిల్ సోలార్ కారును రూపొందించాడు. తక్కువ వ్యయంతో ఎక్కువ కాలం తిరిగే సోలార్ కారు ఇది. శక్తి వనరులు తగ్గిపోతున్న దరిమిలా సౌరశక్తిని ఉపయోగించి పర్యావరణ హితం కోసం దీనిని ఉపయోగించుకోవచ్చు. రాత్రి వేళల్లోనూ ఈ కారు సులభంగా తిరిగే విధంగా యంత్రంలో ఛార్జింగ్ బాక్స్‌ను ఏర్పాటు చేశారు. ఇంధన ఖర్చు లేకుండా తక్కువ వ్యయంతో ఈ కారును ఉపయోగించుకోవచ్చు. ఇలాంటి ఆవిష్కరణలు ఎన్నో వరంగల్‌లో కనిపించాయి. వరంగల్ అర్బన్‌జిల్లా కాజీపేట మండలం మడికొండ సంక్షేమ గురుకుల పాఠశాలలో రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ మనక్ వైజ్ఞానిక పోటీలు రెండో రోజూ కొనసాగాయి. వివిధ జిల్లాల నుంచి 647 ఎగ్జిబిట్లు పోటీలో ప్రదర్శనకు వచ్చాయి. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో తలపెట్టిన ఈ పోటీలనుంచి ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి ఈ నెల 14, 15వ తేదీల్లో దిల్లీలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీలకు పంపించనున్నట్లు ప్రోగ్రాం కన్వీనర్, విద్యాశాఖ ఆర్‌జేడీ.పి.రాజీవ్ తెలిపారు.

– న్యూస్‌టుడే, మడికొండ (వరంగల్)

అత్యంత విలువైన మూడు విగ్రహాల చోరీ

బహ్రెయిచ్: కోట్లాది రూపాయల విలువచేసే అపురూపమైన మూడు అష్టధాతు విగ్రహాలు ఇక్కడి రామ్‌పుర్వా గ్రామంలోని రామాలయం నుంచి చోరీకి గురయ్యాయి. శనివారం రాత్రి ఈ విగ్రహాలు చోరీకి గురైనట్లు ఆలయ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆలయ గేటును కట్ చేసి లోపలికి ప్రవేశించిన దుండగులు సీత, లక్ష్మణుడు, హనుమంతుడి విగ్రహాలను అపహరించుకు పోయారు. శ్రీరాముడి విగ్రహాన్ని మాత్రం గుడిలోనే వదిలేసి వెళ్లిపోయినట్లు పోలీసు అధికారి ఒకరు చెప్పారు.

వ్యవస్థ గౌరవం నిలబెట్టాలి!

అత్యంత ప్రాధాన్యంగల కేదస (సీబీఐ) సంచాలక పదవికి సత్వర నియామకం జరపకుండా తాత్కాలిక ఏర్పాటును దీర్ఘ కాలం కొనసాగించడం మంచిది కాదని సుప్రీంకోర్టు హితవు పలికిన నేపథ్యంలో కేంద్రం వడివడిగా స్పందించింది. మధ్యప్రదేశ్ క్యాడర్‌కు చెందిన మాజీ డీజీపీ రిషి కుమార్ శుక్లాను కేదస కొత్త సారథిగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. కేదస సంచాలక పదవీ నియామకం కోసం జనవరి 24న, మళ్ళీ ఈ నెల రెండున అత్యున్నత స్థాయి త్రిసభ్య కమిటీ భేటీ కావడం తెలిసిందే. రెండు సందర్భాల్లోనూ ఏకీభావం లోపించి కొత్త సంచాలకుడిపై ఎటూ తేల్చకుండానే కమిటీ సమావేశం ముగిసిందని వార్తా కథనాలు ఎలుగెత్తాయి. ఇంతలోనే రిషికుమార్ శుక్లా నియామకం ఖరారు సరికొత్త రాజకీయ కోలాటానికి తెరతీసింది. 1993నాటి బొంబాయి వరస బాంబు పేలుళ్ల కేసులో దోషిగా తేలిన అబూ సలేమ్‌ను, అతగాడి చెలికత్తె మోనికా బేడీని తిరిగి రప్పించడంలో తిరుగులేని పాత్ర పోషించిన శుక్లా- జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్‌కు సన్నిహితులని ప్రతీతి. కేదస సంచాలక పదవికి శుక్లా ఎంపికపై అసమ్మతి పత్రం వెలువరించిన విపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రస్తావించిన అభ్యంతరాలూ సూటిగా స్ఫుటంగా ఉన్నాయి. వినీత్ నారాయణ్ కేసులో సర్వోన్నత న్యాయపాలిక గీసిన లక్ష్మణ రేఖ- సీనియారిటీ, రుజువర్తన, అవినీతి అణచివేత విభాగంలో అనుభవంగల ఐపీఎస్ అధికారిని ఎంపిక చేయాలని గిరిగీసిందంటున్న ఖర్గే, మూడో కీలకాంశంలో శుక్లాకు గల అనుభవం శూన్యమని ప్రస్తావించారు. సుప్రీం తీర్పు, దిల్లీ స్పెషల్ పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం స్పష్టంగా పేర్కొన్న 'అవినీతి కేసుల దర్యాప్తు అనుభవం' అన్నదాన్ని విస్మరించి శుక్లాకు కేదస సారథ్యం కట్టబెట్టడం అభ్యంతరకరమంటున్నారు. జనం నవ్విపోయేలా వీధిన పడ్డ కేదస కుమ్ములాటలకు తెరపడినందుకు సంతోషించాలో, నిబంధనల గీటురాయిపై నిలిచే సర్వశ్రేష్ఠులే కానరాని దుస్థితికి చింతించాలో తెలియని వింత పరిస్థితి ఇది!

చెట్టు చెడే కాలానికి కుక్క మూతి పిందెలన్నట్లుగా ఇటీవల కేదసలో రేగిన అంతర్గత రగడ- ప్రతిష్ఠాత్మక జాతీయ సంస్థగా దాని ఉనికిని మనికినే ప్రశ్నార్థకం చేసింది. వ్యవస్థ పరువు మాసేలా వీధులకెక్కి జంగురు పిల్లుల్లా కాట్లాడుకొంటున్నందువల్లనే కేదస సంచాలకుణ్ని, ప్రత్యేక సంచాలకుణ్ని అర్ధాంతరంగా పక్కకు తప్పించాల్సి వచ్చినట్లు కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు ప్రమాణ పత్రం సమర్పించింది. నిజానికి పరిస్థితులు ఇంతగా దిగజారడానికి దశాబ్దాలుగా కేంద్ర ప్రభుత్వ పెద్దల దుర్రాజకీయ ధోరణులూ పుణ్యం కట్టుకొన్నాయి. ఆయా వ్యవస్థల స్థాయీ ప్రమాణాలను ఇనుమడింపజేసే సమర్థులను కీలక స్థానాల్లో ప్రతిష్ఠించాల్సిన ప్రభుత్వాలు- అంగుష్టమాత్రులైన అంతేవాసులకు పట్టాభిషేకాలు చెయ్యడంతో, వ్యవస్థల గౌరవం ఏనాడో మంటగలిసిపోయింది. మచ్చరితుడైన థామస్‌ను కేంద్ర నిఘా సంఘం అధిపతిగా నియమించిన యూపీఏ ప్రభుత్వం- నిష్కళంక నిజాయతీ సీవీసీ పదవికి అర్హతా ప్రమాణమే కాదని వాదించింది. 2జి, బొగ్గు సహా కుంభకోణాల గనులెన్నింటినో తవ్విపోసిన యూపీఏ ఏలుబడిలో కేదస సంచాలకుడిగా రంజిత్ సిన్హా తిమ్మిని బమ్మి చెయ్యబూనడం యావద్దేశాన్నే దిగ్భ్రాంతపరచింది. మాజీ సంచాలకుడిపైనే కేసుపెట్టి దర్యాప్తు చేసేటంతగా పైస్థాయిలో పోటెత్తిన విలువల క్షయం- ఆలోక్ వర్మ, రాకేశ్ అస్థానాల పరస్పర అవినీతి ఆరోపణల్లోనూ ప్రస్ఫుటమైంది. అవినీతి మదగజాల పాలిట అంకుశంగా భాసిల్లాల్సిన కేదస, తానే పాప పంకిలంలో మునకలేస్తున్న వాస్తవం జాతి హృదయాన్ని క్షోభిల్లజేసింది. ఈ తరుణంలో సంచాలకుడి నియామకం ఒక్కటే కాదు- కేదస ప్రతిష్ఠను నిలబెట్టేలా దాని రోజువారీ పని పోకడలపై రాజకీయ చీకటి కోణాలేవీ ప్రసరించకుండా కట్టుదిట్టమైన విధి నిషేధాలూ పారదర్శకంగా పట్టాలకెక్కాలి!

హాంకాంగ్ లాంటి దేశాలు అవినీతి కట్టడిలో అద్భుత విజయాలు నమోదు చెయ్యగా లేనిది మనకెందుకది సాధ్యం కాదని ప్రశ్నిస్తూ అజీం ప్రేమ్‌జీతోపాటు పద్నాలుగు మంది పౌర ప్రముఖులు బహిరంగ లేఖాస్త్రం సంధించి ఎనిమిదేళ్లయింది. వ్యవస్థ పట్ల ప్రజల్లో విశ్వాసం పెంచడానికి నిజమైన స్వయం ప్రతిపత్తితో రాజ్యాంగబద్ధంగా నియంత్రణ సంస్థల్ని నెలకొల్పి, ఆయా విభాగాల్లో నిష్ణాతులకు వాటిని అప్పగించాలన్న మేధావుల సూచనకు నేటికీ మన్నన కొరవడింది! అమెరికా భద్రతకు పెట్టని కోటలాంటి ఎఫ్‌బీఐ, సీఐఏలను ప్రత్యేక చట్ట నిబంధనల మేరకు నియంత్రిస్తున్నారు. రష్యా, జర్మనీ, జపాన్ వంటి దేశాల్లోనూ నిఘా దర్యాప్తు నేరపరిశోధక సంస్థలు నిర్దిష్ట శాసనాలకు లోబడి పనిచేస్తుంటాయి. అదే ఇక్కడ- కేదసను కేంద్రం పంజరంలో చిలుకగా సుప్రీంకోర్టే ఈసడించినా, పనిపోకడలు మారుతున్నదెక్కడ? కేదస సంచాలకుడి బదిలీ అయినా ఎంపిక సంఘం అనుమతితోనే సాగాలన్న 1997 నాటి సుప్రీం ఆదేశాల్ని కేంద్రం ఔదలదాల్చి ఉంటే, ఇటీవల న్యాయ వివాదానికి ఆస్కారం ఉండేదా? కేదస స్వయం ప్రతిపత్తితో రాజీపడకుండానే, కేంద్రానికి అది నివేదించాల్సిన విధి విధానాల్ని రూపొందించాలన్న మన్నికైన సూచనకు రెండు దశాబ్దాలుగా మన్నన దక్కనే లేదు. సీవీసీ నియామక క్రతువులో అసమ్మతి గళం వినిపించే వారు అందుకు కారణాలు వెల్లడించాలని, దాన్ని తోసిపుచ్చే మెజారిటీ సభ్యులూ దాన్ని తామెందుకు కాదన్నదీ వివరించాలని 2011లో సుప్రీం కోర్టు స్పష్టీకరించింది. కేదస సంచాలకుడి నియామక వ్యవహారంలోనూ దాన్ని సంప్రదాయంగా పాటిస్తే- పారదర్శకతకు చోటిచ్చినట్లే కాదు, వ్యవస్థ పట్ల గౌరవమూ ఇనుమడిస్తుంది!

సంధించిన ఆర్థికాస్త్రం

ఎన్నికల వేళ... వరాల వల

సాధారణంగా ఎన్నికల ఏడాదిలో ప్రభుత్వాలు 'ఓట్-ఆన్-అకౌంట్' బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం ఆనవాయితీ. దానికి భిన్నంగా కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్‌ను పోలిన 'మధ్యంతర బడ్జెట్'ను ప్రవేశపెట్టింది. మరో మూడు నెలల్లో ఎన్నికలను ఎదుర్కొనవలసి ఉండటంతో సహజంగానే ఓటర్లకు గాలం వేసే ప్రతిపాదనలకు ఇందులో పెద్దపీట వేసింది. కర్షకులు, మధ్యతరగతి ప్రజలు, కార్మికులను ఆకర్షించే పథకాలకు అగ్రప్రాధాన్యం ఇచ్చింది. అదే సమయంలో దీర్ఘకాలిక అభివృద్ధికి సంబంధించిన వ్యూహం ఏదీ కనిపించలేదు. అందుకు అవసరమైన నిధుల కేటాయింపు, సంస్థాగత నిర్మాణం, సన్నాహక చర్యలను విస్మరించిన తీరు స్పష్టంగా కనిపిస్తోంది.



తాయిలమే తారక మంత్రం

వినియోగాన్ని పెంపొందించే నిర్ణయాలే తప్పించి మూలధన వ్యయ ప్రణాళిక ప్రస్తావనే బడ్జెట్లో లేదు. దానికి మధ్యంతర బడ్జెట్ కదా అని సరిపెట్టుకోవలసిందే. కానీ ఎన్నికలే లక్ష్యంగా తీసుకున్న నిర్ణయాలతో ఆర్థిక లోటు పెరగవచ్చు. అదే సమయంలో అధిక ద్రవ్యోల్బణం ముప్పు ఎదురుకానుంది. వ్యవసాయరంగ సంక్షోభాన్ని పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయి. ఉపాధి, ఉద్యోగావకాశాలు పెంపొందించటం ద్వారా వ్యవసాయ రంగంపై ఆధారపడినవారి సంఖ్యను గణనీయంగా తగ్గించాల్సి ఉండగా, ఆ దిశగా ఏ మాత్రం ప్రగతి లేదు. వ్యవసాయ రంగంలో ఆధునిక పోకడలు తీసుకువచ్చి అధికోత్పత్తి సాధించేందుకు, పండించిన పంటకు అధికధర లభించే విధంగా నిల్వ, ప్రాసెసింగ్ సదుపాయాలను కల్పించడం, సమర్థమైన పంపిణీ వ్యవస్థ ఏర్పాటు దిశగా ప్రగతి సాధిస్తే వ్యవసాయం ఆకర్షణీయంగా మారేది. ఇందుకు దీర్ఘకాలిక ప్రాతిపదికన కృషి చేయాలి. కానీ అటువంటి ప్రణాళికాబద్ధమైన కృషి లేకపోగా రైతాంగాన్ని తాత్కాలిక తాయిలాలతో మభ్యపెడుతున్న పరిస్థితి కనిపిస్తోంది. పూర్తిగా కుంగిపోయిన రైతన్నకు ఎంతో కొంత సాయం అందించి ఆదుకునేందుకు చేస్తున్న ప్రయత్నం సరైనదే అయినప్పటికీ- అది శాశ్వత పరిష్కారం మాత్రం కాదు. పైగా ఆ సాయమూ ఎన్నికల ఏడాదిలోనే అందుతోంది. ఈ కోవలోనే కేంద్ర ప్రభుత్వం ఈ బడ్జెట్లో అయిదెకరాల లోపు భూమి ఉన్న రైతులకు రూ.6,000 చొప్పున నేరుగా నగదు చెల్లించే పథకాన్ని ప్రకటించింది. దీన్ని మూడు విడతలుగా చెల్లిస్తుంది. ఇందులో తొలివిడత రూ.2,000 వచ్చే ఎన్నికల లోపే రైతుల ఖాతాకు జమ చేయనున్నట్లు ప్రకటించింది.

మధ్యతరగతి ప్రజలకు వార్షిక పన్ను ఆదాయం అయిదు లక్షల రూపాయలకు దిగువన ఉన్న పక్షంలో ఆదాయ పన్ను భారం నుంచి పూర్తి మినహాయింపు ఇస్తూ సెక్షన్ 87ఏ కింద రూ.12,500 రిబేటు ప్రకటించారు. ఇతర సెక్షన్ల కింద ఉన్న కొన్ని మినహాయింపులను పూర్తిగా వినియోగించుకునే పక్షంలో రూ.6.5 లక్షల వార్షికాదాయం ఉన్న వ్యక్తులు ఆదాయపు పన్ను చెల్లించాల్సిన అవసరం ఉండదు. మరోపక్క అసంఘటిత రంగంలోని కార్మికుల కోసం 'ప్రధానమంత్రి శ్రమ్- యోగి మాన్‌ధన్' పేరుతో నూతన పింఛను పథకాన్ని ప్రతిపాదించారు. ఎవరైనా ఈ పథకంలో చేరి ముప్ఫై నుంచి నలభై ఏళ్ల పాటు కొనసాగితే ఆ తరవాత వారికి నెలకు రూ.3,000 చొప్పున పింఛను లభిస్తుంది. దీనికోసం నెలకు రూ.100 వరకూ చెల్లించాల్సి వస్తుంది. ఇప్పటికే 'అటల్ పింఛన్ యోజన' పేరుతో ఒక పథకం అమలులో ఉంది. ఇందులో నెలకు రూ.5,000 పింఛను వస్తుంది. దీనిలో చేరిన వ్యక్తులు తమ వంతుగా చెల్లించాల్సిన మొత్తం నెలకు రూ.529 వరకూ ఉంది. కొత్త పథకంలో అయితే రూ.100 వరకూ చెల్లిస్తే సరిపోతుంది. ముప్ఫై ఏళ్ల తరవాత లభించే ఈ కొద్దిపాటి పింఛను అప్పటి ధరలు, ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుంటే ఏ మూలకూ సరిపోదు. అయినా ఎంతోకొంత ఆసరా ఉంటుందనుకోవచ్చు. రైతులకు నేరుగా నగదు చెల్లింపు పథకం వల్ల 12 కోట్ల మందికి, ఆదాయ పన్ను రాయితీల వల్ల మూడు కోట్ల మందికి లబ్ధి చేకూరుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. దీనివల్ల దాదాపు రూ.93,000 కోట్ల మొత్తం ప్రజల చేతుల్లో ఉండిపోతుంది. ఆ సొమ్మును వారు ఖర్చు చేసే అవకాశం ఉంది కాబట్టి, వస్తుసేవలకు గిరాకీ పెరిగి ద్రవ్యోల్బణం అధికం కావచ్చు. ద్రవ్యోల్బణం ఇటీవలి కాలంలో బాగా దిగివచ్చింది. 2009-14 మధ్యకాలంలో సగటు ద్రవ్యోల్బణం 10.1 శాతం ఉంది. ఆ తరవాత 4.6 శాతానికి తగ్గింది. గత ఏడాది డిసెంబరులో 2.19 శాతానికి దిగివచ్చింది. ఇదే సానుకూలత ముందు ఉండకపోవచ్చు. అదే సమయంలో ఆర్థికలోటూ సమస్య అవుతుంది.

ఆర్థిక లోటును 2018నాటికి స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో మూడు శాతానికి పరిమితం చేయాలనేది కేంద్ర ప్రభుత్వ లక్ష్యం. కానీ ఈ ఆర్థిక సంవత్సరంతో పాటు వచ్చే ఆర్థిక సంవత్సరంలోనూ ఆర్థికలోటు 3.4 శాతం ఉండబోతోంది. దీనివల్ల ప్రభుత్వం కొత్తగా అప్పులు చేయడం కష్టమవుతుంది. అభివృద్ధి కార్యక్రమాలకు తగినంతగా కేటాయింపులు చేయలేని పరిస్థితి ఎదురవుతుంది. నిధుల కొరతను ప్రభుత్వరంగ సంస్థల నుంచి పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియ ద్వారా కొంతమేరకు అధిగమించవచ్చునే ఆలోచన ప్రభుత్వానికి ఉంది. కానీ, అదీ సాధ్యం కావడం లేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.80,000 కోట్ల మొత్తాన్ని ఈ ప్రక్రియ ద్వారా సమకూర్చుకోవాలని గత బడ్జెట్లో ప్రతిపాదించారు. ఇప్పటివరకూ సమకూరింది రూ.35,100 కోట్లు మాత్రమే. అయినప్పటికీ వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.90,000 కోట్లు పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియ ద్వారా లభిస్తాయని ప్రస్తుత బడ్జెట్లో ప్రభుత్వం అంచనా వేసింది.

ముఖ్యమైన రక్షణ, రైల్వే కేటాయింపులు తీసికట్టుగా ఉన్నాయి. ఎన్నో ఏళ్లుగా పొరుగున పాకిస్థాన్‌తో ముప్పు పొంచిఉంది. చైనాతోనూ సమస్యలు ఎదురవుతున్నాయి. ఏకకాలంలో రెండు దేశాల నుంచి ఎదురయ్యే సవాలును ఎదుర్కోనాల్సిన పరిస్థితి ఏర్పడింది కనుక సైన్యాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉరుముతోంది. కానీచ రక్షణ రంగానికి రూ.3.18 లక్షల కోట్లు మాత్రమే కేటాయించారు. క్రితం బడ్జెట్లో కేటాయించిన రూ.2.95 లక్షల కోట్లతో పోల్చితే ఇది 7.93 శాతమే అధికం. ప్రస్తుత కేటాయింపుల్లో రూ.2.10 లక్షల కోట్లు రెవిన్యూ వ్యయానికి సరిపోతుంది. ఇక మూలధన అవసరాలకు మిగిలేది రూ.1.08 లక్షల కోట్లు మాత్రమే. ఒక పక్క సాధారణ రైఫిళ్ల నుంచి ఫైటర్ విమానాల వరకూ ఇతర దేశాల నుంచి కొనుగోలు చేస్తున్నాం. ఆయుధాలు, రక్షణ సామగ్రి సొంత తయారీ అనేది ఇంకా కలగానే ఉంది. ఈ పరిస్థితుల్లో ప్రస్తుత రక్షణ కేటాయింపులు దీర్ఘకాలిక అవసరాలు తీర్చడానికి ఎంతమాత్రం సరిపోవు. రైల్వే విషయానికి వస్తే ప్రతిపాదిత ప్రణాళిక వ్యయం రూ.1.58 లక్షల కోట్లు. బడ్జెట్లో ఇచ్చింది రూ.64,587 కోట్లు మాత్రమే!

దీర్ఘకాలిక వృద్ధి పక్కదారి

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 7.5 శాతం వృద్ధిరేటు సాధిస్తామని ప్రపంచవ్యాప్తంగా పెద్ద ఆర్థిక వ్యవస్థల్లో అత్యంత వేగవంతమైన వృద్ధి సాధిస్తున్న దేశం మనదేనని బడ్జెట్ ప్రవేశపెట్టే సందర్భంలో తాత్కాలిక ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. వంద కోట్లకు పైగా జనాభా ఉన్న దేశానికి ఈ వృద్ధిరేటు ఎంతమాత్రం సరిపోదు. దీనికే సంబరపడిపోతే అభివృద్ధి చెందిన దేశాల జాబితాలో భారత్ చేరడానికి ఎంత కాలం పడుతుందో చెప్పలేం. పొరుగున్న ఉన్న చైనా తక్కువ సమయంలో శరవేగంగా అభివృద్ధి సాధించి అగ్రరాజ్యమైన అమెరికాకు సవాలు విసరుతోంది. భారత్ సైతం తక్కువ సమయంలోనే అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలంటే వచ్చే కొన్నేళ్లపాటు రెండంకెల వృద్ధి సాధించాలి. అప్పుడు ప్రజల జీవన ప్రమాణాల్లో స్పష్టమైన మార్పు సాధ్యమవుతుంది. మానవాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, విద్య, వైద్య రంగాల్లో ఉన్నత ప్రమాణాలు అందుకోవడానికి వీలు పడుతుంది. దీన్ని సాధించాలంటే మూలధన పెట్టుబడులు అధికంగా పెట్టాలి. మౌలిక సదుపాయాల కల్పన, విద్యుదుత్పత్తి, రైల్వేలు, రవాణా, ఇంజినీరింగ్, నైపుణ్యాల వంటి కీలక అంశాలకు అగ్ర ప్రాధాన్యం ఇవ్వాలి. పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు సృష్టించాలి. తయారీ రంగాన్ని ఉద్యమం మాదిరిగా ముందుకు తీసుకువెళ్లడం అవసరం. ఒకేసారి కాకపోయినా ఏటా ప్రాధాన్యతా క్రమంలో ఆయా రంగాలకు అధికంగా నిధులు కేటాయించాలి. కానీ ఈ బడ్జెట్లో అభివృద్ధి ఊసే లేదు. నిధుల కేటాయింపు లేకపోయినా కనీసం ఈ దిశగా దీర్ఘకాలిక వ్యూహాన్ని అయినా ఆవిష్కరించలేదు. స్థిరమైన, అధిక ఆర్థికాభివృద్ధి కోణంలో బడ్జెట్‌ను చూస్తే నిరుత్సాహం కలగక మానదు. సంక్షేమానికి, ప్రజాకర్షణ పథకాలకు పరిమితమైన బడ్జెట్ ఇది. ఎన్నికల తరవాత ఏర్పడే ప్రభుత్వం అయినా సంక్షేమంతోపాటు దీర్ఘకాలిక అభివృద్ధి లక్ష్యంగా తగిన ప్రతిపాదనలతో ముందుకు రావడం అవసరం!

- గన్నవరపు సుబ్బారావు

వెల్లువెత్తిన ఆదాయం




కొంతకాలంగా కేంద్ర ప్రభుత్వానికి పన్ను ఆదాయం గణనీయంగా పెరిగింది. ప్రత్యక్ష, పరోక్ష పన్నుల ఆదాయం గతంలో నెలకు లక్ష కోట్ల రూపాయల చొప్పున ఉండేది. ఇప్పుడు ఇది నెలకు రూ.1.5 లక్షల కోట్లకు మించిపోయింది. త్వరలో రెండు లక్షల కోట్ల రూపాయలకు చేరవచ్చు. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వానికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఒక్క భారతీయ రిజర్వు బ్యాంకే రూ.68,000 కోట్ల వరకూ డివిడెండు చెల్లించే అవకాశం ఉంది. ఇందులో రూ.40,000 కోట్లు ఇప్పటికే ప్రభుత్వ ఖాతాకు జమ అయ్యాయి. దీనికి ఇతర ప్రభుత్వరంగ సంస్థలు, వాణిజ్య బ్యాంకులు, ప్రభుత్వ ఆర్థిక సంస్థల నుంచి లభించే డివిడెండు కలిపితే మొత్తం దాదాపు రూ.74,000 కోట్లకు పైగా ఆదాయం ఉంటుంది. ఇంతగా ప్రభుత్వానికి ఆదాయాలు ఉన్నప్పటికీ ఆర్థికలోటు పెరిగే ముప్పు ఎదురుకావడానికి ప్రజలకు ప్రభుత్వం ఇవ్వజూపుతున్న 'తాయిలాలు' అధికం కావటమే కారణం.

కృత్రిమ మేధే శాసనకర్త

కృత్రిమ మేధ (ఏఐ- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) జనజీవితాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. దీనివల్ల మానవులు జీవన ప్రమాణాలు మెరుగవుతున్నాయి. పరిశ్రమల్లో ఉత్పాదకత ఇనుమడిస్తోంది. అమెరికాలో వాహన చోదకుల స్థానంలో స్వయంచాలిత పరికరాలను ఏర్పాటు చేయడం వల్ల రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. సముద్ర తీరంలో చమురు తవ్వకాలు, బొగ్గు గనులు వంటి ప్రమాదకర వాతావరణంలో మానవ వనరులకు కృత్రిమ మేధతో కూడిన యంత్రాలు ప్రత్యామ్నాయలవుతున్నాయి. కృత్రిమ మేధ వినియోగంలో రోబోల ఆగమనం ఒక విప్లవమనే చెప్పాలి.

కాల్ సెంటర్లలో కృత్రిమ మేధ వినియోగం అధికమైంది. వినియోగదారుల అలవాట్లు, కొనుగోళ్ల సరళి ఆధారంగా భవిష్యత్తులో వారి విపణి అవసరాల అంచనాకు దీన్ని సాధనంగా వాడుతున్నారు. ఈ రంగంలో నిపుణుల కొరత తీవ్రంగా ఉంది. ప్రపంచ వ్యాప్తంగా పదివేల మంది నిపుణులు కూడా లేరు. 2030 నాటికి ప్రపంచంలోని 70 శాతం సంస్థలు ఏదో ఒక రకమైన కృత్రిమ మేధను అనుసరిస్తాయని మెక్‌కిన్సే గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ అధ్యయనం అంచనా వేసింది. యాంత్రీకరణ ప్రభావం ప్రపంచ కార్మికశక్తిలో 15 శాతంపై పడుతుందని స్పష్టీకరించింది. ఎనిమిది నుంచి తొమ్మిది శాతం మంది కొత్త వృత్తులు చేపడతారు. మూడో వంతు అమెరికన్లు కొత్త ఉద్యోగాలు వెతుక్కోవాల్సి వస్తుందని ఆ అధ్యయన నివేదిక హెచ్చరించింది. మారుతున్న అవసరాల మేరకు చైనా, అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జపాన్ తమ విధాన పత్రాలను సిద్ధం చేశాయి.



కృత్రిమ మేధ, ఆటోమేషన్ ప్రభావం డేటా కలెక్షన్, డేటా ప్రాసెసింగ్‌పై ఎక్కువగా పడుతుంది. దృష్టి, ఉపన్యాసం, భాష, గ్రహణశక్తి రంగాల్లో కృత్రిమ మేధ మానవ మేధస్సును అధిగమిస్తుంది. దీనితో సామాజిక, సాంకేతిక, గ్రహణశక్తి సంబంధమైన ఉద్యోగాలకు ప్రాధాన్యం ఏర్పడుతుంది. శారీరక శ్రమ, కాయకష్టం చేసే పనులకు గిరాకీ తగ్గుతుంది. రేడియాలజిస్టులకు ప్రాధాన్యం తగ్గి, నర్సుల అవసరం మరింత పెరగవచ్చు. ఉద్యోగుల నిర్వహణ, నైపుణ్య వర్గం, సామాజిక బంధాలు పెంచే ఉద్యోగాలు వంటివాటిలో మానవ శక్తితో యంత్రాలు పోటీపడలేవు. దీంతో ఇప్పటికిప్పుడు ఈ ఉద్యోగాలకు వచ్చిన ఇబ్బందేమీ లేదు.

1960 ప్రాంతంలో ఎమ్ఐటీ కృత్రిమ మేధ ప్రయోగశాల ఆచార్యులు ఒకరు 'ఎలిజా' అనే పేరుతో 'కంప్యూటర్ సైకోథెరపిస్టు'ను రూపొందించారు. వినియోగదారులతో అక్షర సందేశాల ద్వారా ఇది సంభాషించేది. కృత్రిమ మేధ రంగంలో 1977 సంవత్సరం మేలిమలుపు. ఐబీఎం 'డీప్ బ్లూ కంప్యూటర్', చెస్ దిగ్గజం గ్యారీ కాస్పరొవ్‌తో తలపడింది. మానవ

సాంకేతిక ప్రగతికి తరుణమిది

మేధతో యంత్రం తలపడటం, సమాచారాన్ని మానవుల కంటే వేగంగా క్రమబద్ధీకరించడం ఇందులో విశేషం. జూన్ 2012లో గూగుల్ పరిశోధకుడు జెఫ్ డీన్, ఆండ్రూ యంగ్‌లు 16వేల కంప్యూటర్ ప్రాసెసర్లను ఉపయోగించి శిక్షణ ఇచ్చారు. యూట్యూబ్ నుంచి లక్షలాది వీడియోలను సేకరించి నిక్షిప్తం చేశారు. కృత్రిమ మేధ ప్రత్యేక వివరాలేమీ నమోదు చేయకుండానే ఆల్గారిథమ్‌ల సాయంతో 'క్యాట్' వీడియోలను పసిగట్టింది. సాధారణ మానవుల మాదిరిగానే ఈ వీడియోల పట్ల ఆసక్తి చూపడం పరిశోధకుల్ని ఆశ్చర్యపరచింది.

మిగతా దేశాలతో పోలిస్తే కృత్రిమ మేధలో భారత్ తీసికట్టుగా ఉంది. సమాచార నిధి, నిధుల కేటాయింపులు రెండింటిలోనూ వెనకబాటు సుస్పష్టం. 2014-17 మధ్య కాలంలో మనదేశంలోని అంకుర పరిశ్రమలు 10 కోట్ల డాలర్ల కంటే తక్కువ పెట్టుబడులనే ఆకర్షించగలిగాయి. అమెరికా, చైనా ఈ రంగానికి సంబంధించిన పరిశోధనల్లో నువ్వానేనా అన్నట్లు పోటీపడుతున్నాయి. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు అవి కృత్రిమమేధపై శిక్షణ ఇస్తున్నాయి. దాదాపు 40 చైనా పాఠశాలల్లో, అమెరికాలో ముఖ్యంగా సిలికాన్ వ్యాలీలోనూ బోధన సాగుతోంది. పాఠశాల స్థాయి విద్యార్థులకు కృత్రిమమేధపై పాఠ్యపుస్తకాన్ని రూపొందించిన ఘనత చైనాకు దక్కుతుంది. జర్మనీ, జపాన్, కెనడా, బ్రిటన్ వినూత్నంగా అడుగులు వేస్తున్నాయి. బెల్జియం, సింగపూర్, దక్షిణ కొరియా, స్వీడన్ అధిక ఉత్పాదకత దిశగా ముందుకు సాగుతున్నాయి. మూడో గ్రూపులో బ్రెజిల్, ఇండియా, ఇటలీ, మలేషియా నెమ్మదిగా అడుగులు వేస్తున్నాయి. కృత్రిమమేధ వల్ల భారత ఆర్థికవ్యవస్థ 2035 నాటికి 95,700 కోట్ల డాలర్ల స్థాయికి చేరగలదని అంచనా. ఇజ్రాయెల్ సైనిక, వాణిజ్య అవసరాల నిమిత్తం కృత్రిమమేధను వినియోగిస్తోంది. రష్యా కృత్రిమ మేధ, రొబొటిక్స్‌ను ఇతర రంగాల కంటే సైనికరంగంలో రష్యా ఎక్కువ వాడుతోంది. సింగపూర్ పెట్టుబడుల సాధనకు ప్రధానమైన ఆయుధంగా ఉపయోగిస్తోంది. దక్షిణకొరియా నిస్సైనిక ప్రాంతాల పర్యవేక్షణకు ప్రధానంగా వినియోగిస్తోంది.

కృత్రిమమేధ ఆధారంగా వ్యక్తిగత సమాచారం దుర్వినియోగం కాకుండా చూసుకోవలసిన అవసరం ఉంది. డేటా రహస్యంపై భద్రతాపరమైన రక్షణ అవసరం. ఇందుకోసం డేటా, కంప్యూటింగ్, ఇతర సామర్థ్యాలను మెరుగుపరచుకోవాలి. నిఘా వ్యవస్థ పటిష్ఠత, సైనిక సంబంధిత కార్యకలాపాలు, సైబర్ భద్రత నిర్వహణ తదితర అంశాల్లో దారి తప్పకుండా చూసుకోవాలి. ఇందుకు ఆయా కార్పొరేట్ సంస్థలతో పాటు ప్రభుత్వపరమైన తోడ్పాటూ అవసరం. అప్పుడే సాంకేతిక ప్రగతికి నిజమైన ఫలాలు మానవాళి అందుకోగలుగుతుంది!

- పార్థసారథి చిరువోలు

ఈనాడు లేఖలు

ఆర్థిక అంతరాలు తగ్గాలి

పల్లెల నుంచి పట్టణాలు, నగరాలకు ప్రజలు తరలివెళ్తేనే దేశం ప్రగతి పథంలో పయనిస్తుందని అనుకోవడం పొరపాటు. గ్రామాల్లో బతుకు తెరువు లేక, కడుపు చేత పట్టుకుని పట్టణాలకు గ్రామీణులు వలసపోవడం వెనకబాటునే సూచిస్తుంది. గ్రామాల్లో ఉపాధి అవకాశాలు లభ్యమవుతూ చౌకగా విద్య, వైద్యం అందినప్పుడే దేశంలో సిసలైన అభివృద్ధికి పునాది పడినట్లు! అందుకు అనుగుణంగా ప్రభుత్వాల విధానాలు రూపుదిద్దుకోవాలి. శ్రుతిమించిన పారిశ్రామికీకరణ వల్ల ఉత్పన్నమవుతున్న పర్యావరణ సమస్యలు అసలుకే ఎసరు తెచ్చేలా ఉన్నాయి. కనుక గ్రామీణ స్ఫూర్తిని దెబ్బతీయకుండా సేద్య రంగంలో కొత్త ఒరవడి తీసుకువచ్చేలా ప్రభుత్వాలు పథకాలను తీర్చిదిద్దాలి. అప్పుడే ధనికులు పేదల మధ్య అంతరాలు తగ్గుముఖం పడతాయి.

- టి.జయచంద్రమోహన్, షాపూర్, హైదరాబాద్

'ఆధార్' కోసం ఆగని ఒత్తిళ్లు

ప్రతి పనికి ఆధార్ అవసరం లేదని రెండు నెలల క్రితమే సుప్రీంకోర్టు ఆదేశాలు జారీచేసింది. అయినా నేటికీ బ్యాంకు ఖాతా తెరవడానికి, కొత్త సిమ్ కార్డు పొందడానికి, వంటగ్యాస్ కనెక్షన్ తీసుకోవడానికి, రేషన్ కార్డు, పాస్‌పోర్టుల దరఖాస్తుకు ఆధార్ కార్డును తప్పనిసరిగా అడుగుతున్నారు. దీని వల్ల సామాన్యుల నుంచి విద్యావంతుల వరకు అందరూ అవస్థలు పడుతున్నారు. అధికారులు సైతం ఆధార్ ఒక్కటే తమకు ప్రామాణికమని చెబుతుండటం సమస్యాత్మకమవుతోంది. మరోవైపు సర్వోన్నత న్యాయస్థానం తీర్పును గౌరవించకుండా ఆధార్ అడుగుతుండటం వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించడమేనని ప్రజానీకం భావిస్తోంది. కనుక 'సుప్రీం' తీర్పును కట్టుదిట్టంగా అమలు చేయడానికి తగిన వ్యవస్థలు రావాలి.


- కమటం కిరణ్, బోయినిపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లా

శరణాగతి

భగవద్గీత పద్దెనిమిదో అధ్యాయంలో శ్రీకృష్ణుడు, సర్వధర్మాలను వదిలిపెట్టి తననే శరణు వేడుకుంటే సమస్త కష్టాల నుంచి విముక్తి కలిగిస్తానని, దుఃఖించవద్దని చెప్పాడు. ఈ భక్తి భావన చాలా గొప్పది. మనిషిలో ఎనలేని ధైర్యం కలిగించేదే శరణాగతి. భగవద్గీత చివరి అధ్యాయంలోని ఈ శ్లోకాన్ని అందుకే 'చరమ శ్లోకం' అంటారు.

భక్తియోగంలో శరణాగతి వల్ల భక్తుడికి అన్ని భయాలూ తొలగిపోతాయని నమ్ముతారు. అర్ధరాత్రి నిద్రలో ఉన్నప్పుడు ఏదో పీడకల వచ్చి పిల్లవాడికి చాలా భయమేస్తూ ఉంటుంది. అందరూ నిద్రిస్తూ ఉంటారు. మెల్లిగా వెళ్ళి నాన్న పక్కన పడుకుంటాడు వాడు. ఇక ఏ దుష్టశక్తులూ తననేమీ చేయలేవనే ధైర్యం హాయిగా నిద్ర పుచ్చుతుంది. తండ్రి ఉన్నాడన్న ఆ భావమే శరణాగతి.

భగవదనుగ్రహానికి ఆళ్వారులు శరణాగతి మార్గాన్నే ప్రబోధించారు. వేదాంత దేశికులు శరణాగతిని వివరిస్తూ తరచూ ఒక కథ చెప్పేవారు. చూడామణి అనే శ్రీకృష్ణ భక్తురాలు తన కొడుకును ఒక గురువు వద్ద చదువు కోసం కొద్ది దూరంలోని నాచికురిచి అనే ఊరికి పంపేందుకు నిర్ణయించుకుంది. మధ్యలో చిట్టడవి దాటాలి. అడవిలో భయం వేస్తుందమ్మా అన్నాడు. తల్లి ధైర్యం చెబుతూ భయం వేయగానే బిగ్గరగా కృష్ణా... మాధవా అని పలుకుతూ ముందుకు నడు. సాయంత్రం తిరిగివచ్చే ముందు అడవిలోకి రాగానే పిలువు. అందువల్ల దైవం అపాయం రాకుండా కాపాడతాడని చెప్పింది. తల్లిలోని కృష్ణభక్తి సహజంగా ఆ పిల్లవాడికి అబ్బింది. గురుకులానికి వెళ్తున్న తొలి రోజు అడవిలోకి రాగానే చూడామణి చెప్పినట్లే కృష్ణా... అంటూ ఆర్తితో పిలిచాడు. రెండడుగులు వేయగానే ఒక దారు వృక్షం పక్కనుంచి పదేళ్ళ అబ్బాయి వచ్చి, 'భయపడుతున్నావా... గురుకులం దాకా నేను తోడు వస్తా పద!' అంటూ దారిలో కథలు చెప్పాడు. 'నీవు తిరిగి వెళ్ళేటప్పుడు నన్ను పిలువు. నేను మీ ఊరి దాకా వచ్చి దింపుతాను' అని అభయం ఇచ్చాడు. గురుకులానికి ధైర్యంగా వెళ్ళి వస్తున్న కొడుకును గమనించిన చూడామణి, అడవిలో భయం వేయలేదా నాన్నా అని ప్రశ్నించింది. ఆ పిల్లవాడు బదులిస్తూ... నీవు చెప్పినట్లే భయం వేసినప్పుడు బిగ్గరగా 'కృష్ణా' అని పిలిచానని, వెంటనే



అంతర్యామి

చెట్టు వెనక నుంచి ఒక అబ్బాయి వచ్చి నన్ను గురుకులంలో దింపి తిరిగి సాయంత్రం మన ఊరి వెలుపలకు చేర్చి వెళ్తున్నాడని చెప్పాడు. చూడామణికి అర్థమైంది. తన కొడుకును సంరక్షిస్తున్నవాడు శ్రీకృష్ణుడని. ఇదే కదా శరణాగతి అంటూ వేదాంత దేశికులు భక్తులకు వివరించేవారట.

మకరిని జయించే ఆశలు లేక, ఎవరి వల్ల జీవరాశులు పుట్టి, పెరిగి నశిస్తున్నాయో ఎవడు అన్నింటికీ మూలకారకుడో... ఆద్యంతాలు లేనివాడో సర్వాత్మ స్వరూపుడైన ఆ వరదుణ్ని రక్షించమని శరణాగతి చేస్తున్నాను అని గజేంద్రుడు ఆర్తితో, ఆర్ద్రతతో వాసుదేవుణ్ని వేడుకున్నాడు. శ్రీహరి పరుగు పరుగున వచ్చి గజేంద్రుణ్ని కాపాడాడు. శరణాగతికి ఈ ఘట్టం చక్కని ఉదాహరణ.

ఉత్కృష్ట శ్రీకృష్ణ భక్తుడు వల్లభాచార్యులు ఒకసారి ఘోరారణ్యంలో సాయం సంధ్య వేళ దారి తప్పాడు. భక్త బృందం వద్దకు చేరి భగవన్నామ స్మరణ చేయగలనో లేదోనన్న దిగులుతో శ్రీహరిని కాపాడమని వేడుకున్నాడు. అప్పుడు శ్రీకృష్ణుడు నిజరూపంలో కనిపించి దారి చూపాడట. ఆ సుందర రూపం చూశాకే వల్లభాచార్యులు మధురాష్టకం రాశాడంటారు. దేవుడు తప్పక రక్షిస్తాడనే దృఢ విశ్వాసం, ఆత్మనిక్షేపం (తనను తాను అర్పించుకోవటం), కార్పణ్యం (తనను ఆదుకొనేవాడు ఎవరూ లేరనే దైన్య స్థితి శరణాగతికి సన్మార్గాలని ఉపనిషత్తులు సైతం చెబుతున్నాయి.

- అప్పరుసు రమాకాంతరావు

ప్రశ్నించే వారిపై భాజపా దాడులు చేస్తోంది

మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్ చవాన్ విమర్శ

మహబూబ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: దేశంలో ప్రశ్నించే నాయకులు, సమస్యలను వేలెత్తిచూపే మీడియా సంస్థలపై భాజపా ప్రభుత్వం దాడులకు దిగుతోందని, ప్రజాస్వామ్యం అపహాస్యం పాలవుతోందని మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అశోక్ చవాన్ విమర్శించారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లాలోని మక్తల్, మాగనూర్ ప్రాంతాల్లో పర్యటనకు చవాన్ వచ్చారు. జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో డీసీసీ అధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్, కాంగ్రెస్ నేతలు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. అశోక్‌చవాన్ విలేకర్లతో మాట్లాడుతూ.. ఈసారి కేంద్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని చెప్పారు.

కాకినాడకు పది ప్రత్యేక రైళ్లు

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా సికింద్రాబాద్, హైదరాబాద్‌ల నుంచి కాకినాడకు పది ప్రత్యేక రైళ్లు నడపాలని దక్షిణ మధ్య రైల్వే నిర్ణయించింది. రైలు నంబరు 07436 ఈ నెల 7, 9, 15, 21 తేదీల్లో సికింద్రాబాద్‌లో రాత్రి 8 గంటలకు బయల్దేరి, మరుసటి రోజు ఉదయం 06:25 గంటలకు కాకినాడ టౌన్‌కు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 8, 10, 17, 24 తేదీల్లో రైలు నంబరు 07435 కాకినాడలో రాత్రి 10:20 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 8 గంటలకు సికింద్రాబాద్ వస్తుంది. ఈ నెల ఐదో తేదీన రైలు నంబరు 07001 హైదరాబాద్‌లో సాయంత్రం 6:50 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం ఆరు గంటలకు కాకినాడ టౌన్ వెళ్తుంది. తిరుగు ప్రయాణంలో 7వ తేదీన రైలు నంబరు 07002 రాత్రి 9 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 08:15 గంటలకు హైదరాబాద్ వస్తుంది. ప్రత్యేక రైళ్లు కాజీపేట, ఖమ్మం, రాయనపాడు, ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమహేంద్రవరం, ద్వారపూడి, సామర్లకోట స్టేషన్లలో మాత్రమే ఆగుతాయని దక్షిణ మధ్య రైల్వే ఒక ప్రకటనలో పేర్కొంది.

ఆర్టిజన్‌ల క్రమబద్ధీకరణపై మరో ఉద్యమం

ఐఎన్‌టీయూసీ అనుబంధ 327 యూనియన్

వడ్డేపల్లి (వరంగల్), న్యూస్‌టుడే: అడ్డంకులు తొలగినా విద్యుత్తు సంస్థల్లో పని చేస్తున్న ఆర్టిజన్ కార్మికుల క్రమబద్ధీకరణపై ప్రభుత్వం దృష్టి సారించడంలేదని, వారంలో సమస్య పరిష్కరించకుంటే మరోసారి రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడతామని ఐఎన్‌టీయూసీ అనుబంధ 327 యూనియన్ తెలిపింది. ఆదివారం హన్మకొండలో ఆర్టిజన్ కార్మికులతో నిర్వహించిన రాష్ట్రస్థాయి సభలో రాష్ట్ర సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ జి.ముత్తయ్యగౌడ్, సెక్రటరీ జనరల్ ఇ.శ్రీధర్ మాట్లాడారు. విద్యుత్తు కార్మిక సంఘాల ఐకాస ఉద్యమంతో ముఖ్యమంత్రి కేసీఆర్ విద్యుత్తు సంస్థల్లో 24 వేల మంది కార్మికులను క్రమద్ధీకరిస్తామని ప్రకటించడంతో వేలాది కార్మికులు హర్షించారని చెప్పారు. సీఎం ప్రకటన తర్వాత ఒప్పంద, పొరుగు సేవల సిబ్బందికి ఫిక్స్‌డ్ వేతన స్కేల్ నిర్ధారించి ఆర్టిజన్ ఉద్యోగులుగా ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. దీనిపై కొంతమంది కోర్టును ఆశ్రయించడంతో క్రమబద్ధీకరణ అటకెక్కిందన్నారు.

వై.ఎస్.షర్మిలపై అసభ్య ప్రచారం.. మరొకరి అరెస్ట్

మరికొందరు నిందితులను గుర్తించిన పోలీసులు

ఈనాడు, హైదరాబాద్, మంచిర్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: వైకాపా నాయకురాలు వై.ఎస్.షర్మిలపై యూట్యూబ్‌లో అసభ్య ప్రచారం చేస్తున్న మరో నిందితుడు అద్దూరి నవీన్‌ను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. మంచిర్యాల పట్టణంలోని రాంనగర్‌లో నివాసముంటున్న అద్దూరి నవీన్ వై.ఎస్.షర్మిలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ నాలుగు వీడియోలను యూట్యూబ్ ఛానల్‌లో అప్‌లోడ్ చేసినట్లు పోలీసు అధికారులు గుర్తించారు. నవీన్‌ను పట్టుకునేందుకు హైదరాబాద్ నుంచి ప్రత్యేక బృందం ఆదివారం మంచిర్యాలకు వెళ్లింది. అక్కడ అతనిని అదుపులోకి తీసుకుని హైదరాబాద్‌కు తీసుకొచ్చింది. రహస్య ప్రాంతంలో అతనిని విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇదే కేసులో అరెస్టయిన గుంటూరుకు చెందిన విద్యార్థి పెద్దిశెట్టి వెంకటేష్‌ను ఆదివారం పోలీసులు నాంపల్లి క్రిమినల్ కోర్టు న్యాయమూర్తి ఇంట్లో హాజరు పరచగా నిందితుడికి 14రోజులు జ్యుడియషల్ రిమాండ్ విధించారు. దీంతో వెంకటేష్‌ను సాయంత్రం చంచల్‌గూడ జైలుకు తరలించారు. అద్దూరి నవీన్‌ను కూడా జైలుకు తరలించాక ఈ కేసులో వివరాలను నిందితులిద్దరి నుంచి తెలుసుకునేందుకు న్యాయస్థానంలో కస్టడీ పిటిషన్ దాఖలు చేయనున్నట్టు సైబర్ క్రైమ్ పోలీసు అధికారులు తెలిపారు.

మరింత మంది అరెస్ట్‌కు రంగం సిద్ధం!

వై.ఎస్.షర్మిలపై అసభ్యంగా ప్రచారం చేస్తున్న మరికొంతమందిని సైబర్ క్రైమ్ పోలీసు అధికారులు గుర్తించినట్టు తెలిసింది. వీరు యూట్యూబ్‌లో ఛానళ్లను ప్రారంభించి అందులో షర్మిల-ప్రభాస్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వీడియోలను పదుల సంఖ్యలో ఉంచారు. ఇప్పటి వరకు ఎనిమిది యూట్యూబ్ ఛానళ్లపై కేసులు నమోదు చేసిన పోలీసులు... యూట్యూబ్ ప్రాంతీయ ప్రతినిధులిచ్చిన సమాచారం ఆధారంగా మరిన్ని కేసులు నమోదు చేయనున్నారు.



భట్టి విక్రమార్కను అభినందిస్తున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి. పక్కన రేవంత్‌రెడ్డి, డీకే అరుణ, విజయశాంతి, వీహెచ్, మర్రి శశిధర్‌రెడ్డి

ప్రభుత్వ విధానాలే బీఎస్ఎన్ఎల్ నష్టాలకు కారణం

ప్రైవేటీకరణ ఆలోచన విరమించుకోవాలి: భట్టి

ఉస్మానియా యూనివర్సిటీ, న్యూస్‌టుడే: ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలే బీఎస్ఎన్ఎల్ నష్టాలకు కారణమని కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు. నేషనల్ యూనియన్ ఆఫ్ బీఎస్ఎన్ఎల్ వర్కర్స్ (ఎన్‌యూబీఎస్ఎన్ఎల్‌డబ్ల్యూ) అయిదో అఖిల భారత సదస్సును ఆదివారం ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో నిర్వహించారు. రెండు రోజుల పాటు కొనసాగే ఈ సదస్సుకు అన్ని రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా హాజరైన భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. దేశంలో ప్రజల మధ్య కమ్యూనికేషన్‌కు బీఎస్ఎన్ఎల్ ఎంతగానో కృషి చేసిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలకు నూతన సాంకేతికత పరిజ్ఞానాన్ని అందించాల్సిన అవసరం ఉందని అన్నారు. నాడు నెహ్రూ ప్రభుత్వ రంగంలో అనేక కంపెనీలను ప్రారంభించగా, నేడు మోదీ ప్రభుత్వం అనేక సంస్థలను ప్రైవేటు పరం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. బీఎస్ఎన్ఎల్‌కి రాజీవ్‌గాంధీ ప్రపంచ స్థాయి గుర్తింపు తెచ్చారని గుర్తు చేశారు. ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి, ఏఐసీసీ అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్, మాజీ ఎంపీ మల్లు రవి, ఎన్‌యూబీఎస్ఎన్ఎల్‌డబ్ల్యూ జాతీయ అధ్యక్షులు థామస్ జాన్ తదితరులు మాట్లాడుతూ.. బీఎస్ఎన్ఎల్ నష్టాలకు కారణం కార్మికులు కాదన్నారు. తక్షణమే వేతన సవరణ చేయాలని డిమాండ్ చేశారు.

మాజీ మంత్రి, పీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో కాంగ్రెస్ శాసనసభపక్ష నేతగా నియమితులైన మల్లు భట్టివిక్రమార్కను ఆ పార్టీ నేతలు అభినందించారు. టీపీసీసీ అధ్యక్షుడు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హాజరై భట్టిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ నేతలు పాల్గొన్నారు.

తెగనరుకుతున్నారు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అడవుల్ని హరిస్తున్న ఓ తెగ

- సిబ్బంది భయమే పెట్టుబడిగా కొనసాగుతున్న వారి ఆగడాలు
- ఒక్కసారి అడవిలోకి ప్రవేశిస్తే అర ఎకరా అడవి ధ్వంసం
- వంశపారంపర్య వృత్తిగా కలప అక్రమ రవాణా
- అడ్డుకునేందుకు వెనకాడుతున్న అటవీ అధికారులు

ఈనాడు – హైదరాబాద్

టేకు చెట్లు నరుకుతున్న ముల్తానీ తెగ వారిని అడ్డుకునేందుకు అటవీశాఖ బీటు అధికారి మంద్యా నాయక్ ప్రయత్నించారు. చెట్లు నరుకుతున్న గొడ్డళ్లతోనే వాళ్లు ఆయన్నీ ముక్కలు చేశారు. ఆరేళ్ల క్రితం ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలో జరిగిన ఈ ఘటన సంచలనం సృష్టించింది. నెల రోజుల క్రితం వాహెబ్ అనే రేంజి అధికారిని తీవ్రంగా కొట్టారు. పెంబి అటవీ రేంజి రాగిదుబ్బ నాలలో ఇటీవల అటవీ సిబ్బందిపై రాళ్లతో దాడి చేశారు. ఈ ఘటనలో రేంజర్ శంకర్‌కు గాయాలయ్యాయి. ఆదిలాబాద్ అడవులే కేంద్రంగా కలప అక్రమ స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న ముల్తానీల ఆగడాలకు ఇవి కొన్ని తార్కాణాలే. ఆరేడేళ్ల వ్యవధిలో ఇలాంటి ఘటనలు వందల సంఖ్యలో జరిగాయి. అందుకే వీరికి ఎదురెళ్లాలంటేనే అటవీ సిబ్బందికి వణుకు. ఆ భయమే వారికి అభయమైంది. పచ్చటి అడవి కాస్తా కరిమింగిన వెలగపండులా మారుతోంది.

గుంపులుగా వెళ్తారు..గుట్టుగా కొట్టేస్తారు

పాకిస్థాన్‌లోని ముల్తానీ షరీఫ్ ప్రాంతానికి చెందిన ఓ తెగ స్వాతంత్ర్యానికి పూర్వమే ఇక్కడికి వచ్చి స్థిరపడింది. అందుకే వారికి ముల్తానీలనే పేరొచ్చింది. ఆదిలాబాద్ జిల్లా ఎల్లమ్మగూడ, గుండాల, కేశవపట్నం, జోగిపేట గ్రామాల్లో ఆరేడు వందల కుటుంబాలు నివసిస్తున్నాయి. బోథ్, నేరడిగొండ, ఇచ్చోడ, సిరిచెలిమ రేంజ్‌ల పరిధి అడవుల్లో చెట్లు నరికి అమ్ముకోవడమే వీరి వృత్తి. వీళ్లు చెట్లు నరికే విధానం కూడా విభిన్నంగా ఉంటుంది. చీకటిపడగానే ఒకేసారి గుంపుగా 50 మంది వరకూ అడవిలోకి ప్రవేశిస్తారు. జంతువులు రాకుండా అంతకుముందు నరికిన చెట్ల మొదళ్లకు



పెంబి అటవీ పరిధిలో దెయ్యమద్ది నుంచి కలపను ఎడ్లబండ్లలో తరలించుకుపోతున్న ముల్తానీలు

నిప్పు పెడతారు. ఆ వెలుతురే ఆసరాగా అప్పటికే ఎంచుకున్న చెట్లను గంటల వ్యవధిలోనే నేల కూలుస్తారు. ఒక్కో వ్యక్తి కనీసం మూడు నాలుగు చెట్లు కొట్టాలనే లక్ష్యంతో పనిచేస్తారు. అక్కడికక్కడే కొమ్మలు చెరిగి, దుంగలుగా మార్చి ఎడ్ల బండ్లపై వేసుకొని తిరుగు ప్రయాణమవుతారు. పెద్ద దుంగలుంటే వాటిని ఏకంగా ఎద్దులకే కట్టేస్తారు. ఏదేని ఎద్దు బరువు మోయలేక మొరాయిస్తే గ్రామానికి చేరుకున్న తర్వాత అదే వారికి ఆహారంగా మారుతుంది. వాళ్లు ఒక్కసారి అడవిలోకి వెళ్తే అర ఎకరా అడవి నామరూపాల్లేకుండా పోతుందని స్థానికులు చెబుతున్నారు. ‘‘ఒకప్పుడు వీళ్లు నరికిన దుంగలన్నింటినీ వాహనాలు తిరిగే రహదారి ప్రాంతానికి చేర్చేవారు. అన్నింటినీ పోగేసిన తర్వాత ఆ దారి వెంట వెళ్లే ఖాళీ లారీలను ఆపి, డ్రైవర్లను బంధించి కలపను తమకు కావాల్సిన ప్రాంతానికి తీసుకెళ్లేవారు’’ అని జిన్నారం ప్రాంతంలో పనిచేసిన ఒక విశ్రాంత అటవీశాఖ ఉద్యోగి చెప్పారు. ఇప్పుడు వాళ్లు కలపను తమ గ్రామాల సమీపంలోనే నిల్వచేస్తున్నారని, కడెం నదీ పరీవాహక ప్రాంతంలో పందిమడుగు పరిసరాల్లో ప్రత్యేకంగా స్థావరాలు ఏర్పాటు చేసుకున్నారని ఆయన వివరించారు. ఆదిలాబాద్ జిల్లా కుంటాల జలపాతం దిగువన బాబ్జీపేట, పీసర ప్రాంతాల మధ్య, జాతీయ రహదారికి లింక్‌రోడ్లు

ఈ కర్రలు గొడ్డళ్ల గుంపును ఆపగలవా?



పెంబి అటవీ రేంజిలో చిన్న కర్రలతో రక్షణ విధులు నిర్వహిస్తున్న రాగిదుబ్బనాల బేస్ క్యాంప్ సిబ్బంది

ఉన్నచోట్ల, వాగులు, ఇసుక ప్రాంతాలు, లోయలు, పత్తిచేల మధ్యలోనూ కలపను దాచిపెడుతున్నారని, అదును చూసి కోత మిల్లులకు తరలిస్తుంటారని ఆయన వివరించారు. ‘ఈనాడు’ ప్రతినిధులు ముల్తానీలు నివసిస్తున్న కొన్ని గ్రామాల్లో రహస్యంగా పర్యటించినప్పుడు ఇంచుమించు ప్రతి ఇంట్లోనూ పెద్దపెద్ద టేకు దుంగలు కనిపించాయి. ఇలా కొట్టుకొచ్చిన కలపను లోడు ఒక్కింటికి రూ.6 లక్షలకు కోత మిల్లులకు అమ్ముతారని సమాచారం.

అనాగరికం..చదువుకు దూరం

ముల్తానీల గ్రామాల్లోకి వెళ్లాలంటే ఎవరికైనా హడలే. కొత్త వ్యక్తులు కనిపిస్తే పొలిమేరల్లోనే నిలబెడతారు. ఎందుకు వచ్చారో ఆరా తీస్తారు. తేడా వస్తే దాడికి తెగబడతారు. ఈ గ్రామాల్లో పరిస్థితి తెలుసుకునేందుకు ‘ఈనాడు’ బృందం పర్యటించింది. గుండాల గ్రామానికి వెళ్లినప్పుడు ఊరి పొలిమేరల్లోనే ఓ వ్యక్తి ‘ఈనాడు’ వాహనాన్ని ఆపేశాడు. గ్రామ శివార్లలోని వాగుపై నిర్మిస్తున్న చెక్‌డ్యాంను చూసేందుకు వచ్చామని చెప్పిన తర్వాతే అతను వెళ్లేందుకు అనుమతించాడు. మిషన్ భగీరథ పనుల కోసం వచ్చామని చెప్పాకే మరో గ్రామంలోకి వెళ్లేందుకు అనుమతి లభించింది. ‘నాగరికతకు దూరంగా వెనుకబాటుతనానికి దగ్గరగా ఉన్న ఈ ముల్తానీ గ్రామాల్లో పిల్లలకు చదువంటే తెలియదు. ప్రభుత్వం పాఠశాలలు కట్టించినా, ఉపాధ్యాయులను నియమించినా పిల్లలకు చదువు చెప్పించేందుకు ఎవరూ ఆసక్తి చూపడం లేదు’ అనే విషయం ‘ఈనాడు’ పరిశీలనలో వెల్లడైంది.

క్షేత్రస్థాయి లోపాలే కారణమా?

అడవులను కాపాడాలంటూ ఆదేశాలు జారీ చేస్తున్న అటవీశాఖ క్షేత్రస్థాయిలో వాస్తవాలను మాత్రం పట్టించుకోవడం లేదు. వాస్తవంగా అటవీ రక్షణ విధుల్లో క్రియాశీలక పాత్ర నిర్వహించేది బీటు స్థాయి సిబ్బందే. తమ పరిధిలోని అడవిలో ఏమూలన ఏ చెట్టు ఉంది? అక్రమార్కులు రావడానికి ప్రవేశమార్గాలు ఎక్కడెక్కడున్నాయి? తదితర వివరాలన్నీ వీరికి కొట్టిన పిండే. అలాంటి కీలకమైన సిబ్బందిని పొరుగుసేవల ప్రాతిపదికన నియమిస్తున్నారు. వీరి నెల జీతం రూ.8 వేలు. వీరు విధులు నిర్వహించే ప్రాంతాల్లో చాలాచోట్ల తాగేందుకు మంచినీటి సదుపాయం కూడా లేదు. అందుకే పడుతున్న కష్టానికి ప్రతిఫలం రాబట్టుకునేందుకు వీళ్లు ఒక్కోసారి అక్రమార్కుల్ని చూసీచూడనట్లు వదిలేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

కఠిన చర్యలు తీసుకుంటున్నాం

కలప స్మగ్లింగ్‌ను అరికట్టేందుకు శాఖపరంగా అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నాం. ముల్తానీలు గతంలో పలుమార్లు అటవీ సిబ్బందిపై దాడులు చేశారు. వారిని ఎదుర్కొనేందుకు, సిబ్బందికి రక్షణ కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నాం. పోలీసు శాఖ సహకారం తీసుకుంటున్నాం. పదేపదే కలప స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న వారిపై పీడీ యాక్టు నమోదు చేస్తున్నాం. ఇతర ప్రాంతాల్లోనూ అక్రమ కలపకు అడ్డుకట్ట వేస్తున్నాం. కొత్తగా 40కి పైగా పోలీసు, అటవీ ఉమ్మడి చెక్‌పోస్టులు నెలకొల్పాం. గడిచిన నెల రోజుల్లో 554 గ్రామాల్లో, 387 సామిల్లుల్లో తనిఖీలు నిర్వహించాం. 449 కేసులు నమోదు చేశాం. 544 ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశాం.

–ప్రశాంత్ కుమార్‌ఝా, అటవీ సంరక్షణ ప్రధాన అధికారి (పీసీసీఎఫ్)

రాజూరా అడవుల్లో పెద్దపులి సంచారం

ఖానాపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం రాజూరా అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచరించినట్లు అటవీ అధికారులు గుర్తించారు. రెండు రోజుల క్రితం ఎక్బాల్‌పూర్ అటవీ ప్రాంతంలో పెద్దపులి కనిపించినప్పటికీ, అటవీ అధికారులు ఆ విషయాన్ని గోప్యంగా ఉంచారు. ఆదివారం రాజూరా అటవీ ప్రాంతంలోని బోగుట్ట వద్ద ఆదివారం పెద్దపులి పెంటికలు, దాని అడుగులను గుర్తించారు. ఆదివారం నిర్మల్ డీఎఫ్‌వో దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది ఖానాపూర్, పెంబి రేంజి పరిధిలో తిరుగుతూ సిబ్బందిని అప్రమత్తం చేశారు.

బీసీ బిల్లు ప్రవేశపెట్టాలి

ఎంపీలకు బీసీ నేతల విజ్ఞప్తి

ఈనాడు, దిల్లీ: పార్లమెంటు సమావేశాల్లో బీసీ బిల్లు ప్రవేశపెట్టేలా కృషి చేయాలని పలువురు ఎంపీలకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలోని బీసీ నేతల బృందం విజ్ఞప్తి చేసింది. దిల్లీలో భాజపా, తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, అన్నాడీఎంకే, తెదేపా, వైకాపా, ఎన్‌సీపీ ఎంపీలను కలిసి బీసీ బిల్లుకి కృషి చేయాలని కోరామని కృష్ణయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్థికంగా వెనకబడిన వర్గాలకు 10శాతం రిజర్వేషన్లు ఇవ్వడంతో ఎస్సీ, ఎస్టీ, బీసీల్లో వచ్చిన అసంతృప్తి తగ్గాలంటే తక్షణమే బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండు చేశారు.

లోక్‌సభ ఎన్నికలకు సిద్ధం కండి

- 5న గడ్కరీ, 13న అమిత్‌షా రాక
- రాష్ట్ర ఇన్‌ఛార్జి అరవింద్ లిబ్మావళి

ఈనాడు, హైదరాబాద్: శాసనసభ ఎన్నికల్లో ఓటమి నైరాశ్యం నుంచి బయటపడి రానున్న ఎన్నికలకు సిద్ధం కావాలని లోక్‌సభ ఎన్నికల రాష్ట్ర ఇంఛార్జి అరవింద్ లిబ్మావళి రాష్ట్ర భాజపా నేతలకు సూచించారు. ఈ క్రమంలోనే క్లస్టర్ల వారీగా లోక్‌సభ నియోజకవర్గాల సమావేశాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నాంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం భాజపా రాష్ట్ర కోర్ కమిటీ, పదాధికారులతో లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అరవింద్ మాట్లాడుతూ.. ఈ నెల 5న మల్కాజిగిరి, సికింద్రాబాద్, హైదరాబాద్ లోక్‌సభ స్థానాల క్లస్టర్ సమావేశం జరగనుందని, దీనికి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ హాజరు కానున్నారని తెలిపారు. 13న నిజామాబాద్‌లో నిర్వహించే క్లస్టర్ సమావేశానికి భాజపా జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా రానున్నారని వెల్లడించారు. ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్ల కల్పన, కేంద్ర బడ్జెట్‌లో ఆదాయపు పన్ను మినహాయింపు వంటి అంశాలను ప్రజల్లోకి పెద్దఎత్తున తీసుకెళ్లాలని, సభలు పెట్టాలని ఆయన పార్టీ నేతలకు సూచించారు. మల్కాజిగిరి, సికింద్రాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ స్థానాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోర్ కమిటీ సమావేశంలో కమలనాథులు నిర్ణయించారు. ఫిబ్రవరి 12 నుంచి మార్చి 2 వరకు ప్రజల్లోకి వెళ్లేలా కార్యక్రమాలు రూపొందించుకున్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్‌తోపాటు ఎంపీ దత్తాత్రేయ, నేతలు కిషన్‌రెడ్డి, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



పార్లమెంట్ ఎన్నికలపై సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జి అరవింద్ లిబ్మావళి. వేదికపై నేతలు ఇంద్రసేనారెడ్డి, లక్ష్మణ్, దత్తాత్రేయ, కిషన్‌రెడ్డి, రామచంద్రరావు

రాష్ట్రానికి నిధులపై చర్చకు సిద్ధమా?

తెలంగాణకు కేంద్రం నిధులు మంజూరు చేయడం లేదని తెరాస నేతలు అసత్య ఆరోపణలు చేస్తున్నారని. ఈ విషయంపై చర్చకు భాజపా సిద్ధంగా ఉందని ఎంపీ దత్తాత్రేయ సవాల్ విసిరారు. కోర్‌కమిటీ సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. మోదీ ప్రభుత్వం అవినీతి రహిత పాలన అందిస్తుంటే. రాష్ట్రంలో తెరాస సర్కారు అవినీతి పాలన సాగిస్తోందని ఆరోపించారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించిన కిసాన్ పథకంతో రాష్ట్ర ప్రభుత్వం రైతు బంధు పథకాన్ని కలపవద్దని, ఈ రెండింటిని వేర్వేరుగా అమలు చేయాలని ఆయన సీఎం కేసీఆర్‌ను కోరారు.

సులభతర వాణిజ్య అనుమతుల్లో మరో అడుగు

ఒకే గొడుగు కిందకు పలు ప్రభుత్వ శాఖలు

ఈనాడు, హైదరాబాద్: పరిశ్రమల స్థాపనకు ఏక గవాక్ష విధానంలో అనుమతులు ఇచ్చేందుకు టీఎస్ఐపాస్ విధానాన్ని తీసుకొచ్చిన ప్రభుత్వం అదే దారిలో మరో అడుగు వేసేందుకు చర్యలు ముమ్మరం చేసింది. సులభతర వాణిజ్య అనుమతులు(ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్-ఈఓడీబీ) మరింత సులువుగా వచ్చేలా సంబంధిత శాఖలన్నింటినీ ఒకేతాటిపైకి తెచ్చేందుకు ప్రయత్నాలు చేపడుతోంది. ఈఓడీబీలో భాగంగా ప్రభుత్వ శాఖల్లో 360 రకాల సంస్కరణలను అమలు చేయాల్సి ఉంటుంది. టీఎస్ఐపాస్ విధానం ప్రవేశపెట్టాక అనుమతులన్నీ సులువుగా మారాయి. కానీ కొన్ని శాఖల నుంచి అనుమతులు పొందాలంటే రకరకాల వెబ్‌సైట్‌లను సంప్రదించాల్సి వస్తోంది. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ పరిధిలోని భవన నిర్మాణం, ఇతర సేవలకు సంబంధించిన అనుమతులు ఆ శాఖ వెబ్‌సైట్ ద్వారా, భూముల వివరాలు, రిజిస్ట్రేషన్ తాలూకు సమాచారం, మ్యుటేషన్ సేవలకు రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖల ద్వారా తీసుకోవాల్సి వస్తోంది. ఈ క్రమంలో కొన్ని శాఖల్లో నిర్దిష్ట సమయంలో సేవలు అందడం లేదు. ఇలాంటి అవరోధాలన్నింటినీ తొలగించేందుకు తాజాగా చర్యలు చేపడుతున్నారు. అన్ని శాఖల వివరాలు ఆన్‌లైన్‌లో ఒకే క్లిక్‌లో తెలుసుకునేలా దస్త్రాలను అనుసంధానిస్తున్నారు. భూముల రిజిస్ట్రేషన్లు, ధరలు, భూముల విస్తీర్ణం, కొలతలు తదితర సేవలన్నింటినీ ధరణి ద్వారా పొందేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈఓడీబీలో భాగంగా దేశంలో తెలంగాణ అగ్రస్థానంలో నిలవాలంటే ప్రభుత్వ శాఖల్లో వీలైనన్ని సంస్కరణలు అమలు చేయక తప్పని పరిస్థితి ఉంది. రాష్ట్రంలో ఇప్పటికీ ఆన్‌లైన్ సేవలు అందించని శాఖలను గుర్తించి వాటిలో సంస్కరణల బాటలో నడిపించాలని సీఎస్ ఎస్.కె.జోషి యంత్రాంగాన్ని ఆదేశించినట్లు తెలిసింది.

రైల్వే పరీక్షలపై యువతకు శిక్షణ ఇప్పించాలి

సీఎం కేసీఆర్‌కు ఎంపీ వినోద్ లేఖ

ఈనాడు, హైదరాబాద్: రైల్వే శాఖలో వివిధ ఉద్యోగాల భర్తీ కోసం జరిగే రాత పరీక్షలపై తెలంగాణ యువతకు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో శిక్షణ ఇప్పించాలని కరీంనగర్ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఆదివారం ఆయన లేఖ రాశారు. ‘‘దేశ వ్యాప్తంగా రైల్వే శాఖలో త్వరలో రెండున్నర లక్షల ఖాళీలు భర్తీ చేయనున్నట్లు రైల్వేశాఖ మంత్రి పీయూష్ గోయల్ ఇటీవల ప్రకటించారు. త్వరలో ఆ శాఖలో వేలాది మంది పదవీ విరమణ పొందనున్న నేపథ్యంలో ఖాళీల సంఖ్య పెరుగుతుంది. రైల్వే ఉద్యోగాలకు ఎక్కువగా ఇతర రాష్ట్రాల వారే ఎంపికవుతున్నారు. బిహార్, తమిళనాడు రాష్ట్రాలు శిక్షణ ఇస్తుండటం వల్ల అక్కడి నిరుద్యోగులకు ఎక్కువ ఉద్యోగాలు లభిస్తున్నాయి. తెలంగాణ ప్రభుత్వం కూడా గురుకుల పాఠశాలల సమితి ఆధ్వర్యంలో రైల్వే పరీక్షలపై ఉచితంగా శిక్షణ ఇవ్వాలి. అన్ని పాత జిల్లా కేంద్రాల్లో శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలి. రైల్వే ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న వారిని ఎంపిక చేసి, వందరోజులపాటు శిక్షణ ఇస్తే వారికి ఉపయుక్తంగా ఉంటుంది’ అని ఆయన లేఖలో సీఎంను కోరారు. మరోవైపు శిక్షణపై ఎస్సీ, ఎస్టీ గురుకులాల కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, బీసీ, మైనారిటీ గురుకుల సంస్థల కార్యదర్శులతోనూ వినోద్‌కుమార్ మాట్లాడారు. ఆయా గురుకులాలు, స్టడీ సర్కిళ్ల సన్నాహాలపై ప్రతిపాదనలు తయారు చేసి ఇవ్వాలని కోరారు. దానికి వారు అంగీకరించారని ఎంపీ వెల్లడించారు.

ఆ రెండు మండలాలను ములుగు జిల్లాలో కలపాలి

ప్రస్తుతం మహబూబాబాద్ జిల్లాలో ఉన్న గంగారం, కొత్తగూడ మండలాలను కొత్తగా ఏర్పాటుకానున్న ములుగు జిల్లాలో కలపాలని ఆ మండలాల నేతలు ఎంపీ వినోద్‌కుమార్‌ను కోరారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఎంపీ నివాసంలో ఆయన్ని కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. కాకతీయ విశ్వవిద్యాలయ ఆచార్యుడు ఈసం నారాయణ, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్, ఆదివాసీ ఐకాస ఛైర్మన్ దాట్ల నాగేశ్వర్‌రావు, ఉద్యోగ, విద్యార్థి సంఘా నాయకులు ఎంపీని కలిసిన వారిలో ఉన్నారు.

రాజకీయాల్లో యువత భాగస్వామ్యం అవసరం: అసదుద్దీన్ ఒవైసీ

అబిడ్స్, న్యూస్‌టుడే: రాజకీయాల్లో యువత భాగస్వామ్యం అవసరమని అఖిల భారత ఎంఐఎం పార్టీ అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అనే అంశంపై ఆదివారం హైదరాబాద్‌లోని యువతీ, యువకులకు లర్న్ ప్రాజెక్ట్ పేరుతో ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల వయోపరిమితిని 20 ఏళ్లకు కుదించాలని తాను డిమాండ్ చేశానని, తద్వారా యువత భాగస్వామ్యం రాజకీయాల్లో పెంచడమే తన ఉద్దేశమని అన్నారు. ఇందుకోసం ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు.

★ కశ్మీరీ పండిత్‌లను ప్రధాని నరేంద్రమోదీ, భాజపా ప్రభుత్వం దారుణంగా దగా చేసినట్లు మజ్లిస్‌పార్టీ సారథి అసదుద్దీన్ ఒవైసీ ఆదివారం పుణెలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆరోపించారు. కశ్మీరు లోయలో వారికి పునరావాసం కల్పించడంలో మోదీ సర్కారు విఫలమైందని విమర్శించారు.

ఏఐబీఎంఎంఎస్ అధ్యక్షుడిగా కలాల్ శ్రీనివాస్

ఈనాడు, దిల్లీ: అఖిల భారతీయ బీడీ మజ్దూర్ మహా సంఘ్ (ఏఐబీఎంఎంఎస్) అధ్యక్షుడిగా తెలంగాణకు చెందిన కలాల్ శ్రీనివాస్ ఎన్నికయ్యారు. మూడు రోజులుగా ఒడిశాలోని అంగుల్ జిల్లా కేంద్రంలో బీడీ కార్మికుల మహాసభ నిర్వహించారు. ఈ సభల్లో సిద్దిపేటకు చెందిన కలాల్ శ్రీనివాస్‌ను మహాసంఘ్ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. రాజకీయాలకతీతంగా ఈ మహాసభల్లో బీడీకార్మికుల సంక్షేమం కోసం తీర్మానాలు చేశామని శ్రీనివాస్ ఆదివారం దిల్లీలో ఒక ప్రకటనలో తెలిపారు. ఏఐబీఎంఎంఎస్ కేంద్ర కమిటీ కార్యవర్గ సభ్యులుగా తెలంగాణకు చెందిన స్వరూప, వసంత, సరితలను ఎన్నుకొన్నారు.

ప్రజాసంఘాలు, హక్కుల నేతలను విడుదల చేయాలి

దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం డిమాండ్

నారాయణగూడ, న్యూస్‌టుడే: భీమా-కోరేగావ్ కుట్రల కేసులను ఎత్తివేసి, అక్రమంగా అరెస్టు చేసిన ప్రజాసంఘాల, హక్కుల సంఘాల నేతలను బేషరతుగా విడుదల చేయాలని దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) డిమాండ్ చేసింది. ఆదివారం హైదరాబాద్‌లో తెలంగాణ సారస్వత పరిషత్తులోని దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో పీడీఎం 2వ రాష్ట్ర మహాసభలు, కార్యవర్గ సమావేశం జరిగింది. పీడీఎం రాష్ట్ర అధ్యక్షులు ఎం.రాజు అధ్యక్షోపన్యాసం చేస్తూ..స్వాతంత్ర్య సమరయోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల స్ఫూర్తితో సామ్రాజ్యవాదానికి, భూర్జువా, భూస్వామ్య దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా పీడీఎం పోరాడుతోందని చెప్పారు. రాజ్యహింసలో రాష్ట్ర కమిటీ సభ్యులు కనకాచారి, పున్నారావులను కోల్పోయామన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ..గత 13 ఏళ్లలో పాలకుల ప్రజావ్యతిరేక విధానాలు, దోపిడీ, ఆదివాసీ, ముస్లిం మైనారిటీ, మహిళలపై దాడులు, అత్యాచారాలు, హిందూ మతోన్మాదానికి వ్యతిరేకంగా ప్రజలను జాగృతం చేసినట్లు తెలిపారు.

నైతికతే గీటురాయి


ఏపీ హైకోర్టు తాత్కాలిక భవనాన్ని ప్రారంభించిన అనంతరం ప్రసంగిస్తున్న జస్టిస్ రంజన్ గొగొయి

- ప్రజలకు న్యాయం చేయడంలో అదే కీలకం
- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయి వెల్లడి

ఈనాడు, అమరావతి: మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజలకు మరింత చేరువ కావాల్సిన అవసరం న్యాయవ్యవస్థపై ఉందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయి పేర్కొన్నారు. న్యాయ వ్యవస్థలో నైతికత, న్యాయ నిర్వహణ రెండూ కలిసి ప్రయాణం చేయాలంటూ... ప్రజలకు న్యాయం చేయడంలో నైతికతే గీటురాయిగా ఉండాలని సూచించారు. ఆధునిక సాంకేతిక హంగులతో హుందాతనం ఉట్టిపడుతున్న ఏపీ హైకోర్టు... న్యాయం కోసం ఎదురు చూస్తున్న వారి సమస్యలను పరిష్కరిస్తుందని అన్నారు. రాజధాని అమరావతిలోని జస్టిస్ సిటీలో నేలపాడు వద్ద ఆదివారం ఆయన ఏపీ హైకోర్టు శాశ్వత భవనానికి శంకుస్థాపన చేసి, అనంతరం సమీపంలోని జ్యుడీషియల్ కాంప్లెక్స్ భవనాన్ని (హైకోర్టు తాత్కాలిక భవనం) ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో జస్టిస్ గొగొయి ప్రసంగించారు. హైకోర్టు ప్రారంభం సంతోషకరమైనదంటూ... న్యాయమూర్తులు, న్యాయవాదులు, హైకోర్టు అధికారులు, ఏపీ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. న్యాయవ్యవస్థ కొత్త పాత్ర, న్యాయవాదుల పాత్ర, పేరుకుపోతున్న పెండింగ్ కేసులు, భారత న్యాయవ్యవస్థ ఎదుర్కొంటున్న ఇతర సవాళ్ల గురించి వివరించారు.

"న్యాయ నిర్ణయ ప్రక్రియలో న్యాయమూర్తులు భావోద్వేగాలు, వ్యక్తిగత కారణాలకు తావివ్వకూడదు. న్యాయవ్యవస్థ ధైర్యవంతగా ముందుకు తీసుకెళ్లడంలో న్యాయవాదుల పాత్ర అత్యంత కీలకం. వారు కోర్టుగదులకే పరిమితం కాకూడదు. ప్రభుత్వాలు ప్రజల పట్ల వివక్షత చూపుతున్నప్పుడు, అన్యాయంగా వ్యవహరించినప్పుడు, చెల్లుబాటు కాని చట్టాల విషయంలో, నైతిక నియమాల అంశంలో న్యాయమూర్తులకు పరీక్ష ఎదురవుతుంది. రాజ్యాంగ నియమాలకు లోబడి ఆదేశాలు, తీర్పులు ఇవ్వాల్సి ఉంటుంది.

దేశంలో పేరుకుపోయిన మూడు కోట్ల పెండింగ్ కేసులు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. ఆ మూడు కోట్లలో... 81 లక్షల కేసులు ఏడాది కిందట దాఖలైనవి. వాటిని పెండింగ్ కేసులుగా చెప్పలేం. 50 లక్షల కేసులు మోటారు వాహనాల చట్ట ఉల్లంఘనలు, తూనికలు కొలతల చట్ట ఉల్లంఘనల లాంటి చిన్న కేసులు. ఏపీ, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు, దేశంలోని ఇతర ప్రధాన న్యాయమూర్తులు ఇలాంటి కేసుల పరిష్కారంపై దృష్టి సారించాలి. ముఖ్యంగా 25 లక్షల కేసులు పదేళ్ల నాటివి. వాటిని తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం ఉంది. న్యాయవ్యవస్థకు నల్లమచ్చగా తయారైన ఆ 25 లక్షల కేసుల్ని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించడం తప్ప వేరేమార్గంలేదు. అందుకు నిబద్ధతతో పనిచేయాలి. ఆలోచనల పరంగానే కాకుండా న్యాయ సంబంధ నిర్మాణాల పరంగానూ...న్యాయవ్యవస్థ ప్రయాణం ముందుకు సాగుతోంది.

పోస్టులు ఖాళీ...

భర్తీ చేయాల్సిన న్యాయమూర్తుల పోస్టులు భారీగా ఉన్నాయి. జిల్లా స్థాయి న్యాయవ్యవస్థలో 5వేల మంది న్యాయమూర్తుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. హైకోర్టు, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సానుకూల స్పందన వస్తున్న నేపథ్యంలో ఆ 5వేల పోస్టుల్లో 75 శాతం త్వరలో భర్తీ కానున్నాయి. దేశవ్యాప్తంగా హైకోర్టు జడ్జీల విషయంలో 392 ఖాళీలున్నాయి. అందులో 270 పోస్టుల భర్తీకి దేశంలోని వివిధ హైకోర్టులు పేర్లు సిఫారసు చేయాల్సి ఉంది. ప్రస్తుతం 130 పోస్టుల భర్తీ విషయంలో ప్రక్రియ కొనసాగుతోంది. 100 ఖాళీల విషయమై సుప్రీంకోర్టు పరిశీలిస్తోంది. రాబోయే రెండు మూడు వారాల్లో వీటిని పరిష్కరిస్తాం. మరో 14 జడ్జీ పోస్టుల అంశం కేంద్ర ప్రభుత్వం వద్ద పరిశీలనలో ఉంది. అపరిష్కృత వ్యాజ్యాల్ని పరిష్కరించడంలో ఖాళీల భర్తీ ఓ మార్గం. తగినంత మంది న్యాయమూర్తులు లేకుండా ప్రజలకు న్యాయం అందించలేం" అని జస్టిస్ గొగొయి పేర్కొన్నారు.

అభినందనలు...

జ్యుడీషియల్ కాంప్లెక్స్ భవన నిర్మాణం కోసం నిరంతరం శ్రమించి, వేగంగా జరిపిన రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు, భాగస్వాములైన అందరికీ జస్టిస్ గొగొయి అభినందనలు తెలిపారు. రాజ్యాంగ బాధ్యతలను నెరవేర్చే పనిలో రాష్ట్రప్రభుత్వం చేసిన కృషిని తాను గుర్తిస్తున్నానని చెప్పారు.

జ్యుడీషియల్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవం

శాశ్వత హైకోర్టుకు శంకుస్థాపన అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన గ్యాలరీని సందర్శించారు. ఆ తర్వాత జస్టిస్ రంజన్ గొగొయి, సీఎం చంద్రబాబు జ్యుడిషియల్ కాంప్లెక్స్ వద్ద పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు. అక్కడే జస్టిస్ గొగొయి జాతీయ జెండాను ఆవిష్కరించారు. తర్వాత జ్యుడిషియల్ కాంప్లెక్స్ భవనాన్ని ప్రారంభించారు. ఆ వెంటనే గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. జ్యుడిషియల్ కాంప్లెక్స్‌లో హైకోర్టు నిర్వహణకు ఏర్పాటు చేసిన కోర్టు గదులను ప్రారంభించి పరిశీలించారు. అనంతరం అతిథులందరూ సభాప్రాంగణానికి చేరుకుని ప్రసంగించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

చంద్రబాబు దార్శనికత మరోసారి నిరూపితం



ఏపీ సీఎం చంద్రబాబునాయుడు తన దార్శనికతను మరోసారి నిరూపించుకున్నారు. రాజధాని అభివృద్ధి ప్రణాళికలు త్వరలోనే కార్యరూపం దాల్చాలని, అవి పూర్తికావాలని కోరుకుంటున్నా. హైకోర్టు విభజన తర్వాత ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో చెరో 1.70 లక్షల వ్యాజ్యాలు పెండింగ్‌లో ఉన్నాయి. త్వరితగతిన వాటిని పరిష్కరించి ప్రజలకు న్యాయం జరిగేలా చూడాల్సిన బాధ్యత న్యాయమూర్తులపై ఉంది.

– జస్టిస్ సుభాష్‌రెడ్డి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి

దేశంలోనే ఉత్తమమైన హైకోర్టుగా నిలుపుదాం



దేశ చరిత్రలో అమరావతికి ఓ ప్రత్యేక స్థానం ఉంది. హైకోర్టు ఏపీకి తరలిరావడంతో ప్రజల ఆకాంక్ష నెరవేరింది. ఈ గడ్డ నుంచి ఎంతోమంది గొప్పవారు న్యాయవ్యవస్థకు సేవలందించారు. హైకోర్టు భవన నిర్మాణ బాధ్యతను ప్రభుత్వం చేపట్టింది. ఇక మీదట ఈ భవనాన్ని ఓ వ్యవస్థగా మార్చాల్సిన బాధ్యత మాపై ఉంది. న్యాయవాదులు, న్యాయమూర్తులు ఉద్యోగుల సమష్టి కృషి వల్ల హైకోర్టు పూర్తి స్థాయిలో పనిచేసే దశకు చేరింది. దేశంలోనే ఉన్నతంగా ఏపీ హైకోర్టును నిలపాల్సిన బాధ్యత మనపై ఉంది.

– జస్టిస్ ప్రవీణ్‌కుమార్, ఏపీ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి

ప్రభుత్వాల సహకారంతోనే



ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉమ్మడి హైకోర్టు విభజన చాలా సున్నితంగా జరిగింది. తెలంగాణ, ఏపీ, కేంద్ర ప్రభుత్వాల సహకారంతోనే ఆ ప్రక్రియను పూర్తి చేయగలిగాం. ఏపీ హైకోర్టు ఉన్నత శిఖరాలను అందుకోవాలని ఆకాంక్షిస్తున్నా.

– జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి

అమరావతి మెడలో మరో మణిహారం

విజయవాడ కేంద్రంగా రాష్ట్ర హైకోర్టు కార్యకలాపాలు నెల రోజుల క్రితమే మొదలవగా... ఇప్పుడు ప్రారంభోత్సవం జరిగిన జ్యుడిషియల్ కాంప్లెక్స్ భవనంలో త్వరలోనే రాష్ట్ర హైకోర్టు పూర్తిస్థాయిలో కొలువు తీరనుంది. ఈ భవనాన్ని కేవలం 8 నెలల రికార్డు సమయంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిచేసింది.

నవ్యాంధ్రలో న్యాయశకం

- ఏపీ హైకోర్టు తాత్కాలిక భవనం ప్రారంభం
- శాశ్వత హైకోర్టుకు శంకుస్థాపన
- పాల్గొన్న సుప్రీంకోర్టు సీజే జస్టిస్ రంజన్ గొగొయి, సుప్రీం న్యాయమూర్తులు, ఏపీ, తెలంగాణ హైకోర్టుల చీఫ్ జస్టిస్‌లు

ఈనాడు, అమరావతి

నవ్యాంధ్ర చరిత్రలో నవ శకానికి నాందీ ప్రస్తావన జరిగింది. రాజధాని అమరావతి కీర్తి కిరీటంలో మరో కలికితురాయి మెరిసింది. న్యాయపాలనలో చరిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. ఆంధ్రుల సాంస్కృతిక వారసత్వం, ఆధునికతల కలబోతగా రూపుదిద్దుకుంటున్న అమరావతిలో... అత్యంత సుందరంగా నిర్మించిన రాష్ట్ర హైకోర్టు భవనం (జ్యుడిషియల్ కాంప్లెక్స్) వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య ఆదివారం ప్రారంభమైంది. దేశంలోనే అత్యుత్తమ కట్టడాల్లో ఒకటిగా, తెలుగుజాతి ఔన్నత్యాన్ని తలెత్తుకు చాటేలా నిర్మించనున్న హైకోర్టు శాశ్వత భవన నిర్మాణానికి అంకురార్పణ జరిగింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయి చేతుల మీదుగా... అమరావతిలో జ్యుడీషియల్ కాంప్లెక్స్ భవనం ప్రారంభోత్సవం, శాశ్వత హైకోర్టు భవనానికి భూమిపూజ కార్యక్రమాలు జరిగాయి. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎన్.వి. రమణ, జస్టిస్ లావు నాగేశ్వరరావు, జస్టిస్ ఆర్.సుభాష్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సి.ప్రవీణ్‌కుమార్, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టి.బి.ఎన్.రాధాకృష్ణన్, ఉత్తరాఖండ్ సీజే జస్టిస్ రమేష్ రంగనాథన్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. విజయవాడ కేంద్రంగా రాష్ట్ర హైకోర్టు కార్యకలాపాలు నెల రోజుల క్రితమే మొదలవగా... ఇప్పుడు ప్రారంభోత్సవం జరిగిన జ్యుడిషియల్ కాంప్లెక్స్ భవనంలో త్వరలోనే రాష్ట్ర హైకోర్టు పూర్తిస్థాయిలో కొలువు తీరనుంది. అమరావతి కేంద్రంగానే న్యాయపాలన జరగనుంది.



హైకోర్టు తాత్కాలిక భవన ప్రాంగణంలో మీట నొక్కి జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయి. చిత్రంలో జస్టిస్ ఎన్‌వీ రమణ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ★ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రారంభించిన హైకోర్టు తాత్కాలిక భవనం

చరిత్రాత్మక రోజు

- ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు
- నల్సార్ వర్సిటీ ఏర్పాటుకు సహకరించాలని సీజేకు వినతి

"ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ పరిపాలనలో ఈ రోజు చరిత్రాత్మకమైనది. రాష్ట్ర విభజన జరిగిన నాలుగున్నరేళ్ల తర్వాత అమరావతి కేంద్రంగా హైకోర్టు ప్రారంభం కావటం గర్వకారణం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఆదివారం అమరావతిలో శాశ్వత హైకోర్టు భవన నిర్మాణానికి శంకుస్థాపన, జ్యుడిషియల్ కాంప్లెక్స్ భవన ప్రారంభ కార్యక్రమాల అనంతరం ఆయన ప్రసంగించారు. అభివృద్ధికి ఆటంకంగా మారుతున్న లిటిగేషన్లను ఎలా తగ్గించాలనేదానిపై న్యాయస్థానాలు దృష్టి సారించాలని చంద్రబాబు కోరారు. అవి తగ్గితేనే మెరుగైన వృద్ధిరేటు సాధ్యపడుతుందని వ్యాఖ్యానించారు. అభివృద్ధి ద్వారా సంపద సృష్టించకపోతే పేదరిక నిర్మూలన సాధ్యం కాదని చెప్పారు. పర్యావరణ పరిరక్షణ అవసరమేనని, అదే సమయంలో ప్రకృతి రమణీయ ప్రదేశాలను పర్యాటకంగా వినియోగించుకునేందుకు వీలు ఉండాలని అన్నారు. పర్యావరణ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందన్నారు. అమరావతిలో ఏర్పాటు చేసే నవనగరాల్లో ఒకటైన న్యాయనగరం (జస్టిస్ సిటీ)లో నల్సార్ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, న్యాయమూర్తులు సహకరించాలని కోరారు. అందుకు అవసరమైన భూమి, కావాల్సిన నిధులు ఇస్తామని తెలిపారు. సింగపూర్, హాంకాంగ్, లండన్‌ల తరహాలో మధ్యవర్తిత్వ, వివాద పరిష్కార కేంద్రాలు (ఆర్బిట్రేషన్, డిస్ప్యూట్ రిజల్యూషన్ సెంటర్)లను ఏర్పాటు చేయాలని, న్యాయ విద్యాలయాలను నెలకొల్పేందుకూ తోడ్పాటు అందించాలని విన్నవించారు.

న్యాయస్థానాల అచంచల విశ్వాసం



పవిత్ర కృష్ణా తరంగాల సవ్వడిలో, తెలుగు సంస్కృతి పవనాల వీచికతో పరవశించే ఈ నేలపై రాజధానితో పాటు హైకోర్టు నిర్మించటం చరిత్రాత్మకం. అమరావతి నేల నుంచే ప్రేమ, కరుణ, క్షమ అనే మానవతావాద విలువల్ని చాటిన బౌద్ధమతం విలసిల్లింది. శాతవాహనులు పాలించిన ఈ గడ్డపైనే తెలుగుజాతి ప్రతిభా ప్రాభవాలకు పునాది పడింది. కృష్ణమ్మ తల్లి గలగలలు ఈ ప్రాంతానికి జీవనవేదం. ఈ గడ్డ నూతన రాష్ట్ర పాలనకు కేంద్రం కావటం, ఈ బృహత్తర పరిణామానికి మన తరం భాగస్వాములు కావటం మన అందరి అదృష్టం. పాత, కొత్త తరాల మధ్య సంధికాలంలో మనం ఉన్నాం. వ్యాజ్యాలు కోకొల్లలుగా మీదపడినా, తీర్పులు ఆలస్యమైనా ప్రజలు న్యాయస్థానాలకే అగ్రతాంబూలమిస్తున్నారు. న్యాయవ్యవస్థపై సమాజానికున్న తిరుగులేని నమ్మకానికి ఇది నిదర్శనం. అందులోని చిన్న వ్యవస్థాగత సమస్యల్ని భూతద్దంలో చూపించి... ప్రతిష్ఠను దిగజార్చే ప్రయత్నాలను సమష్టిగా ఎదుర్కోవాలి. ఇదే స్ఫూర్తితో న్యాయమూర్తులు, న్యాయవాదులు కృషి చేస్తారని నమ్ముతున్నా. మానవ సంబంధాలు, రాజ్యాంగంలోని వివిధ వ్యవస్థల మధ్య అధికారం కోసం పెరిగిపోతున్న ఆరాటం.. ఇవన్నీ ముప్పేట దాడి చేయటంతో అప్పుడప్పుడు న్యాయవ్యవస్థ విమర్శలకు గురై, వేగం మందగిస్తోంది. ప్రజాస్వామ్య దేశంలో ఇది సహజమే. ఇలాంటి సందర్భాల్లో వ్యక్తుల భావోద్వేగాలు మొత్తం వ్యవస్థను ప్రభావితం చేయటం విచారకరం. ఈ సమస్యల్ని మనం దీటుగా ఎదుర్కొన్నాం. మనం ఇప్పుడు మార్పు వైపు ప్రయాణం చేస్తున్నాం.

– జస్టిస్ ఎన్.వి.రమణ, సుప్రీంకోర్టు న్యాయమూర్తి

హైకోర్టు ఉన్నతిపై దృష్టి సారించాలి



సదుపాయాల లేమి గురించి కాకుండా...భవిష్యత్తులో హైకోర్టు ఎంత ఉన్నతంగా ఉండాలనే దానిపై న్యాయసమాజం దృష్టిసారించాలి. వివాదాల పరిష్కారం కోసం న్యాయస్థానాలున్నాయి. తమను ఆశ్రయించే సామాన్యుడికి న్యాయం చేయాలి. రాజ్యాంగ పరమైన హక్కులను కాపాడాలి. న్యాయ నిబంధన(రూల్ ఆఫ్ లా)ను రక్షించాలి. న్యాయసమాజం రాజ్యాంగ విలువలు కాపాడేందుకు అంకితం కావాలి. ప్రజాసంక్షేమం కోసం పనిచేయాలి. న్యాయం అందించటంలో జాప్యం చేసి ప్రజల హక్కులు హరించటం సరికాదంటూ కింగ్‌జాన్ చేసిన వ్యాఖ్యలను గుర్తించుకోవాలి. ప్రస్తుతం ప్రారంభించిన జ్యుడిషియల్ కాంప్లెక్స్ భవనం వసతులు రాబోయే పది, పదిహేనేళ్ల వరకూ సరిపోయేలా ఉన్నాయి.

– జస్టిస్ లావు నాగేశ్వరరావు, సుప్రీం న్యాయమూర్తి

వారికిక పోలీసు ధ్రువీకరణ తప్పనిసరి

- చిన్నారులుండే కేంద్రాల్లో పని చేసే ఉద్యోగులపై నజర్
- పిల్లల రక్షణకు వాళ్లు హామీపత్రమూ ఇవ్వాలి
- కేంద్ర స్త్రీ, శిశు సంక్షేమశాఖ కొత్త భద్రత, ప్రవర్తనా నియమావళి
- నూతన విధానంపై రాష్ట్రాల అభిప్రాయ సేకరణ

ఈనాడు – హైదరాబాద్

ఎక్కడైతే చిన్నారులు ఉంటారో.. ఆయా సంస్థల్లో పని చేసే ఉద్యోగులకు ఇక పోలీసుల 'క్లీన్‌చిట్' అవసరం. పాఠశాలలు, వసతిగృహాలు, అనాథాశ్రమాలు, సంరక్షణ గృహాలు, ఆస్పత్రులు, కేర్ సెంటర్లు.. ఇలా పిల్లల సంరక్షణతో ముడిపడి ఉండే సంస్థలు, కేంద్రాల్లో పనిచేసే ఉద్యోగుల పూర్వచరిత్రను తెలుసుకోవాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. సదరు వ్యక్తులపై ఎలాంటి కేసులూ లేవని పోలీసుల ద్వారా నిర్ధరించుకోవాలని, ఇకపై రెగ్యులర్, ఒప్పంద కొలువుల్లో చేర్చుకునేవారికీ ఈ నిర్ధరణ తప్పనిసరి అని సూచించింది. పిల్లల హక్కులు కాపాడతామని, వారికి భద్రత కల్పిస్తామని సదరు ఉద్యోగుల నుంచి హామీ పత్రాన్ని తీసుకోవాలని తెలిపింది.

చిన్నారుల భద్రత కోసం వివిధ సంస్థలు, కేంద్రాలు, కార్పొరేటు, ప్రైవేటు రంగాలకు ప్రత్యేక నిబంధనలతో కేంద్ర మహిళా శిశు సంక్షేమశాఖ నూతన భద్రత, ప్రవర్తనా నియమావళిని రూపొందించింది. దీనిపై అభిప్రాయ సేకరణకు ఇటీవల ఆయా రాష్ట్రాలకు ఇటీవల పంపించింది. తెలంగాణ రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖకూ ఈ నియమావళి అందింది. రెగ్యులర్, ఒప్పంద ప్రాతిపదికన పనిచేసే వారందికీ ఈ నిబంధనలను వర్తింపజేయాలని కేంద్రం సూచించింది. సంబంధిత యాజమాన్యాలు చిన్నారుల స్నేహపూర్వక జోన్లు ఏర్పాటు చేయాలని వివరించింది. ఆపదలోని చిన్నారులకు వైద్యం అందించేందుకు నిరాకరించిన ఆసుపత్రులు, వైద్యులు, ఆరోగ్య కార్యకర్తలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. కొత్త విధానంపై అవసరమైన సూచనలు, సలహాలు తెలియజేయాలని రాష్ట్రాలను కోరింది. దేశంలోని చిన్నారులకు రక్షణ కల్పించి, ప్రశాంత వాతావరణంలో జీవించేందుకు వీలుగా నూతన విధానం రూపొందించామని పేర్కొంది.

నియమావళిలోని నిబంధనలివీ..

- ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేటు సంస్థలు వేధింపులు, వివక్షలకు తావు లేకుండా చిన్నారులకు స్నేహపూర్వకమైన కేంద్రాలుగా ఉండాలి. చిన్నారుల భద్రత, ప్రవర్తనా నియమావళి మేరకు నడుచుకోవాలి.
- ఉద్యోగులు, ఒప్పంద కార్మికులు చిన్నారుల పట్ల రంగు, జాతి, లింగవివక్ష, భాషాభేదాలు లేకుండా అందరినీ సమానంగా చూడాలి. చిన్నారులు చేప్పే విషయాలు తప్పనిసరిగా వినాలి.
- పిల్లలపై కోపం ప్రదర్శించడం, అవమానించడం, లైంగికంగా, భౌతికంగా వేధించడం వంటి సంఘటనలు చోటు చేసుకుంటే చిన్నారుల రక్షణ చట్టాల కింద కఠిన శిక్షలు ఉంటాయి.
- పిల్లల భద్రత కోసం విద్యాసంస్థలు, సంస్థలు ఒక ప్రత్యేక అధికారిని నియమించాలి. ప్రతిచోట పిల్లల సహాయ కేంద్రం నంబరు 1098 అందరికీ కనబడేలా సూచికను ఏర్పాటు చేయాలి. ఫిర్యాదు చేసిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచాలి.
- చిన్నారులకు సేవలందించే ప్రొఫెషనల్ సర్వీస్ ఏజెన్సీలు, సర్వే నిర్వహించే సంస్థలు కూడా నియమావళిని పాటించాలి.

నేపాల్, భూటాన్.. భారత్‌లో భాగమే అనుకున్న ట్రంప్

వాషింగ్టన్: నేపాల్, భూటాన్ దేశాలు భారత్‌లో భాగమేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భావించేవారట. అమెరికా నిఘావర్గాలకు చెందిన ఇద్దరు అధికారులు ఈ విషయాన్ని వెల్లడించినట్లు 'టైమ్' మ్యాగజైన్ శనివారం ఓ కథనాన్ని ప్రచురించింది. ప్రపంచవ్యాప్తంగా పలు వర్తమాన అంశాలపై అధ్యక్షుడికి అవగాహన కల్పించడానికిగాను నిఘావర్గాలు ఎప్పటికప్పుడు ప్రయత్నిస్తుంటాయి. ఇందులో భాగంగా చర్చిస్తున్నప్పుడు ఓసారి దక్షిణాసియా మ్యాప్‌ను చూస్తూ భారత్‌లో నేపాల్ భాగమే కదా? అని ట్రంప్ ప్రశ్నించారట. కాదని, అది స్వతంత్ర దేశమని నిఘా అధికారులు బదులిచ్చారు. అయితే భూటాన్ కూడా భారత్‌లో భాగమే కదా! అని ట్రంప్ మళ్లీ తన అజ్ఞానాన్ని బయటపెట్టారట. అది మరో దేశమని నిఘా అధికారులు బదులిచ్చారు.

గాంధీ బొమ్మను కాల్చినవారికి వ్యతిరేకంగా నేడు కాంగ్రెస్ నిరసనలు

దిల్లీ: గాంధీ వర్ధంతి రోజున మహాత్ముడి బొమ్మను తుపాకీతో కాల్చి అవమానకరంగా వ్యవహరించినవారికి వ్యతిరేకంగా కాంగ్రెస్ దేశవ్యాప్త నిరసనలు చేపట్టేందుకు సిద్ధమైంది. అన్ని రాష్ట్రాల్లోని తమ పార్టీ ప్రధాన కార్యాలయాలు, గాంధీ జీవితంతో ముడిపడి ఉన్న ప్రాంతాలు, జాతిపిత విగ్రహాల వద్ద సోమవారం ఉదయం 10 గంటలకు నిరసన ప్రదర్శనలు చేపట్టనుంది.

ఈనాడు
varevva@eenadu.in
వారెవ్వా!
కరీంనగర్, సోమవారం ఫిబ్రవరి 4, 2019



వదిలితే జరిమానా తింటే నజరానా

విస్తరిలో ఒక్క మెతుకు మిగిలినా యాభై రూపాయలు జరిమానా కట్టాలి. ఎక్కడండి బాబు... అదేమైనా అన్నదాన సత్రమా? కాదు. అదో హోటల్. డబ్బులిచ్చి కొనుక్కుంటాం కదా.. మనిష్టం..! అలా అంటే కుదరదు మరి! దాని యజమాని ముక్కుపిండి జరిమానా వసూలు చేస్తారు. ఆయన ఎందుకలా చేస్తున్నాడు? వినియోగదారులు కడుతున్నారా? ఆగండి...ఆగండి.. జవాబులన్నీ చదవండి.





"ఇద్దరు వృథా చేసే భోజనం ఒకరి ఆకలి తీరుస్తుంది."

"అన్నం పరబ్రహ్మ స్వరూపం. వృథా చేయకండి."

... అనే సూక్తులు వరంగల్ నగరం హన్మకొండ అదాలత్ కూడలిలోని 'లింగాల కేదారి ఫుడ్‌కోర్టు'లో కనిపిస్తాయి. వీటిని అతిక్రమిస్తే జరిమానా కట్టకుండా బయటికి వదలరు దాని యజమాని లింగాల కేదారి. ఒకవేళ డబ్బుల్లేక పోతే...తన జేబు నుంచి ఇచ్చి తరువాత వసూలు చేస్తారు.

ఎందుకిదంతా? అంటే... అన్నం వృథా చేయకూడదనే స్పృహ అందరిలో కలగాలనే తన తపనంటాడు కేదారి. ఆ.. ఒక ముద్ద వదిలేస్తే ఏమవుతుందిలే అనుకుంటే మాత్రం ఆయన ఊరుకోరు. కానీ జరిమానా కట్టిన వారంతా కేదారిని మెచ్చుకుని వెళుతుంటారు.

రెండేళ్ల క్రితం...

లింగాల కేదారి ఫుడ్ కోర్టు మధ్యాహ్నం అయ్యిందంటే కిటకిటలాడుతుంది. వందలాది మంది కడుపునిండా భోంచేస్తారు. కానీ తిన్న తర్వాత విస్తరాకులు కడిగినట్టే ఉంటాయి. ఈ హోటల్‌లో భోజనం రూ. 50. అన్నం, పప్పు, చట్నీ, మరో అయిదారు రకాల కూరలు, చికెన్ కర్రీ, చేప కూర, పులిహోర, పెరుగన్నం, స్వీటు... ఇదీ రోజూ హోటల్ మెనూ. పదార్థాలన్నీ ఎంతో రుచిగా, శుచిగా ఉంటాయి. హోటల్‌కు వచ్చే వారు రూ. 60 చెల్లించి టోకెన్ తీసుకోవాలి. విస్తరాకుల్లో మాత్రం ఏ ఒక్క పదార్థం కూడా మిగలకూడదు. అలా ఆహారం వృథా చేయని వారికి యజమాని లింగాల కేదారి తిరిగి రూ.10 ఇచ్చేస్తారు. వదిలితే మాత్రం రూ.50 జరిమానా కట్టాలి

ఇలా ఎందుకంటే..


1986లో కేదారి తినడానికి తిండి కూడా దొరకని పేదరికం అనుభవించారట. ఒక రోజు రాత్రి అన్నం లేక కడుపులో కాళ్లు పెట్టుకుని పడుకున్నారట. మర్నాడు ఉదయం నకనకలాడే ఆకలితో నడుచుకుంటూ వస్తుంటే ఒక హోటల్ వాళ్లు అన్నం, సాంబారును పారేస్తుంటే కేదారి తీవ్రంగా బాధపడ్డారట. తర్వాత హోటల్ వ్యాపారంలోకి వచ్చి క్రమంగా ఎదిగారు. ఇక నుంచి ఆహారం వృథా చేయకూడదని, రెండేళ్ల క్రితం ఈ ప్రచారం మొదలు పెట్టాడు. ప్రస్తుతం ఈ హోటల్‌లో రోజుకు కనీసం 400 మంది వరకు భోంచేస్తున్నారు. రోజుకు రూ. 3000 వరకు కేదారి చేతి నుంచే ఖర్చు చేస్తున్నారట తనకున్న క్యాటరింగ్ వ్యాపారంలో వచ్చిన లాభాలతో హోటల్ నడిపిస్తున్నాడు. కేదారి భార్య, ఇద్దరు కొడుకులు, కోడలు అంతా హోటల్‌లోనే పనిచేస్తున్నారు. ఈ హోటల్ గత రెండేళ్లుగా ఈ నిబంధనతో నడుస్తోంది. మొదట్లో రోజుకు ఒకరిద్దరు ఆహార పదార్థాలు వదిలేసి జరిమానా కట్టేవారట. తర్వాత క్రమశిక్షణగా ఒక్క మెతుకు వదలకుండా తినేస్తున్నారు. పైగా జరిమానా రూపంలో ఇప్పటికి రూ. 12 వేలు వసూలైతే వాటిని కేదారి అనాథాశ్రమానికి ఇచ్చేశారు.

– *జి.పాండురంగశర్మ*, ఈనాడు, వరంగల్

అధికారులు సైతం కట్టారు

లింగాల కేదారి ఎప్పుడూ హోటల్‌లో ఒక మైకు పెట్టుకుని అన్నం పారేయకూడదని చెబుతుంటారు. ఒకసారి ఒక న్యాయమూర్తికి సైతం జరిమానా వేశారట కేదారి. అప్పుడాయన ఈ నిబంధనను శెభాష్ అని మెచ్చుకొని వెళ్లారు. ఇప్పటి వరకు ఈ హోటల్‌కు వచ్చిన ఎంతో మంది పోలీసులు సైతం ఫైన్‌లు కట్టిన సందర్భాలు ఉన్నాయి. ఇక్కడ భోం చేసే వందలాది మంది కూడా తమ ఇళ్లలో వృథా అరికడతామని చెప్పి వెళుతున్నారట. వంట శుచిగా రుచిగా లేకపోయినా కేదారి తిన్నవారికే ఫైన్ కడతానని చెబుతున్నారు. ఎవరైనా తాగి వచ్చినా ఇక్కడ భోజనం పెట్టరు. కేదారిని అవహేళన చేసినట్టు మాట్లాడినా టోకెన్ ఇవ్వరు. హోటల్‌కు వచ్చేవారు కస్టమర్లు కాదని, నా బంధువులని చెబుతారు కేదారి. అందుకే అంతా ఆనందంగా తింటారు. మెతుకు లేకుండా శుభ్రంగా విస్తరాకులు డస్ట్‌బిన్‌లో వేస్తారు. ఎముకలు, కరివేపాకు, ఎండు మిర్చీ మాత్రం విస్తరిలో వదిలేయొచ్చు. ఇప్పుడు రోజుకొక్కరు కూడా ఫైన్ కట్టట్లేదని, మార్పునకు ఇదే సంకేతమని కేదారి చెబుతున్నారు.

ఘంటసాల వెంకటేశ్వరరావు, నేదునూరి కృష్ణమూర్తి, సాలూరు రాజేశ్వరరావు, పి.సుశీల... సంగీత సరస్వతి ముద్దు బిడ్డలు వీరంతా... చలనచిత్ర రంగంలోనే కాదు, ప్రతి తెలుగువారి గుండెల్లో వారి స్థానం చిరస్మరణీయం.... వీరే కాదు, ఇంకా ఎందరెందరో అద్భుత కళాకారులు తయారైన సంగీత కోవెల విజయనగరం సంగీత కళాశాల. అసలా స్వరాల తోట ఏర్పడిన తీరే ఆసక్తికరం. ఓ అంధుడికి సంగీతం నేర్పడం కోసం ఏర్పాటైన ఈ సుస్వరాల తోట తర్వాత ఎన్నో గాన కోకిలను అందించింది...



అంధుడి కోసం... సుస్వరాలు పూచాయి

వందేళ్ల నాటి సంగతి... పూసపాటి విజయరామగజపతి... విజయనగరం రాజావారు... వారి ఆస్థానంలో చాగంటి జోగారావుపంతులు అనే ఆంతరంగిక కార్యదర్శి ఉండేవారు. అంతకు మించి రాజుగారికి చాలా ఆత్మీయుడు. ఆయన కుమారుడు చాగంటి గంగబాబు అంధుడు. నిరంతరం అతనికి ఉన్న లోపంతో కుమిలిపోతున్న పంతులుగారి ఆవేదన రాజుగారి దాకా వచ్చింది. అతనికి కళ్లు తెప్పించలేమా అన్న ఆలోచన ఆదిలోనే ఆగిపోయింది. అతనికి కళ్లు రావడం సాధ్యంకాదని వైద్యులు తేల్చి చెప్పేశారు. మరి ఆత్మీయుడి ఆవేదనను తగ్గించేదెలా?

ఆ కుర్రాడి భవిష్యత్తు బాగుండేలా ఏం చేస్తే మంచిదో చెప్పమంటూ తన ఆస్థాన వైద్యుడు సీతారామయ్యని అడిగారు. చూపు లేదు కనుక అతడికి సంగీతం నేర్పిస్తే మంచిదని చెప్పారు సీతారామయ్య.

అప్పటికే తమ పూర్వీకులు మహారాజ ఆంగ్ల పాఠశాల, మహారాజ డిగ్రీ కళాశాల, మహారాజ సంస్కృత కళాశాల ప్రారంభించారు... వాటికి కొనసాగింపుగా సంగీత కళాశాల నెలకొల్పితే..?

రాజుగారికి వచ్చిన ఈ ఆలోచన తెలుగు జాతికి వరమైంది. సుస్వరాల తోటకు బీజం పడింది.

వెంటనే విజయనగరం కోట వెనుక భాగాన ఉన్న టౌన్ హాల్ భవనంలో 1919 ఫిబ్రవరి 5వ తేదీన 'విజయరామ గాన పాఠశాల' ప్రారంభించారు. కాలక్రమంలో అదే మహారాజ సంగీత, నృత్య కళాశాలగా రూపాంతరం చెందింది. అలా మొదలైన విజయనగరం సంగీత కళాశాల ప్రస్థానం దేదీప్యమానంగా వెలుగొందుతూ సంగీతాభిమానుల్ని రంజింపజేస్తూ వందేళ్లకు చేరువై దేశ చరిత్రలో కలికితురాయిగా నిలబడింది. ఒక అంధుడి కోసం ప్రారంభమై ఎందరికో దారి చూపించిన ఏకైక కళాశాలగా విజయనగరం సంగీత కళాశాల ప్రసిద్ధికెక్కింది. రాజావారి కోరిక మేరకు భవిష్యత్తులో ఆ అంధుడు అద్భుతమైన వయోలిన్ విద్వాంసుడిగా పేరు తెచ్చుకున్నారు. అతడికి సంగీత శిక్షణనిచ్చేందుకు మహారాజావారే జర్మనీ నుంచి వయోలిన్‌ని తెప్పించి ఇచ్చారని చెబుతారు. తర్వాత కళాశాల కర్ణాటక సంగీతానికి కలికితురాయిగా మారింది. అది మరింతగా విస్తరించి భారతదేశ సంగీత సంప్రదాయాలకు ఊపిరిలూదింది. తన నీడన చేరిన సామాన్యులకు సైతం సరిగమల్ని నేర్పించి మహా విద్వాంసులుగా తీర్చిదిద్దింది.

- **జి.వి.వి.సత్యనారాయణరెడ్డి,** విజయనగరం

ఎందరెందరో...

హరికథా పితామహుడిగా విఖ్యాతిపొందిన అజ్జాడ ఆదిభట్ల నారాయణదాసుని సంగీత పాఠశాలకు తొలి ప్రధానాచార్యుడిగా నియమించారు. ప్రఖ్యాత వయోలిన్ విద్వాంసులు ద్వారం వెంకటస్వామినాయుడు ఇక్కడ అధ్యాపకులుగా పనిచేశారు. భువనేశ్వర్ మిశ్రా, నేదునూరి కృష్ణమూర్తి, నూకల చినసత్యనారాయణ, చాగంటి గంగబాబు, ద్వారం సత్యనారాయణరావు, ద్వారం మంగతాయారు, ఎవటూరి విజయేశ్వరరావు, ఘంటశాల వెంకటేశ్వరరావు, మంచాల జగన్నాథరావు, సాలూరు రాజేశ్వరరావు, పి.సుశీల తదితరులంతా ఈ సంగీత సరస్వతి ముద్దుబిడ్డలే. దాదాపు 7,000 మందికి పైగా పూర్వ విద్యార్థులున్నారు..



గమనిక: 03.02.2019(ఆదివారం) హాయ్ పేజీలో 'వందమందినైనా చంపాలనుకున్నా' అనే శీర్షికతో ప్రచురితమైన శాంతా బయోటెక్ వరప్రసాద్ రెడ్డి ఇంటర్వ్యూలో ఆయన లంచాలు ఇచ్చినట్లు ప్రచురితమైంది. వాస్తవానికి అప్పట్లో లంచాలు ఇస్తేనే పనిచేసే వ్యవస్థ ఉండేదని, దానిపై పోరాటం చేశానని ఆయన చెప్పారు. పాఠకులు గమనించగలరు.



వారి చేతులు అద్భుతమే చేశాయి!

సాధారణంగా పిల్లల దగ్గర డబ్బులుంటే ఏం చేస్తారు... ఏదో ఒకటి కొంటారు... మహా అయితే దాచుకుంటారు...

కానీ ఆ స్కూలు పిల్లల పొదుపు ఫలాలనిస్తోంది...

ప్రతి రూపాయీ సేవగా మారుతోంది.

ఓ రెండు స్వచ్ఛంద సంస్థలకు, కొన్ని వందల మంది అనాథలకు, పేదలకు ఆధారమవుతోంది.

అలా ఇప్పటి వరకు వారు వెచ్చించిన మొత్తం రూ. కోటి పైనే...

చినుకు చినుకూ కలిసి వాగులవుతాయి. వంకలుగా మారతాయి. చివరకు నదులుగా ప్రవహిస్తాయి... జగమెరిగిన ఈ సత్యాన్ని హైదరాబాద్ బాచుపల్లిలోని సిల్వర్ ఓక్స్ అంతర్జాతీయ పాఠశాల విద్యార్థులు చాటి చెబుతున్నారు. పైసా పైసాగా వారు పొదుపు చేసిన డబ్బు ఏకంగా రెండు స్వచ్ఛంద సంస్థల మనుగడకు కారణమవుతోంది. పద్నాలుగేళ్లుగా సాగుతున్న ఈ మహోన్నత కార్యక్రమం అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. ఈ పాఠశాలలో విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందించాలనే లక్ష్యంతో ఏటా 'కాయిన్స్ ఫర్ ది కంట్రీ' పేరుతో కార్యక్రమాన్ని చేపడతారు. ఇందుకు పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా ఓ యజ్ఞమే నిర్వహిస్తోంది. విద్యాసంవత్సరం ఆరంభంలోనే అంటే జూన్ నెలలోనే పాఠశాల ఆవరణలో ప్రత్యేకంగా గల్లాగురిగీలు (కిడ్డీ బ్యాంకులు) మట్టితో తయారు చేయించి పాఠశాలలోని ప్రతి విద్యార్థికి అందజేస్తారు. తాము పొదుపు చేసిన కిడ్డీ బ్యాంకును డబ్బులతో సహా జనవరి 26న జరిగే గణతంత్ర వేడుకల రోజున పాఠశాలలో అప్పగించాల్సి ఉంటుంది. అలా వచ్చిన నగదును ఆహూతుల సమక్షంలో పాఠశాల నిర్వాహకులు వరంగల్ జిల్లా కళ్లెడలోని రూరల్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ (ఆర్‌డీఎఫ్), గుంటూరు జిల్లా నాదెండ్ల మండలం కనపర్తి పంచాయతీ పరిధి మ్యానంపాడులోని 'నీడి ఇల్లిటరేట్ ఎడ్యుకేషన్ (నైస్)' సంస్థలకు విరాళంగా అందజేస్తుంటారు. ఇప్పటివరకు విద్యార్థులు జమచేసిన మొత్తం ఎంతైందో తెలిస్తే ముక్కున వేలేసుకోవాల్సిందే మరి. 2005 నుంచి కొనసాగుతున్న ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు రూ.1.25 కోట్లకు పైనే జమ చేశారు. ఆర్‌డీఎఫ్ సంస్థకు ఏటా ఇచ్చిన మొత్తం రూ.1,00,74,747లు కాగా నైస్ సంస్థకు రూ.23,24,656 అందజేశారు. ఇందులో ఆర్‌డీఎఫ్ సంస్థలో 2 వేల మంది విద్యార్థులు ఉండగా.. నైస్ సంస్థలో 300 మంది అనాథ పిల్లలున్నారు. అంటే ఈ రెండు సంస్థల మనుగడ దాదాపుగా సిల్వర్ ఓక్స్ విద్యార్థులు చేసే సాయంపైనే ఆధారపడి ఉందన్నమాట.

సరదాలకు స్వస్తి పలుకుతూ.. : విద్యాసంవత్సరం ఆరంభంలోనే పాఠశాల నిర్వాహకులు తమ పాఠశాలలోని 3 వేల మందికి గల్లాగురిగీలను అందజేస్తారు. అందులో నగదును జమచేయడానికి విద్యార్థులు ఎవరినీ అడగకూడదనేది నిబంధన. ఇంట్లో తల్లిదండ్రులకు పనుల్లో సాయం చేయడం ద్వారా వారు ఇచ్చే పారితోషికాలు, పుట్టిన రోజు సరదాలు వంటి వేడుకలు చేసుకోకుండా డబ్బును జమ చేస్తుంటారు. కొంతమంది విద్యార్థులయితే తాము తయారు చేసిన ఆహార పదార్థాలను పాఠశాల ఆవరణలో అమ్మి ఆ నగదును పొదుపు చేస్తుంటారు. ఒక్కో విద్యార్థి తమ పరిస్థితులను బట్టి రూ.150 నుంచి రూ.10 వేల దాకా అప్పగిస్తుంటారు. పాఠశాలను విడిచి వివిధ వృత్తుల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు సైతం ఈ మహాయజ్ఞంలో తమకు తోచినంతా అందజేస్తుంటారు. అలా పొదుపు చేసిన మొత్తాన్ని గల్లాగురిగీతో సహా జనవరి 26వ తేదీన పాఠశాలకు అప్పగించాలి. ఈ కార్యక్రమంలో పాఠశాలలోని 400 మంది బోధన, బోధనేతం సిబ్బంది విద్యార్థులకు బాసటగా ఉంటారు.

– *ముత్యాల నర్సింహులు*, హైదరాబాద్



2002లో నేను వరంగల్‌కు వెళ్లినపుడు పేద విద్యార్థుల కోసం ఆర్‌డీఎఫ్ చేస్తున్న సేవలకు చాలా సంతోషపడ్డాను. అప్పటికప్పుడు రూ. 10 వేల నా సొంత డబ్బును వారికి విరాళంగా అందజేశాను. నేను ఇచ్చిన డబ్బులతో అప్పట్లో సంస్థ నిర్వాహకులు ఓ తరగతిగది మొత్తానికి ఫర్నీచర్ అమర్చారు. ఇదే స్ఫూర్తిని విద్యార్థుల్లో నింపి వారి ద్వారా ఇటువంటి సంస్థలకు సాయం చేయాలనే సంకల్పం నానాటికీ నాలో పెరుగుతూ వచ్చింది. అయితే దాన్ని కార్యరూపంలోకి తేవడానికి మాత్రం నాకు మూడేళ్లు పట్టింది. 2005 నుంచి వరుసగా ప్రతీయేటా 'కాయిన్స్ ఫర్ ది కంట్రీ' కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వస్తున్నాం.

- **ధనుంజయ,** పాఠశాల డైరెక్టర్



ఈ ఆలయంలో సొరకాయ మొక్కులు!

మామూలుగా మొక్కులంటే డబ్బు, బంగారం లేదా కొబ్బరికాయలో, పళ్లో... కానీ ఓ ఆలయంలో మాత్రం సొరకాయలు మొక్కుబడిగా సమర్పిస్తారు. ఈ ఆలయం చిత్తూరు జిల్లా నారాయణవనంలో ఉంది.

ఎక్కడి నుంచి వచ్చాడో తెలీదు.. ఆయన దగ్గర ఉండే విద్యలేంటో తెలీదు...

శ్రీవారి దర్శనార్థం ఈ ప్రాంతానికి వచ్చి చిత్తూరు జిల్లా నారాయణవనం మండలంలో తిరుగుతూ తన భుజాన ఉన్న సొరకాయ నుంచి ఔషధాలు అందిస్తూ ఇక్కడ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడిన ఆయనను జీవ సమాధి అనంతరం



సొరకాయల స్వామిగా పూజిస్తున్నారు. చెన్నై, పుత్తూరు, కార్వేటినగరం, పచ్చికాపళ్లం ప్రాంతాల్లో తిరుగుతుండే ఆయన 200 ఏళ్లు పైగా జీవించినట్లు చెబుతారు. ఈ తాత గ్రామాలన్నీ తిరుగుతూ తన భుజానున్న సొరకాయ నుంచి ఔషధాలను తీసి రోగుల వ్యాధులు నయం చేసేవారని చెబుతారు. ఆయన జీవ



సమాధి అనంతరం ఆలయానికి వచ్చే భక్తులు కూడా ఆలయంలో సొరకాయలు మొక్కుగా సమర్పించుకోవడం ఆనవాయితీ. కోర్కెలు నెరవేరిన వారు, కోర్కెలు కోరుకున్నవారు సొరకాయలు ఆలయ ప్రాంగణంలో భక్తితో కడుతుంటారు. ప్రతి పౌర్ణమి, అమవాస్య రోజుల్లో తమిళనాడు రాష్ట్రం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు.

చిత్ర కథనం: **ఎన్.హరిగంగాధర్,** తిరుపతి

ఈనాడు సినిమా


రామ్‌చరణ్


ఆలియాభట్

చరణ్ చెలియ ఆలియా?

బాలీవుడ్ నుంచి కథానాయికల దిగుమతి కొనసాగుతూనే ఉంది. విద్యాబాలన్, కియారా అడ్వాణీ లాంటి భామలు తెలుగులోనూ హవా చూపిస్తున్నారు. ఇప్పుడు ఆలియాభట్ కూడా తెలుగులో అరంగేట్రం చేయడానికి సిద్ధంగా ఉన్నట్టు తెలుస్తోంది. ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో ఎన్టీఆర్, రామ్‌చరణ్ కథానాయకులుగా ఓ చిత్రం రూపుదిద్దుకుంటోంది. ఇందులో ముగ్గురు కథానాయికలుంటారు. వాళ్లెవరో చిత్రబృందం అధికారికంగా ప్రకటించలేదు. కానీ పలువురు నాయికల పేర్లు ప్రచారంలో ఉన్నాయి. అందులో ఆలియాభట్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. రామ్‌చరణ్ సరసన ఆలియా కనిపించనుందని సమాచారం. ఎన్టీఆర్‌తో నటించే నాయికని ఎంపిక చేయాల్సి ఉంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఎన్టీఆర్, చరణ్‌లపై కీలక సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు. డి.వి.వి దానయ్య నిర్మిస్తున్న ఈ చిత్రానికి కీరవాణి సంగీతం అందిస్తున్నారు.

సంగీత ప్రపంచాన ఇళయరాజా ఓ స్వయంభూలింగం - రజనీకాంత్

ఇళయరాజా సంగీతప్రపంచానికి దక్కిన స్వయంభూలింగం అని సూపర్‌స్టార్ రజనీకాంత్ కీర్తించారు. తమిళ చలనచిత్ర నిర్మాతల మండలి ఆధ్వర్యంలో ఇళయరాజా పుట్టినరోజు వేడుకలు 'ఇళయరాజా 75' పేరిట చెన్నైలో ఘనంగా జరిగాయి. ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో రజనీకాంత్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నటులు మోహన్‌బాబు, వెంకటేశ్, విజయ్‌సేతుపతి, దర్శకుడు మణిరత్నం-సుహాసిని దంపతులు, కమల్‌హాసన్, శ్రుతిహాసన్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇళయరాజా హిట్ పాటలను మనో, విజయ్ ఏసుదాస్, చిత్ర తదితరులు ఆలపించారు. కార్యక్రమంలో భాగంగా రజనీకాంత్ మాట్లాడుతూ "మనం పూజించే లింగాలు మూడు రకాలుగా లభ్యమవుతాయి. అందులో అత్యంత శక్తిమంతమైనది స్వయంభూలింగం. ఇళయరాజా అలాంటి వ్యక్తే. 1973లో ఆయన స్వరాలు అందించిన 'అన్నకిళి' చిత్రంతోనే ఇళయరాజా సంగీత ప్రియుల్ని ఆకర్షించారు, అలాంటి ఆకర్షణ ఒక్క స్వయంభూలింగానికి మాత్రమే ఉంటుంది. ప్రపంచంలోనే గొప్ప సంగీతజ్ఞాని ఇళయరాజా. నా చిత్రాలకు ఎన్నో హిట్ పాటలను అందించారు. ఆయన చాలామంది దర్శకులకు పారితోషికం కూడా తీసుకోకుండా పనిచేసిన చేశారు. ఇళయరాజా స్వరపరచిన పాటల్లో 60శాతం పాటలకు ఆయనే పల్లవి రాశారనడంలో ఏమాత్రం సందేహం లేదు"అని చెప్పారు. ఇళయరాజా తన చిత్రాలు కన్నా కమల్‌హాసన్ చిత్రాలకే అద్భుతమైన పాటలు ఇచ్చారని చమత్కరించారు రజనీ. ఇళయరాజా వెంటనే మైక్ అందుకుని 'స్వామీ.. (రజనీకాంత్) నువ్వేమో అలా అంటావు, కమల్‌హాసనేమో రజనీకాంత్‌కు మంచి పాటలు ఇచ్చానని చెబుతారు. నేను మీ చిత్రాలకు సంగీతం అందించానంతే. నాకు అందరూ ఒకటే. నటుడు రామరాజ్‌కు హిట్ పాటలు ఇవ్వలేదా?' అంటూ తనదైన శైలిలో సమాధానం ఇచ్చారు. కమల్‌హాసన్ మాట్లాడుతూ "ఇళయరాజా నాకు అన్న మాత్రమే కాదు గురువు. మాది 45 ఏళ్ల ప్రేమానుబంధం. నేను రాజకీయాల్లోకి రావడానికి సలహాలు ఇచ్చిన తొలి వ్యక్తి ఇళయరాజా"అని చెప్పారు. మోహన్‌బాబు మాట్లాడుతూ "ఇళయరాజా ఓ గ్రంథం. దేశానికి ఢిల్లీ రాజధాని అయితే సినీ సంగీతానికి 'పన్నయపురం' రాజధాని. అదే ఇళయరాజా స్వస్థలం. సినిమాకు ఆయన అందించిన సేవలు అనితర సాధ్యం"అన్నారు. వెంకటేష్ మాట్లాడుతూ "నేను నటించిన ప్రేమ, చంటి, బొబ్బిలిరాజా చిత్రాలకు గొప్ప సంగీతం అందించారు ఇళయరాజా" అన్నారు. అనంతరం వెంకటేష్ తన బొబ్బిలి రాజా చిత్రంలోని 'బలపం పట్టీ భామ ఒళ్లో' అంటూ పాటని సరదాగా ఆలపించారు. కమల్‌హాసన్ 'పోతురాజు' లోని ఓ పాట పాడారు.


కమల్‌హాసన్, రజనీకాంత్, ఇళయరాజా, మోహన్‌బాబు

– న్యూస్‌టుడే, కోడంబాక్కం

నన్ను యాంగ్రీ స్టార్‌గా మార్చేశారు - రాజశేఖర్

"లోకంలో పని దొరకడమే అన్నింటికంటే సంతోషకరమైన విషయం. పుట్టినరోజున కూడా నేను చిత్రీకరణలో పాల్గొంటున్నా" అన్నారు రాజశేఖర్. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'కల్కి'. ఆదాశర్మ, నందిత శ్వేత, స్కార్లెట్ కథానాయికలు. ప్రశాంత్ వర్మ దర్శకుడు. సి. కల్యాణ్ నిర్మాత. శివానీ, శివాత్మిక సమర్పిస్తున్నారు. సోమవారం రాజశేఖర్ పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో 'కల్కి' టీజర్‌ని విడుదల చేశారు. ఇదే వేడుకలోనే చిత్రబృందం రాజశేఖర్ పుట్టినరోజు పండగని నిర్వహించింది. దర్శకుడు మాట్లాడుతూ "1980 నేపథ్యంలో సాగే కథ కావడంతో ప్రతి విషయాన్ని ఎంతో స్పష్టంగా ఉండేలా తెరకెక్కిస్తున్నాం. రాజశేఖర్‌కి పుట్టినరోజు కానుకగా యాంగ్రీ స్టార్ అనే పేరును ఇచ్చాం. 'కల్కి'కి కొనసాగింపుగా 'కల్కి 2' కూడా ఉంటుంద"న్నారు. జీవిత మాట్లాడుతూ "మళ్లీ విజయాన్ని సాధిస్తామా లేదా? అనుకున్న రోజులు మా జీవితంలో ఉన్నాయి. అటువంటి సమయంలో 'గరుడవేగ'తో ప్రవీణ్ సత్తారు మేజిక్ చేశారు. ప్రశాంత్ కథ సిద్ధం చేశాక దర్శకత్వం చేయడానికి ఒప్పుకోవడంతో తొలి విజయంగా భావించా. అప్పుడే కల్యాణ్ అన్నయ్య ఫోన్ చేసి, నేను సినిమా చేస్తానని ముందుకు రావడం సంతోషంగా అనిపించింద"న్నారు. నిర్మాత మాట్లాడుతూ "లైట్లు కొనడానికి నా దగ్గర డబ్బులు లేని సమయంలో, రాజశేఖర్ దంపతులు ఓ తమిళ సినిమా రీమేక్ హక్కులు కొని నన్ను నిర్మాతని చేశార"న్నారు. రాజశేఖర్ మాట్లాడుతూ "ఇంతకుముందు నన్ను యాంగ్రీ యంగ్‌మేన్ అనేవారు. వయసు పెరిగాక ఆ పేరు ఎలా మారుతుందో అనుకొనేవాణ్ని. ఈ చిత్రంతో ప్రశాంత్ నన్ను యాంగ్రీ స్టార్‌గా మార్చేశార"న్నారు. ఈ కార్యక్రమంలో శివానీ, శివాత్మికతో పాటు దాశరథి శివేంద్ర, నాగేంద్ర, బాలగోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.


ప్రశాంత్ వర్మ, రాజశేఖర్, జీవిత, సి.కల్యాణ్


ప్రియదర్శి, అనన్య

అగ్గిపెట్టెలో పట్టుచీర

ప్రియదర్శి, అనన్య, ఝాన్సీ, చక్రపాణి కీలక పాత్రలు పోషించిన చిత్రం 'మల్లేశం'. రాజ్ దర్శకుడు. శ్రీ అధికారి, రాజ్ ఆర్ నిర్మాతలు. హైదరాబాద్‌లో ఫస్ట్‌లుక్ విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ "పద్మశ్రీ' చింతకింది మల్లేశం జీవితం ఆధారంగా తెరకెక్కిస్తున్న చిత్రమిది. అగ్గిపెట్టెలో పట్టేంత పట్టుచీరలను నేసి ప్రపంచాన్ని నివ్వెరపరిచిన వ్యక్తి మల్లేశం. చేనేత ప్రాముఖ్యతని చాటిన ఆయన జీవితంలోని మలుపులు ఆకట్టుకుంటాయి. గోరేటి వెంకన్న, చంద్రబోస్ రాసిన పాటలు, రాబీన్ స్వరాలు ప్రత్యేక ఆకర్షణ" అన్నారు.

ఆస్కార్ వేదికపై లేడీ గాగా పాట


లేడీ గాగా

ప్రతిష్ఠాత్మక ఆస్కార్ వేడుక ఈ నెల 24న జరగనున్న విషయం తెలిసిందే. తారల ఆటపాటలు, వ్యాఖ్యాతల ఛలోక్తులతో ఏటా ఆస్కార్ ఉత్సవం కన్నుల పండుగలా జరుగుతుంటుంది. ఈ ఏడాదీ అదే సందడి కనిపించనుంది. ఈసారి ప్రముఖ నటుడు బ్రాడ్లీ కూపర్, ప్రముఖ గాయని లేడీ గాగా వేడుకకు కొత్త ఆకర్షణ తీసుకురాబోతున్నారు. వీరిద్దరూ కలసి బెస్ట్ ఒరిజినల్ సాంగ్ విభాగంలో నామినేట్ అయిన 'షల్లో..' అనే పాటను వేదికపై అభినయించబోతున్నారు. ఆ విషయాన్ని ఆస్కార్ అకాడెమీ ట్విటర్‌లో ప్రకటించింది. బ్రాడ్లీ ప్రధాన పాత్రలో నటించిన 'ఎ స్టార్ ఈజ్ బోర్న్' చిత్రంలోనిదే 'షల్లో..' గీతం. ఆ పాటలోనూ బ్రాడ్లీ, లేడీ గాగా నటించారు. లేడీ గాగా రాసిన ఈ పాట గోల్డెన్ గ్లోబ్ పురస్కారం గెలుచుకుంది. కాగా బ్రాడ్లీ తొలిసారిగా దర్శకత్వం వహించిన 'ఎ స్టార్ ఈజ్ బోర్న్' 8 విభాగాల్లో ఆస్కార్ నామినేషన్లు దక్కించుకుంది.

ప్రేమకథ 2020


మోహిని

అరవింద్, మోహిని జంటగా నటిస్తున్న చిత్రం 'లవ్ 20-20'. వి.ఎస్.దర్శకుడు. మోహన్ వడ్లపట్ల, మహేందర్ వడ్లపట్ల నిర్మాతలు. దర్శకుడు మాట్లాడుతూ "నవతరం ప్రేమకథ ఇది. ప్రేమ విషయంలో ఈతరం ఆలోచనలు ఎలా ఉన్నాయో చూపిస్తున్నాం. కథకు సరిపడే టైటిల్‌నే నిర్ణయించాం. బెంగళూరు, కూర్గ్, కేరళ, హైదరాబాద్‌ల్లో చిత్రీకరించాం. ఈ నెలతో సినిమా పూర్తవుతుంది. ఏప్రిల్‌లో విడుదల చేస్తామ"న్నారు. సంగీతం: సత్యన్, పాటలు: కిట్టూ విస్సా ప్రగడ, ఛాయాగ్రహణం: సెంథిల్ కుమార్.


పూజా హెగ్డే

జాన్వీ కపూర్

సాన్యా మల్హోత్ర

హంస నడకలు ఫ్యాషన్ తళుకులు

వెండితెరపై అందంగా అలరించే తారలు ర్యాంప్‌పై చేరి హంసల్లా నడుస్తుంటే చూడముచ్చటగా ఉంటుంది కదూ. చూపు తిప్పుకోని సోయగాలతో సరికొత్త ఫ్యాషన్ దుస్తులు ధరించి మెరిసిపోతుంటే వీక్షకులకు కన్నుల పండగే. ముంబయిలో ఓ సౌందర్య ఉత్పత్తుల సంస్థ నిర్వహిస్తోన్న ఫ్యాషన్ షోలో అందాల కథానాయికలు పూజా హెగ్డే, జాన్వీ కపూర్ నలుపు రంగు దుస్తుల్లో తళుక్కుమన్నారు. ఇదే వేదికపై సాన్యా మల్హోత్ర, వాణీ కపూర్, మలైకా అరోరా తదితర సుందరీమణులూ సందడి చేసి ఆకట్టుకున్నారు.

'మిషన్ ఇంపాజిబుల్' నుంచి మరో రెండు

హాలీవుడ్ యాక్షన్ సినిమా ప్రియులకు 'మిషన్ ఇంపాజిబుల్' సిరీస్ గురించి కొత్తగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. ప్రముఖ కథా నాయకుడు టామ్ క్రూజ్ గూఢచారిగా ప్రధాన పాత్రలో నటించిన ఆ చిత్రాలన్నీ అభిమానులను అలరించాయి. ఇప్పటివరకూ ఈ సిరీస్‌లో ఆరు చిత్రాలు విడుదలయ్యాయి. గతేడాది వచ్చిన 'మిషన్ ఇంపాజిబుల్: ఫాలవుట్' ప్రపంచవ్యాప్తంగా ఘన విజయం సాధించింది. కాగా ఈ సిరీస్‌లో మరో రెండు చిత్రాలకు సన్నాహాలు మొదలయ్యాయి. వీటిలోనూ టామ్ క్రూజ్ గూఢచారి పాత్రలోనే కళ్లు చెదిరే పోరాటాలు చేయబోతున్నాడు. ఈ సిరీస్‌లో గత రెండు చిత్రాలు 'రోగ్ నేషన్', 'ఫాలవుట్'లను తెరకెక్కించిన క్రిస్టఫర్ మెక్‌క్వరీ కొత్త చిత్రాలకూ దర్శకుడిగా వ్యవహరించబోతున్నాడు. ఈ విషయాన్ని నిర్మాణ సంస్థ పారామౌంట్ పిక్చర్స్ వెల్లడించింది. ఈ కొత్త చిత్రాల విడుదల తేదీలు కూడా ఖరారయ్యాయి. ఈ సిరీస్‌లోని ఏడో చిత్రం 2021 జులై 23న, ఎనిమిదో చిత్రం 2022 ఆగస్టు 5న ప్రేక్షకుల ముందుకు రానున్నాయి.


టామ్ క్రూజ్

అడవిలో ఆపద

శ్రీనివాసరెడ్డి, అమర్, ప్రదీప్ వర్మ, ఉదయ్, అభి ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'చెడ్డీ గ్యాంగ్'. కనగాల రమేష్ చౌదరి దర్శకుడు. విక్కీరాజ్ నిర్మాత. హైదరాబాద్‌లో ప్రచార చిత్రాన్ని ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన 'మా' అధ్యక్షుడు శివాజీరాజా మాట్లాడుతూ "తెలుగు చిత్రాల్లో తమిళ నటులు ఎక్కువగా కనిపిస్తున్నారు. మన తెలుగు నటులను ప్రోత్సహిస్తే బాగుంటుంది. కథానాయికల్ని పక్క రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. చిన్న నటుల విషయంలోనూ ఇదే పద్ధతి పాటించడం సరికాద"న్నారు. "కేరళ అడవుల్లో విహార యాత్రకు వెళ్లిన పదిమంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల కథ ఇది. వాళ్లకు అడవిలో ఎలాంటి ఆపద ఎదురైందో చూపిస్తున్నాయ"న్నారు దర్శకుడు. బాలీవుడ్ కథానాయిక స్నేహా కపూర్ ప్రత్యేక గీతంలో కనిపిస్తుందని నిర్మాత తెలిపారు. కార్యక్రమంలో మల్లిఖార్జున్‌రావు పాల్గొన్నారు.


రమేష్ చౌదరి, మల్లిఖార్జున్ రావు, శివాజీరాజా, విక్కీరాజ్

కాబోయే సీఎం ఎవరు?


దేవి ప్రసాద్

దేవి ప్రసాద్, వాయు తనయ్, శశి, సుచిత్ర ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'నేనే ముఖ్యమంత్రి'. మోహన్ రావిపాటి దర్శకుడు. అట్లూరి నారాయణరావు, ఆలూరి సాంబశివరావు నిర్మాతలు. చిత్రం ఈ శుక్రవారం విడుదలవుతోంది. నిర్మాతలు మాట్లాడుతూ "నేటి రాజకీయ పరిస్థితులకు అద్దం పట్టే చిత్రమిది. ముఖ్యమంత్రి కుర్చీ కోసం జరిగే పోరాటంలోని మలుపులు ఆకట్టుకుంటాయి. చివరికి ఆ పీఠాన్ని అధిరోహించేదెవరో ఆసక్తికరంగా చూపించాం. ఇటీవల విడుదల చేసిన ప్రచార చిత్రాలకు మంచి స్పందన వచ్చింద"న్నారు. సంగీతం: ఫణి కల్యాణ్

మరోసారి రుజువైంది

శివ కంఠంనేని ప్రధాన పాత్రధారిగా నటించిన చిత్రం 'అక్కడొకడుంటాడు'. శ్రీపాద విశ్వక్ దర్శకుడు. కె.శివశంకర రావు, రావుల వెంకటేశ్వర రావు నిర్మాతలు. ఇటీవలే ఈ చిత్రం విడుదలైంది. ఈ సందర్భంగా చిత్రబృందం ఆదివారం విజయోత్సవాన్ని నిర్వహించింది. శివ మాట్లాడుతూ "సినిమా బాగుంటే ప్రేక్షకులు ఆదరిస్తారని మా చిత్రం మరోసారి రుజువు చేసింది. సి. కల్యాణ్ సహకారంతో మంచి థియేటర్లు దొరికాయ"న్నారు. దర్శకుడు మాట్లాడుతూ "సినిమా ప్రేక్షకులకు చేరువ కావడం ఆనందంగా ఉంద"న్నారు. నటీనటులు, పంపిణీదారుడు దాసరి శ్రీనివాస్, గంటా శ్రీనివాస్ పాల్గొన్నారు.


శివ

క్యాన్సర్ విజేత మళ్లీ కెమెరా ముందుకు


సోనాలి బింద్రే

ప్రముఖ నటి సోనాలి బింద్రే క్యాన్సర్‌పై పోరాటం తర్వాత నూతనోత్సాహంతో మళ్లీ కెమెరా ముందుకు వచ్చారు. గతేడాది ఆమె క్యాన్సర్ బారిన పడిన సంగతి తెలిసిందే. అమెరికాలో చికిత్స అనంతరం డిసెంబరులో స్వదేశానికి తిరిగొచ్చారు. ఆసుపత్రిలో ఉన్నప్పుడు కీమో థెరపీ లాంటి శస్త్ర చికిత్సలతో ఎన్నో శారీరక, మానసిక ఇబ్బందులెదురైనా మొక్కవోని ధైర్యాన్ని ప్రదర్శించారు. సామాజిక మాధ్యమాల్లో స్ఫూర్తి నింపే రాతలతో జీవితంపై మమకారాన్ని చాటారు. తన మనోస్థైర్యంతో క్యాన్సర్‌ను జయించారు. ఇప్పుడు కొండంత బలంతో మళ్లీ నట జీవితాన్ని ప్రారంభించి ఓ సినిమా చిత్రీకరణలో పాల్గొంటున్నారు. చాలా రోజుల తర్వాత సెట్లో అడుగుపెట్టిన అనుభూతిని ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారామె. "చాలా కాలం తర్వాత సెట్లోకి వచ్చాను. ఈ విరామం నన్ను చాలా విధాలుగా పరీక్షించింది. మళ్లీ కెమెరా ముందుకు రావడం కలలా ఉంది. ఇప్పుడు నా జీవితానికి మరింత బాధ్యత, సార్థకత ఉందనిపిస్తోంది. మళ్లీ పని మొదలుపెట్టినందుకు ఆనందంగా ఉంద"ని పోస్ట్ చేశారు సోనాలి.

వసుంధర

పెళ్లయ్యాక తోడుగా...

పెళ్లంటే జీవితాంతం కష్టసుఖాల్లో ఒకరికొకరు తోడుగా కలిసి నడవాలి. కానీ మారుతోన్న పరిస్థితులు, ఒత్తిడి వంటి వాటివల్ల చిన్న విషయాలకే చిర్రుబుర్రులాడుకుంటున్నారు. అలాకాకూడదంటే...!

- పెళ్లి అనే పేరుతో ఒక్కటయ్యాక కూడా నా, నీ అనుకోవడం వల్ల గొడవలు మొదలవుతాయి. అలాకాకుండా కలిసి తీసుకునే నిర్ణయాలు, ఒకరికోసం మరొకరు ఆలోచించి చేసే పనులు ఇద్దరినీ ఒక బాటలో నడిపిస్తాయి. ఇది మీ మధ్య బంధాన్ని బలపరుస్తుంది.
- పొరబాట్లు సహజం...అవి ఇద్దరిలో ఎవరివల్లైనా జరగొచ్చు. ప్రతి సమస్యనూ మీ వైపే కాకుండా ఎదుటివారి కోణం నుంచి కూడా ఆలోచించడానికి ప్రయత్నించండి. కానీ తప్పుని ఒప్పుకోవడానికి ఇలాంటప్పుడు అహం అడ్డొస్తుంది. సమస్యను మరింత జటిలం చేస్తుంది. ఒకరి మీద మరొకరు తప్పులు వేసుకోకుండా కూర్చుని మాట్లాడుకుంటే సమస్య సర్దుబాటు అవుతుంది.



- భార్యాభర్తల మధ్య గొడవలు సహజం. గతం జోలికి అస్సలు వెళ్లొద్దు. ఎప్పటి గొడవలు అప్పుడే పరిష్కరించుకుని వదిలేసుకోవడం వల్ల అవి పెరిగి పెద్దవి కావు. అన్యోన్యంగా ఉండగలుగుతారు.
- మీ మధ్య బంధం మరింత బలపడాలంటే...ముందు మీ జీవనశైలిలో కొన్నిమార్పులు తప్పనిసరిగా చేసుకోండి. ఇద్దరూ కలిసి ఎక్కువ సమయం గడిపేలా చూసుకోండి. రోజూ ఒకపూటైన కలిసి భోజనం చేయడం, ప్రత్యేక సందర్భాలను గుర్తుపెట్టుకుని సెలబ్రేట్ చేసుకోవడం, విహారయాత్రలకు వెళ్లడం వంటివన్నీ చేయండి.




నిమ్మ నోరూరించేలా...!

తినాలనుకున్న ఆహారం కంటికీ నచ్చితే.. నోరూరుతుంది. అందుకే వండిన వంట ఏదైనా దాన్ని ఆకట్టుకునేలా తీర్చిదిద్దడం కూడా ముఖ్యమే. అందుకు నిత్యం మన వంటింట్లో వాడే నిమ్మ పండుని ఆహారంలో అలంకరణకోసం చక్రాల్లా కోసి పెడతాం. ఇంకా ఆలోచిస్తే పూలు, జంతువులు, హృదయం...ఇలా రకరకాల ఆకృతుల్లోనూ తీర్చిదిద్దేయొచ్చు. అదేమంత కష్టమూ కాదు. పీలర్, చాకులతోనే ప్రయత్నించొచ్చు.





పని చేసే చోట.. ఎన్నో కళ్లు కాటేయాలని చూస్తుంటాయి.. ఎన్నో చేతులు తాకడానికి ప్రయత్నిస్తుంటాయి. వికృత చేష్టలూ తప్పకపోవచ్చు. ఇలాంటప్పుడు... వాటిని భరించాలా లేక బయటపెట్టి పరిష్కరించుకోవాలా... అనే ప్రశ్నే ఎదురైతే... చాలామంది మహిళలు భరిస్తారే తప్ప బయటపడరు. అలాంటివారికి ధైర్యాన్ని ఇచ్చేందుకు ఏర్పాటైందే 'షాట్'. హైదరాబాద్ పోలీసులు ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమం ఎంతోమంది ఉద్యోగినులకు ఓ ధైర్యం. ఇంతకీ వాళ్లేం చేస్తారంటే...



10% గతేడాది తెలంగాణలో పనిచేసే చోట లైంగిక వేధింపులు ఎదుర్కొని ఫిర్యాదులు చేసిన ఉద్యోగినులు.

27% మనదేశంలో కింది స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకూ ఉద్యోగం చేస్తున్న మహిళలు.

31% దేశవ్యాప్తంగా లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్న వారిలో ఫిర్యాదు చేసిన మహిళలు.

38% మనదగ్గర పని చేసే చోట నిత్యం లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్న ఉద్యోగినులు.

మృగాళ్లపై షాట్‌అవుట్

ఏటికేడు పనిప్రదేశంలో లైంగిక వేధింపుల బారినపడిన వారి సంఖ్య పెరుగుతోందే తప్ప తగ్గట్లేదు. ఐదేళ్ల క్రితం పనిప్రదేశంలో లైంగిక వేధింపులకు సంబంధించిన చట్టం అమలులోకి వచ్చినా ఇంకా పూర్తిస్థాయిలో బాధితులకు న్యాయం జరగడం లేదు. ఈ వేధింపుల బారిన పడిన మహిళలు పోలీసుల వరకూ వెళ్లి తమ బాధలు చెప్పుకోవడం అన్నివేళలా కుదరకపోవచ్చు. అందుకే పనిచేసే కార్యాలయంలోనే ఆ గోడును వెళ్లబోసుకోవడానికి అంతర్గత కమిటీలు ఏర్పాటయ్యాయి. అయినప్పటికీ చాలామంది ఉద్యోగినులకు ఈ చట్టాలు... కమిటీల గురించి అవగాహన లేదు. కొందర్నికైతే తమదగ్గర అలాంటి కమిటీ ఒకటి ఉందని కూడా తెలియదు. దాంతో తమ బాధను ఎవరితో చెప్పుకోవాలో తెలియక మానసికంగా కుంగిపోతున్నారు. ఇప్పటివరకూ అసలు కమిటీనే నియమించని సంస్థలు కూడా ఉన్నాయి. ఒకవేళ నియమించినా ఫిర్యాదులకు పరిష్కారం చూపించట్లేదు. అందుకే ఈ 'షాట్' అంటారు హైదరాబాద్ నేర పరిశోధనల అదనపు సీపీ శిఖాగోయల్.



పరిశీలించి పరిష్కరించేలా...

గతనెల ప్రారంభించిన ఈ షాట్ కార్యక్రమం గురించి షీ బృందాలు ఉద్యోగినులకు అవగాహన కల్పించేందుకు సిద్ధమయ్యాయి. ఈ బృందాలు కార్యాలయాల్లో అంతర్గత కమిటీలు ఏర్పాటు చేస్తాయి. ఏర్పాటు చేసిన చోట బాధితులకు ఎంతవరకూ న్యాయం జరిగిందో కూడా పరిశీలిస్తాయి. అసలు ఫిర్యాదులే లేని చోట... కారణాలు కూడా తెలుసుకుంటారు. ఎప్పటికప్పుడు పలు వర్క్‌షాపులు ఏర్పాటు చేసి ఆయా కార్పొరేట్ సంస్థలు, ఆసుపత్రులు, సినిమా నిర్మాణ సంస్థలు...ఇలా పలు రంగాలకు చెందిన సంస్థల సీఈవోలు, సీఎఫ్‌వోలు, మానవ వనరుల విభాగాల బాధ్యులను ఆహ్వానిస్తారు. ఇకపై షాట్ బృందం నిర్వహించే ప్రతి కార్యక్రమంలోనూ వాళ్లు భాగస్వాములవుతారు. దీనిలో ఐరాస గుర్తింపు పొందిన సారోప్టిమిస్ట్ అనే స్వచ్ఛంద సంస్థ కూడా భాగస్వామి అయ్యింది.

ఏంటా సంస్థ...

సారోప్టిమిస్ట్ లండన్‌కు చెందిన స్వచ్ఛంద సంస్థ. మహిళల కోసం మహిళలు ఏర్పాటు చేసింది. ఇది స్త్రీలను వేధింపులు, రకరకాల ఇబ్బందుల నుంచి బయటపడేస్తుంది. న్యాయపరంగానూ సాయం చేస్తుంది. సాధికారత దిశగా నడిపించడంలోనూ కీలకంగా పనిచేస్తుంది. ప్రస్తుతం 130 దేశాల్లో ఎనభై వేల మంది సభ్యులతో ఈ స్వచ్ఛంద సంస్థ పలు సేవల్ని అందిస్తోంది. మనదేశంలో తెలంగాణతో కలిపి పదిహేను రాష్ట్రాల్లో సారోప్టిమిస్ట్ సేవలందిస్తోంది. హైదరాబాద్‌లో సారోప్టిమిస్ట్ ఛాప్టర్ బాధ్యతలను వెల్‌నెస్ నిపుణురాలు దీపిక చలసాని నిర్వహిస్తున్నారు. ఈ సంస్థ షాట్‌తో కలిసి ఎలా పనిచేస్తుందో వివరిస్తున్నారు దీపిక. 'మా సంస్థలో వ్యాపారవేత్తలు, ఐఏఎస్‌లు, వైద్యులు.. ఇలా పెద్ద పెద్ద అర్హతలున్న మహిళలు సభ్యులుగా ఉన్నారు. షాట్ కార్యక్రమం ప్యానెల్‌లో ఎవరు ఉండాలి... ఎవరిని అతిథులుగా పిలవాలి.. వంటివి మేమే నిర్ణయించాం. ఇందుకోసం నలభై ఐదు రోజులు కష్టపడ్డాం. మహిళా ఉద్యోగినులకు అవగాహన కల్పించడంలో భాగంగా వారు కూర్చునే చోట ఏర్పాటు చేయాల్సిన పోస్టర్లు, బ్రోచర్లు, వీడియోలు, పవర్‌పాయింట్ ప్రజంటేషన్లు, నివేదికలు రూపొందించాం. ఇందుకు పలువురు నిపుణుల సలహాలు, సూచనలు కూడా తీసుకున్నాం.

అందరికీ తెలిసేందుకే...

చదువుకున్నవారికి, ఉద్యోగినులకు ఈ విషయం కాస్త అయినా తెలుస్తుంది. కానీ ఇళ్లలో పని చేసే వారికి, చిన్న చిన్న ఉద్యోగాలు చేసేవారికి కూడా ఈ చట్టం వర్తిస్తుందని చాలామందికి తెలియదు. అందుకే వారికీ షాట్‌పై అవగాహన కల్పించాలనేదే మా ప్రయత్నం. ఇందుకు సంబంధించిన ఆంగ్ల వీడియోలు, నివేదికలను తెలుగు, హిందీలో తర్జుమా చేశాం. గేటెడ్ కమ్యూనిటీలు, మురికివాడల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. అప్పుడప్పుడు కార్పొరేట్ సంస్థల్లోనూ ఉద్యోగినుల వద్ద వర్క్‌షాపులు ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పుడు మాకు షీటీమ్స్ బృందం తోడైంది. మున్ముందు మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తాం' అని అంటారామె.

– పద్మ వడ్డె

వారికి భరోసా...

దీపికా చలసాని గురించి తెలిసిన సారోప్టిమిస్ట్ సభ్యులు ఆమెను హైదరాబాద్ చాప్టర్‌కు సారథ్యం వహించమని కోరారు. అప్పటికే ఆమె వెల్‌నెస్ రంగంలో ఉంది. గతేడాది యువత అనే ఎన్జీవోతో కలిసి పనిచేయడం ప్రారంభించింది. అందులో భాగంగా మహిళలకు పాత పేపర్లను రీసైక్లింగ్ చేయడం నేర్పించి ఆర్థిక భరోసా ఇచ్చింది. అలానే ఎల్వీప్రసాద్‌లో చూపులేని చిన్నారులకు, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేయడం ప్రారంభించింది. ఆ క్రమంలో అవసరం ఉన్నవారిని ఆదుకుంది. ఆ తరువాత ఓ సారి దీపిక నేర పరిశోధనల అదనపు సీపీ శిఖాగోయల్‌ను సంప్రదించింది. ఆమె అంగీకరించడంతో అలా షాట్‌లో భాగస్వామి అయ్యింది సారోప్టిమిస్ట్.



అల్పాహారం తప్పనిసరి

మహిళలు బరువును అదుపులో పెట్టుకోవడానికి అనేక ప్రయత్నాలు చేస్తారు. ఇందులో భాగంగా కొన్ని కొన్ని తప్పులు కూడా చేస్తుంటారు. తక్కువగా తినడం, శరీరానికి సరిపోని వ్యాయామాలు చేయడం వంటివి. మరేం చేయాలి?

పోషకాలతో కూడిన అల్పాహారం రోజంతా చురుగ్గా ఉండేలా చేస్తుంది. మాంసకృత్తులు, పీచు పదార్థాలు, విటమిన్లు, చక్కెర ఎక్కువగా ఉండేలా దీనిని తయారు చేసుకోవాలి. ఇవి జీర్ణం అవడానికి కొంత సమయం తీసుకుంటాయి. దీంతో అతిగా తినలేం. కాబట్టి బరువు అదుపులో ఉంటుంది.

- రోజూ ఒకే రకమైన వర్కవుట్స్ చేస్తే విసుగురావొచ్చు. దాంతో ఇక కొనసాగించాలనిపించదు. అలాంటప్పుడు మిత్రులతో కలిసి జుంబా డాన్స్ ప్రయత్నించండి. అప్పుడప్పుడు దగ్గర్లో ఉన్న పార్కులు, ఇతర ప్రాంతాలకు వెళ్లండి. చిన్నప్పుడు మీరు ఆడిన ఆటలు ఆడండి. ఇవన్నీ మీకు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి.
- వ్యాయామం చేసే సమయంలో చెమట రూపంలో శరీరం నుంచి ఎక్కువ నీటిని కోల్పోతాం. అందుకే అధికంగా నీటిని తాగడం మంచిది. శరీరంలో నీటి శాతం తక్కువగా ఉంటే తలనొప్పి, అలసట దరిచేరుతాయి. ఆకలి పెరిగి ఎక్కువగా తింటాం. వీటన్నింటికీ దూరంగా ఉండాలంటే వ్యాయామానికి ముందు, తరువాత మంచినీళ్లు తాగండి.
- అలసటను వదిలించుకొని, మెదడును చురుగ్గా ఉంచుకోవడానికి చాలా మంది ఉద్యోగస్తులు కాఫీ, టీలకు అలవాటు పడతారు. కెఫీన్, తీపి పదార్థాలు ఎక్కువ తీసుకుంటే ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. అలసటకు గురయ్యేలా చేస్తాయి. అలాంటప్పుడు కాసేపు అటూ ఇటూ నడవండి. ఒత్తిడి, అలసటా దూరం అవుతాయి.



- రోజూ వ్యాయామానికి అరగంట సమయం కేటాయించండి. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా వ్యాయామం చేయడం మాత్రం మరవకండి. మహిళలు ఫిట్‌గా ఉండాలంటే వారంలో కనీసం మూడు గంటలైనా వ్యాయామం చేయాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

మా పాప మాట్లాడాలంటే...?

మా పాపకి మూడేళ్లు. ఇంకా మాటలు రావట్లేదు. మేం మాట్లాడితే మాత్రం పలుకుతుంది. తనంతట తాను మాట్లాడలేకపోతోందని మాకు భయమేస్తోంది. అసలు పిల్లలు ఎన్ని సంవత్సరాలకు పూర్తిగా మాట్లాడతారు. మా పాప మాటలు నేర్చుకుని స్పష్టంగా మాట్లాడాలంటే ఏం చేయాలి?

- ఓ సోదరి


✔ మీ ఉత్తరాన్ని బట్టి చూస్తోంటే... పాప మీరు మాట్లాడింది యథాతథంగా మాట్లాడుతుంది. కానీ తనంతట తానుగా మాట్లాడలేకపోతుందని అర్థమవుతోంది. సాధారణంగా పిల్లలు నాలుగు నుంచి ఆరు నెలల వయసులోనే రకరకాల శబ్దాలు చేయడం మొదలుపెడతారు. ఆ తరువాత తల్లిదండ్రులు, మిగతా కుటుంబ సభ్యుల మాటలను ఆలకిస్తుంటారు. వ్యక్తుల్ని గుర్తుపడుతుంటారు. దీన్నే నాన్ వెర్బల్ కమ్యూనికేషన్ అంటారు.

ఇక, పిల్లలకు ఏడాది వచ్చేసరికి అత్తా.. తాతా.. అమ్మా.. అంటూ చిన్న చిన్న పదాలు పలకడం నేర్చుకుంటారు. ఏడాదిన్నరలో వారి ఇష్టాయిష్టాలను హావభావాల ద్వారా, చిన్న చిన్న పదాలను పలుకుతూ వ్యక్తం చేస్తుంటారు. ఇది ప్రైమరీ కమ్యూనికేషన్. రెండేళ్లకు 'నాకు ఇవ్వు.. నాకు వద్దు..' అంటూ వారికి కావల్సింది అడుగుతారు. మూడేళ్లు వచ్చేసరికి మూడేసి పదాలతో చిన్న వాక్యాలు చెప్పడానికి ప్రయత్నిస్తుంటారు. ఇదే సమయంలో శరీర భాగాలు, వాడే వస్తువులు, చుట్టుపక్కల వ్యక్తుల గురించి కొంత అవగాహన వస్తుంది.

మీ పాపకి మూడేళ్లంటున్నారు. తన విషయానికి వస్తే ఆలోచించాల్సిందే! ఇక మీదట పాప మీద శ్రద్ధ పెట్టి ఎక్కువసేపు మాట్లాడుతూ మాట్లాడించే ప్రయత్నం చేయండి. మీరు ఏం చెప్పినా అందుకు సంబంధించిన వస్తువును చూపిస్తూ వివరాలు చెప్పాలి. ఆ తరువాత ఆమెకు ఏం అర్థమైందో అడిగి తెలుసుకోవాలి. మీరు చెప్పింది యథాతథంగా చెబుతుందా? లేదా ఊహాజనితంగా, తనకు తోచినట్టు చెబుతుందా అన్నది గమనించాలి. ఒకవేళ చెప్పిందే తిరిగి చెబుతుంటే మాత్రం తనలో ఎక్స్‌ప్రెసివ్ లాంగ్వేజ్ డిలే సమస్య ఉందేమో గమనించాలి. ఇది ఉన్నప్పుడు మాటలు వచ్చినా వాటిని ఎలా వ్యక్తపరచాలో వారికి తెలియదు. అదే ఆటిజంలో కూడా భాష వ్యక్తీకరణ సమస్య ఉంటుంది. ఇక కొందరు చిన్నారులు అసందర్భంగా, ఆపకుండా అవసరం కంటే ఎక్కువ మాట్లాడుతుంటారు. ఇవన్నీ కూడా సమస్యలే. అందుకే మీరు మొదట మానసిక నిపుణుల సాయం తీసుకోవాలి. వారు పరీక్షలు చేసి ఆటిజం, న్యూరో డెవలప్‌మెంట్ (స్పీచ్)సమస్య, భాషాపరమైన డిజార్డర్.. ఇలా మీ పాపకు ఏ సమస్య ఉందో కనుక్కుంటారు. వాటితో పాటు గ్లోబల్ డెవలప్‌మెంట్ డిలే ఉందేమో కూడా పరీక్షిస్తారు. మానసిక ఎదుగుదల లేకపోవడంతోపాటు.. నడవడం, కూర్చోవడం కూడా ఆలస్యం అయితే దాన్ని గ్లోబల్ డెవలప్‌మెంట్ డిలే అంటారు. అవసరమైతే స్పీచ్ థెరపీలనూ చేయించాల్సి ఉంటుంది. ఆటిజం అయితే సామాజిక భావవ్యక్తీకరణ నైపుణ్యాలు నేర్పిస్తారు. ఇలా సమస్యను బట్టి మీకో మార్గం ఉంటుంది. దాని గురించి బాధపడాల్సిన అవసరం లేదు.



డియర్ వసుంధర



డా. మండాది గౌరీదేవి
పిల్లల మానసిక నిపుణురాలు

- మీ సందేహాలను vasukid@eenadu.net కు పంపించగలరు.

అందుకే వందశాతం హాజరు...!



చదువంటే ఇష్టం ఉన్నా... పదో తరగతితో ఆపేసిందామె. తనలా మరెవరూ కాకూడదని బడి మానేసిన వారిని చదువుల బాట పట్టిస్తోంది. ఆ ప్రయత్నాన్ని గుర్తించిన ఓ సంస్థ ఆమెను రెండు పాఠశాలలకు ఇన్‌ఛార్జ్‌గా చేసింది. ఆమే పాతికేళ్ల తులసీబాయి.

● తులసీబాయిది ఏ ఊరు?

బెంగళూరు శివారులోని ఎన్.వై. హోస్కోటె.

● ఆమె కుటుంబ నేపథ్యం ఏంటి?

తులసిది పేద కుటుంబం. చదువుకోవాలని ఉన్నా, తల్లిదండ్రులతో కలిసి పనులకు వెళ్లాల్సిన పరిస్థితి. అలా వెళ్తూనే ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి వరకు చదువుకుంది. ఆపై చదువును కొనసాగించలేకపోయింది.

● పిల్లల్ని బడికి పంపించాలనే ఆలోచన ఎలా వచ్చింది?

పనిలోకి వెళ్లాక అక్కడ తనలాంటి పిల్లలు చాలామంది ఉన్నారని తెలుసుకుంది. వాళ్లు మళ్లీ పాఠశాల మెట్లు ఎక్కేలా చేయాలనుకుంది. అప్పుడే ఓ పత్రికలో 'అసోసియేషన్ ఫర్ ప్రమోటింగ్ సోషల్ యాక్షన్ (ఏపీఎస్ఏ)' సంస్థ ప్రకటన చూసింది. నిరుపేద విద్యార్థుల్ని బడిబాట పట్టించడమే వాళ్ల పని. అలా వాళ్లను సంప్రదించింది.

● ఆ సంస్థ అవకాశం ఇచ్చిందా?

మొదట ఒప్పుకోలేదు. డిగ్రీ ఉండాలన్నారు. కానీ ఆమె పట్టు వదల్లేదు. తన సమస్యని వారికి వివరించింది. తనలా మరొకరు కాకుండా కృషి చేస్తానని చెప్పడంతో అంగీకరించిందా సంస్థ. కొన్నిరోజులు శిక్షణ తీసుకున్నాక ఆత్మవిశ్వాసంతో పని చేయడానికి సిద్ధమైంది.

● బడి బాట పట్టించడం అంటే...?

హోస్కోటె ప్రాంతంలోని పాఠశాలలకు వెళ్లి రోజూ హాజరుపట్టీ పరిశీలించడంతో తులసి పని మొదలవుతుంది. అందులో బడికి రానివారిని గుర్తించి వాళ్లింటికి వెళ్తుంది. ఏదయినా అనారోగ్యంతో బాధపడుతుంటే వారిని ఆసుపత్రికి చేర్చడానికి ఏర్పాటు చేస్తుంది. కూలికి వెళ్తోంటే మాత్రం వారి తల్లిదండ్రులకు చదువు విలువ చెబుతుంది. పిల్లలకు పుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్నం భోజనం వంటి సౌకర్యాలన్నింటినీ అందేలా చేస్తుంది.

● ఫలితం కనిపించిందా?

చాలా మార్పు కనిపించింది. బడి మానేసిన పిల్లల సంఖ్య బాగా తగ్గింది. దాంతో ఆ సంస్థ ఆమెను రెండు పాఠశాలలకు ఇన్‌ఛార్జిగా చేసింది. వాటిల్లో పిల్లల హాజరు బాధ్యత పూర్తిగా ఆమెకు అప్పజెప్పింది. దాంతో ఇప్పుడక్కడ వందశాతం హాజరు ఉంది. ఏటా మార్చి నుంచి మే వరకు ఆయా ప్రాంతాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి పిల్లల్ని బడిలో చేర్పించమని అడుగుతోంది.

చదువు

స్పెల్లింగ్ సత్తాకు సవాల్!



ఆంగ్ల అక్షర క్రమం (స్పెల్లింగ్) సరిగా చెప్పగలిగే ప్రావీణ్యం ఉన్నవారిని గుర్తించి, వారి ప్రత్యేక నైపుణ్యాలను వెలుగులోకి తీసుకురావడం కోసం 'స్పెల్ బీ' నిర్వహిస్తున్నారు. క్లాస్‌మేట్ స్పెల్ బీ సీజన్-IIకు సంబంధించిన నోటిఫికేషన్ తాజాగా విడుదలైంది. దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ పోటీలో పాల్గొనేందుకు ఐదు నుంచి తొమ్మిది తరగతుల విద్యార్థులు అర్హులు.

ఇతర భాషల నుంచి ఎన్నో పదాలు ఆంగ్లంలో చేరాయి. వీటన్నిటి స్పెల్లింగ్‌ను గుర్తుంచుకోవాలంటే పరిజ్ఞానం, కృషి, సాధన తప్పనిసరి. ఒక పదానికి మూలం ఏమిటి, దాని అర్థం కాలక్రమంలో ఎలా మారిందీ- ఇవన్నీ గ్రహించాలి. కచ్చితమైన స్పెల్లింగ్‌ను వేగంగా చెప్పగలగటం కూడా ముఖ్యమే. విద్యార్థుల స్పెల్లింగ్ పరిజ్ఞానం పెంచి, వారిలో ఆ ప్రతిభను వెలికితీసేందుకు ఐటీసీకి చెందిన నోట్‌బుక్ బ్రాండ్ క్లాస్‌మేట్, రేడియో మిర్చి సంయుక్తంగా స్పెల్ బీని నిర్వహిస్తున్నాయి. దేశవ్యాప్తంగా మొత్తం 30 నగరాల్లోని 1000కిపైగా స్కూళ్ల విద్యార్థులు దీనిలో పాల్గొంటారు. మొత్తంగా 6,50,000 మంది ఐదు- తొమ్మిది తరగతుల విద్యార్థులు దీనిలో పాల్గొంటారు. పరీక్ష షెడ్యూల్ ఇంకా వెలువడాల్సివుంది.

classmate SPELLBEE

5 నుంచి 9 తరగతుల విద్యార్థులకు అవకాశం

ఆన్‌లైన్‌లో (www.classmatespellbee.in) లో పేరు, స్కూలు మొదలైన వివరాలతో నమోదు చేసుకోవాలి. విద్యార్థి తాను ఎంపిక చేసిన 30 నగరాల్లో లేకపోయినట్లయితే ఆన్‌లైన్ ద్వారా కూడా పరీక్ష రాయొచ్చు. అయితే వీరు తమకు దగ్గరగా ఉన్న నగరాన్ని ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. పరీక్ష తేదీ, సమయం వివరాలను నమోదు చేసుకున్న విద్యార్థులకు ముందుగా తెలియజేస్తారు.

ఎంపికలో నాలుగు స్థాయులు

❖ మొదటి స్థాయిలో ప్రతి స్కూలులో పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఇచ్చినవాటిలో 75 సరైన ఇంగ్లిష్ స్పెల్లింగులను విద్యార్థి గుర్తించాల్సి ఉంటుంది. ప్రతి స్కూలు నుంచీ టాప్ స్కోరు సాధించినవారిని రెండో స్థాయికి పంపుతారు. ❖ రెండో స్థాయిలో మొదటి స్థాయి టాపర్లందరూ పోటీ పడతారు. దీనిలో 75 ప్రశ్నలను 7.5 నిమిషాల్లో పూర్తిచేయాల్సి ఉంటుంది. దీనిలోనూ టాప్ స్కోరు సాధించినవారిని సెమీఫైనల్స్‌కు ఎంపిక చేస్తారు. ❖ మూడో స్థాయిలో రెండు రౌండ్లుంటాయి. మొదటి రౌండ్‌లో 10 నిమిషాల్లో 60 పదాలను గుర్తించాల్సి ఉంటుంది. ప్రతి నగరం నుంచి ఎక్కువ స్కోరు సాధించిన 10 మందిని రెండో రౌండ్‌కు ఎంపిక చేస్తారు. రెండో రౌండ్‌లో 10 నిమిషాల్లో 40 పదాలను గుర్తించాలి. దీనిలో దేశవ్యాప్తంగా ఎక్కువ స్కోరు సాధించిన 16 మందిని ఎంపిక చేస్తారు. ❖ నాలుగో స్థాయిలోనూ రెండు రౌండ్లుంటాయి. మొదటి రౌండ్‌లో దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన 16 మంది విద్యార్థులను నలుగురు చొప్పున నాలుగు గ్రూపులు చేస్తారు. ప్రతి గ్రూపువారూ నాలుగు సెమీఫైనల్స్‌లో ఒక దానిలో పాల్గొంటారు. సెమీఫైనల్స్‌లో విజయం సాధించిన వారంతా గ్రాండ్ ఫినాలేలో పోటీ పడతారు. దీనిలోనూ గెలిచినవారే తుది విజేత అవుతారు.

ఏమేం బహుమతులు?

తుది విజేతకు రూ.2 లక్షల నగదు బహుమతితో పాటు వాషింగ్‌టన్ డీసీ, యూఎస్‌లో నిర్వహించే స్క్రిప్స్ నేషనల్ స్పెల్లింగ్ బీ-2019ను చూసే అవకాశం ఉంటుంది. విద్యార్థి తనతోపాటు తన తల్లిదండ్రుల్లో ఒకరిని వెంట తీసుకెళ్లవచ్చు. మొత్తం ఖర్చు నిర్వాహకులే భరిస్తారు. సెమీఫైనల్‌కు చేరుకున్న ప్రతి ఒక్కరికీ రూ.50,000 నగదు బహుమతి ఉంటుంది.

పరీక్షకు సన్నద్ధమవ్వడానికి స్టడీ గైడ్, చిట్కాలు వెబ్‌సైట్‌లో ఉన్నాయి. మాదిరి పరీక్ష కూడా అందుబాటులో ఉంది.

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

బీఎస్‌ఎఫ్‌లో కానిస్టేబుల్ పోస్టులు

బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్) 2019 సంవత్సరానికిగానూ కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: కానిస్టేబుల్ (ట్రేడ్స్‌మ్యాన్)

ఖాళీలు: 1763 **విభాగాలు:** కాబ్లర్, టైలర్, కార్పెంటర్, కుక్, పెయింటర్ తదితరాలు.

అర్హత: మెట్రిక్యులేషన్ ఉత్తీర్ణతతోపాటు సంబంధిత ట్రేడులో రెండేళ్ల పని అనుభవం. నిర్దిష్ట శారీరక ప్రమాణాలు తప్పనిసరి.

వయసు: 18-23 ఏళ్ల మధ్య ఉండాలి. **దరఖాస్తు:** ఆఫ్‌లైన్.

చివరితేది: ఎంప్లాయిమెంట్ న్యూస్ (2019 ఫిబ్రవరి 2-8)లో ఈ ప్రకటన వెలువడిన తేదీ నుంచి 30 రోజుల్లోపు.

వెబ్‌సైట్: http://bsf.nic.in/

పవర్‌గ్రిడ్‌లో అసిస్టెంట్ ఇంజినీర్లు

పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (పీజీసీఐఎల్) కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: అసిస్టెంట్ ఇంజినీర్

ఖాళీలు: 42

విభాగాలు: ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, సివిల్.

అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో బీఈ/ బీటెక్/ బీఎస్సీ(ఇంజినీరింగ్), గేట్ ఉత్తీర్ణత. **వయసు:** 28 ఏళ్లు మించకూడదు.

ఎంపిక: గేట్ 2018 స్కోరు, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా. **దరఖాస్తు:** ఆన్‌లైన్. **చివరితేది:** ఫిబ్రవరి 28

వెబ్‌సైట్: http://www.powergridindia.com/

నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ

భారత జలవనరుల మంత్రిత్వశాఖ ఆధీనంలోని నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టులు-ఖాళీలు: జూనియర్ ఇంజినీర్-25, జూనియర్ అకౌంటెంట్-07, స్టెనోగ్రాఫర్ (గ్రేడ్ 2)-08, లోయర్ డివిజన్ క్లర్క్-33. **అర్హత:** పదోతరగతి, ఇంటర్, డిగ్రీ (కామర్స్), డిప్లొమా (సివిల్ ఇంజినీరింగ్), షార్ట్‌హ్యాండ్/ టైపింగ్ సామర్థ్యాలు. **వయసు:** 18-27 సంవత్సరాల మధ్య ఉండాలి. **ఎంపిక:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష, స్కిల్ టెస్టుల ఆధారంగా. **దరఖాస్తు:** ఆన్‌లైన్ **చివరి తేది:** ఫిబ్రవరి 22

వెబ్‌సైట్: http://www.nwda.gov.in/

ప్రవేశాలు

ఎయిమ్స్‌ల్లో ఎంఎస్సీ ప్రోగ్రాములు

దేశవ్యాప్తంగా ఉన్న ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)లలో 2019 సంవత్సరానికిగానూ ఎంఎస్సీ ప్రోగ్రాముల ప్రవేశ ప్రకటన విడుదలైంది. 1) ఎంఎస్సీ నర్సింగ్ **అర్హత:** బీఎస్సీ ఆనర్స్ నర్సింగ్/ బీఎస్సీ నర్సింగ్/ పోస్ట్ బేసిక్ బీఎస్సీ నర్సింగ్ ఉత్తీర్ణత. నర్సు, మిడ్‌వైఫ్‌గా రిజిస్టరై ఉండాలి. 2) ఎంఎస్సీ కోర్సులు

అర్హత: ఎంబీబీఎస్/ బీడీఎస్/ బీవీఎస్సీ/ బీఫార్మసీ/ సంబంధిత సబ్జెక్టుల్లో బీఎస్సీ ఉత్తీర్ణత. 3) ఎంఎస్సీ బయోటెక్నాలజీ

అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో బీఎస్సీ/ బీటెక్ ఉత్తీర్ణత.

దరఖాస్తు: ఆన్‌లైన్. **బేసిక్ రిజిస్ట్రేషన్:** ఫిబ్రవరి 7 నుంచి 21 వరకు. **ఫైనల్ రిజిస్ట్రేషన్:** మార్చి 29 నుంచి ఏప్రిల్ 5 వరకు.

వెబ్‌సైట్: https://www.aiimsexams.org/

మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు

ఏపీపీఎస్సీ, ఎస్ఐ & కానిస్టేబుల్స్ పరీక్షలకు

నేటి ప్రతిభ పేజీల్లో

కరెంట్ అఫైర్స్ టెన్త్, ఇంటర్ విద్యార్థుల కోసం ■ సోషల్ ■ ఫిజిక్స్

కేంద్రప్రభుత్వంలో

ఇంజినీర్ కొలువులు

స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నోటిఫికేషన్ విడుదల



ఇంజినీరింగ్ డిగ్రీ, డిప్లొమాలు చేసిన నిరుద్యోగులకూ, చిరుద్యోగులకూ ఓ బంగారు అవకాశం వచ్చింది! కేంద్ర ప్రభుత్వ పరిధిలో జూనియర్ ఇంజినీర్ల పోస్టుల నియామకాల కోసం స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ప్రకటన విడుదల చేసింది. దరఖాస్తుల ప్రక్రియ కూడా మొదలైంది. ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసి, వెంటనే సన్నద్ధత ప్రారంభించటం శ్రేయస్కరం. కంప్యూటర్ ఆధారిత రాతపరీక్షకు సమగ్రంగా తయారై మెరుగైన ప్రతిభ చూపితే చక్కటి ఉద్యోగం అందుకోవచ్చు!

సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, క్వాంటిటీ సర్వేయింగ్ అండ్ కాంట్రాక్ట్ బ్రాంచీల్లో డిప్లొమా; సంబంధిత కోర్సుల్లో ఇంజినీరింగ్ చదివినవారిలో అర్హులతో స్టాఫ్ సెలక్షన్ కమిషన్ జూనియర్ ఇంజినీర్ ఉద్యోగాలు భర్తీ చేయనున్నది. ఇలా నియమితులైనవారికి కేంద్ర జలసంఘం, సీపీడబ్ల్యూడీ, మిలటరీ ఇంజినీరింగ్ సర్వీసు, బార్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్, నేషనల్ టెక్నికల్ రిసెర్చ్ ఆర్గనైజేషన్ తదితర సంస్థల్లో పనిచేసే అవకాశం లభిస్తుంది.

- దరఖాస్తుల స్వీకరణకు గడువు: 25.2.2019
- ఆన్‌లైన్ ద్వారా పరీక్ష రుసుము గడువు: 27.2.2019
- పేపర్-1 పరీక్ష తేదీ: 23.9.2019 నుంచి 27.9.2019
- పేపర్-2 పరీక్ష తేదీ: 29.12.2019

కంప్యూటర్ ఆధారిత పరీక్ష ద్వారా ఎంపిక జరుగుతుంది. ఈ పరీక్ష ద్వారా ఉద్యోగం పొందినవారు గ్రూప్ బి (నాన్ గెజిటెడ్)లో జూనియర్ ఇంజినీర్స్ పోస్టుల్లో నియమితులవుతారు. వారికి సెవెన్త్ పే స్కేలు ప్రకారం దాదాపుగా రూ.35,400 నుంచి రూ.1,12,400 స్కేలులో 60 వేల నుంచి 65 వేల రూపాయల మొత్తం జీతంగా లభిస్తుంది.

ఆసక్తి ఉన్నవారు http://ssconline.nic.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. చేతిరాత ద్వారా పోస్టులో దరఖాస్తులను స్వీకరించరు.

◆ పరీక్ష రుసుము రూ.100. ఎస్‌బీఐ ఛలానా, నెట్ బ్యాంకింగ్, క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు ద్వారా చెల్లించవచ్చు. ◆ మహిళా అభ్యర్థులు ఎస్సీ, ఎస్టీ, వికలాంగులు, ఎక్స్ సర్వీస్‌మెన్ కేటగిరీల వారికి పరీక్ష ఫీజులో మినహాయింపు ఉంటుంది.

అర్హతలు: ◗ సివిల్/ మెకానికల్/ ఎలక్ట్రికల్ డిప్లొమా, డిగ్రీ చదివినవారు అర్హులు. ◗ పోస్టులకు అనుగుణంగా 18 నుంచి 32 ఏళ్లవారు అర్హులు. వివిధ కేటగిరీల వారికి వయోపరిమితిలో సడలింపు ఉంది.

ఏ సబ్జెక్టు ఎలా?

పేపర్-1 (ఆబ్జెక్టివ్ తరహా)

1. జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్

వెర్బల్, నాన్‌వెర్బల్ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ముఖ్యంగా ప్రాబ్లమ్ సాల్వింగ్, డెసిషన్ మేకింగ్, అరిథ్‌మెటిక్ రీజనింగ్, క్లాసిఫికేషన్, నంబర్ సిరీస్, అనాలజీ అంశాలపై ప్రశ్నలడుగుతారు. డిప్లొమా, ఇంజినీరింగ్ చదివినవారికి ఈ అంశాలు వారు చదివిన పాఠ్యాంశాల్లో లేనప్పటికీ ఎంతో కొంత అవగాహన ఉంటుంది. కాబట్టి, వారు సరైన పద్ధతిలో సాధన చేస్తే మంచి మార్కులు సాధించవచ్చు.

2. జనరల్ అవేర్‌నెస్

ఈ విభాగంలో అభ్యర్థి పరిసరాల్లో జరిగే సాధారణ విషయాల అవగాహనను, సమాజంపై అవి చూపే ప్రభావాన్ని పరీక్షించేలా ప్రశ్నలుంటాయి. సాధారణంగా ఇలాంటి అంశాలపై డిప్లొమా, ఇంజినీరింగ్ అభ్యర్థులకు అవగాహన తక్కువగా ఉన్నప్పటికీ రోజువారీ వార్తాపత్రికలు, ముఖ్యమైన వార్తా సంచికలు, ప్రామాణిక పాఠ్యపుస్తకాలను సమగ్రంగా అధ్యయనం చేస్తే పరీక్షలో ప్రశ్నల సాధన సులభమవుతుంది.

3. జనరల్ ఇంజినీరింగ్

ఇందులో అభ్యర్థుల సంబంధిత ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ప్రశ్నలు అడుగుతారు. అంటే సివిల్ విద్యార్థులు సివిల్ ఇంజినీరింగ్‌కి సంబంధించిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. అలాగే మెకానికల్,



ఎలక్ట్రికల్ విభాగాలవారికి తమ తమ విభాగాలకు సంబంధించిన ప్రశ్నలు వస్తాయి.

సివిల్ ఇంజినీరింగ్: అభ్యర్థులు గత ప్రశ్నపత్రాల ద్వారా సరైన అవగాహనను పొంది, తమ అభ్యాసాన్ని మొదలుపెట్టడం మంచిది. పూర్వ ప్రశ్నపత్రాలను పరిశీలిస్తే బిల్డింగ్ మెటీరియల్స్, సాయిల్ మెకానిక్స్ అండ్ ఫౌండేషన్, సర్వేయింగ్, స్ట్రెంత్ ఆఫ్ మెటీరియల్స్ సబ్జెక్టుల నుంచి ఎక్కువ ప్రశ్నలు అడుగుతుండటాన్ని గమనించొచ్చు. కాబట్టి ఇలాంటి ముఖ్యమైన సబ్జెక్టులను ముందుగా అభ్యసించడం, మాదిరి ప్రశ్నలను సాధన చేయడం ఎంతో కీలకం.

మెకానికల్ ఇంజినీరింగ్: గత సంవత్సరాల ప్రశ్నపత్రాలను విశ్లేషిస్తే.. ఫ్లూయిడ్ మెకానిక్స్ అండ్ హైడ్రాలిక్ మెషిన్స్, థర్మల్ ఇంజినీరింగ్, ప్రొడక్షన్ ఇంజినీరింగ్ సబ్జెక్టుల్లో ఎక్కువ ప్రశ్నలు రావడాన్ని గమనించొచ్చు.

ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్: ఈ విభాగం నుంచి ఎలక్ట్రికల్ మెషిన్స్, పవర్ సిస్టమ్స్, మెజర్‌మెంట్స్ అండ్ మెజరింగ్ ఇన్‌స్ట్రుమెంట్స్ సబ్జెక్టులకు ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నారు.

పేపర్-2 (కన్వెన్షనల్ తరహా)

పేపర్-1లో మెరుగైన మార్కులు సాధించినవారిని పేపర్ 2 రాయడానికి అనుమతిస్తారు. గత ప్రశ్నపత్రాలను పరిశీలిస్తే మేలు. ఇందులో మొత్తం ఆరు ప్రశ్నలు అడుగుతారు. ప్రతి ప్రశ్నకు 60 మార్కులు. అయితే ప్రతి ప్రశ్నను 3 లేదా 4 విభాగాలుగా విభజించారు. ప్రతి విభాగానికి 10 నుంచి 20 మార్కులు కేటాయించారు. మొత్తం ఆరు ప్రశ్నల్లో ఏవేని అయిదు ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది.

సివిల్ ఇంజినీరింగ్‌లో గత ప్రశ్నపత్రాలను పరిశీలిస్తే బిల్డింగ్ మెటీరియల్స్, సర్వేయింగ్, సాయిల్ మెకానిక్స్ అండ్ ఫౌండేషన్, స్ట్రెంత్ ఆఫ్ మెటీరియల్స్, స్ట్రక్చరల్ అనాలిసిస్ సబ్జెక్టులకు ప్రాధాన్యం ఇచ్చారు. మెకానికల్ ఇంజినీరింగ్‌లో ఫ్లూయిడ్ మెకానిక్స్ అండ్ హైడ్రాలిక్ మెషిన్స్, థర్మల్ ఇంజినీరింగ్, ప్రొడక్షన్ ఇంజినీరింగ్, ఐసీ ఇంజిన్స్, హీట్ ట్రాన్స్‌ఫర్ సబ్జెక్టులు ముఖ్యమైనవి. ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విషయానికొస్తే.. ఎలక్ట్రికల్ మెషిన్స్, పవర్ సిస్టమ్స్, మెజర్‌మెంట్స్ అండ్ మెజరింగ్ ఇన్‌స్ట్రుమెంట్స్‌ను ప్రధానమైనవాటిగా చెప్పొచ్చు.

జూనియర్ ఇంజినీర్ రాతపరీక్ష విధానం తెలిపే పట్టిక www.eenadupratibha.net లో.

నెగ్గాలంటే..?

పేపర్ 1లో థియరీ ఆధారిత ప్రశ్నలు ఎక్కువ. అన్ని సబ్జెక్టులకూ తగినంత సమయం కేటాయించాలి. కాబట్టి, ప్రశ్నలకు సరైన సమాధానాలను రాయడంతోపాటు ఎంత త్వరగా సమాధానాలు గుర్తించామనేదీ ముఖ్యమే. సమాధానాలు త్వరగా రాయాలంటే అభ్యర్థులకు విస్తృతమైన సాధన అవసరం. అలాగే పరీక్ష సమయంలో సూటిగా సమాధానం రాయగల ప్రశ్నలను మొదట ఎంచుకుని తక్కువ సమయంలో పూర్తిచేయాలి. మిగిలిన సమయాన్ని ఎక్కువ సమయం పట్టే సంఖ్యాపరమైన, సూత్రాధారిత ప్రశ్నలకు కేటాయించవచ్చు.

- ప్రశ్నపత్రాలు డిప్లొమా సిలబస్, స్టాండర్డ్ ఆధారంగా ఉంటాయి. కానీ డిప్లొమాతోపాటు డిగ్రీ విద్యార్థులు కూడా ఈ పరీక్షకు పోటీపడతారు. కాబట్టి డిప్లొమా విద్యార్థులు కొంత ఎక్కువ శ్రమపడాల్సి ఉంటుంది.
- ఎస్ఎస్‌సీ పరీక్షకు దాదాపుగా 8 నెలల కాలవ్యవధి ఉంది. ఈ సమయాన్ని దృష్టిలో ఉంచుకుని తగిన ప్రణాళికను రూపొందించుకోవాలి. ఈ ప్రణాళికే అభ్యర్థులకు పరీక్షలో మంచి మార్కులు సాధించిపెట్టడానికి మొదటి మెట్టు.
- ఆ ప్రణాళికలో రోజుకు 5 నుంచి 6 గంటల సమయం సాధనకు కేటాయించాలి.
- ప్రాథమికాంశాలపై సరైన అవగాహన తెచ్చుకుని తరువాత గత సంవత్సరాల, ఆన్‌లైన్ మాదిరి ప్రశ్నలను సాధన చేయాలి. ప్రతి వారాంతం, నెలకోసారి చదివిన అంశాలను విశ్లేషించుకోవాలి.
- పరీక్షకు సన్నద్ధమయ్యేటపుడు ప్రతి చాప్టర్‌కు సంబంధించిన ముఖ్య అంశాలను చిన్న చిన్న పట్టికల ద్వారా సంక్షిప్తంగా తయారుచేసుకోవాలి.
- సాధనలో పునశ్చరణ ఎంతో ముఖ్యం. అందువల్ల చదివిన ప్రతి అంశాన్నీ తప్పనిసరిగా పునశ్చరణ చేయాలి. ఇందుకోసం చిన్న చిన్న పట్టికలు ముందుగా తయారుచేసుకుంటే ఎంతగానో ఉపయోగపడతాయి.
- అభ్యర్థులు సిలబస్‌ను ఒకటికి రెండుసార్లు క్షుణ్ణంగా పరిశీలిస్తే ఏ అంశాలపై ఎక్కువ దృష్టిపెట్టాలో అర్థమవుతుంది.
- మంచి ప్రామాణిక పాఠ్యపుస్తకాలను ఎంచుకోవడం సాధనకు ప్రధానం.

- వై.వి. గోపాలకృష్ణమూర్తి,
ఏస్ ఇంజినీరింగ్ అకాడమీ

కాంగ్రెస్ రుణమాఫీతో
రైతుల కష్టాలు తీరవు

అది ఎన్నికల తాయిలమే ● ప్రధాని నరేంద్ర మోదీ విమర్శ

శ్రీనగర్: కాంగ్రెస్ ప్రకటించిన రుణమాఫీ కేవలం ఎన్నికల తాయిలం మాత్రమేనని, అది రైతుల కష్టాలను తీర్చదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. రుణాల రద్దు తాత్కాలిక చర్య అని, శాశ్వత పరిష్కారం కాబోదని స్పష్టం చేశారు. ఆదివారం జమ్ము-కశ్మీర్‌లో పర్యటించిన ఆయన దాదాపు రూ.7,000 కోట్ల పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా విజయ్‌పుర్, లేహ్, శ్రీనగర్‌లలో జరిగిన బహిరంగ సభల్లో ఆయన మాట్లాడారు. రైతుల నిజమైన సంక్షేమం కోసం తమ ప్రభుత్వం కృషి చేస్తోందని, అందులో భాగంగానే వారికి నేరుగా నగదును అందిస్తున్నామని చెప్పారు.

భరత మాత బిడ్డల కోసమే పౌరసత్వ బిల్లు

పాకిస్థాన్, అఫ్గానిస్థాన్, బంగ్లాదేశ్‌ల్లో ఉన్న భరతమాత బిడ్డల కోసమే పౌరసత్వ బిల్లు తీసుకొచ్చామని మోదీ చెప్పారు. దేశ విభజన తరువాత మతపరమైన మైనార్టీలుగా ఆయా దేశాల్లో ఉండిపోయి వేధింపులకు గురయ్యారని తెలిపారు. వారికి అండగా ఉండేందుకే దేశంలో పౌరసత్వం ఇవ్వనున్నామని తెలిపారు. ఉగ్రవాదం కారణంగా కశ్మీర్ నుంచి వలస వెళ్లిన పండిత్‌ల పునరావాసానికి అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు. మెరుపుదాడుల ద్వారా ఉగ్రవాదాన్ని ఎలా ఎదుర్కోవాలో నూతన 'నీతి (విధానం), రీతి (సంప్రదాయం)'లను ప్రపంచానికి చూపించామని మోదీ అన్నారు. అమాయక యువకుల ప్రాణాలు తీస్తున్న ముష్కరులకు గట్టి సమాధానం ఇస్తున్నామని చెప్పారు. ఉగ్రవాదం వెన్నును విరగ్గొడుతామని అన్నారు.



జమ్ముకశ్మీర్‌లోని విజయ్‌పూర్‌లో ఆదివారం నిర్వహించిన బహిరంగ సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ

నేనే ప్రారంభోత్సవం చేస్తా

లద్దాఖ్‌లో తొలి విశ్వవిద్యాలయాన్ని, దాల్ సరస్సు ఒడ్డున తొలి బీపీఓ కేంద్రాన్ని ప్రధాని ప్రారంభించారు. విజయ్‌పుర్‌లో ఎయిమ్స్, ఇతర పనులకు శంకుస్థాపన చేశారు. వీటిని ప్రారంభించడానికి మళ్లీ తానే వస్తానని చెప్పారు. దేశంలో పెరిగిపోయిన 'లట్కానే' (జాప్యం), 'భట్కానే' (దారి మళ్లించడం) అనే పని సంస్కృతిని రానున్న అయిదేళ్లలో అంతం చేసి, సకాలంలో పనులు జరిగేలా చూస్తానని తెలిపారు.

జనధన్ ఎందుకో ఇప్పటికైనా అర్థమయిందా?

సామాన్యుల చేత బ్యాంకుల్లో జన్‌ధన్ ఖాతాలు ఎందుకు ప్రారంభించామో ఇప్పటికైనా అర్థమయిందా అని ప్రధాని మోదీ విపక్ష నాయకులను ప్రశ్నించారు. అప్పట్లో అందరిచేత బ్యాంకు ఖాతాలను ప్రారంభింపజేస్తే 'గొప్ప వ్యక్తులు, పెద్ద మేధావులు' తనను అవహేళన చేశారని చెప్పారు. రైతుల కోసం ఇటీవల ప్రకటించిన పీఎం-కిసాన్ వంటి పథకాల ప్రయోజనాలను నేరుగా అందించడానికే వాటిని ప్రారంభించామన్న విషయం వారికి ఇప్పటికైనా తెలిసి ఉంటుందని అన్నారు.

విద్యార్థులతో సంభాషణ

ప్రధాని మోదీ శ్రీనగర్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా దేశంలోని వివిధ ప్రాంతాల విద్యార్థులతో మాట్లాడారు. పేదరికం నిర్మూలనకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను వివరించారు. పర్యాటక రంగం ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు.



పట్నాలోని గాంధీ మైదాన్‌లో ఆదివారం జరిగిన 'జన్ ఆకాంక్ష ర్యాలీ'లో చేతులు కలిపిన విపక్షాల నాయకులు

మా మిత్రపక్షాలకే అధికారం

- **రాహుల్ గాంధీ ధీమా**
- **రైతుల రుణాలు మాఫీ చేస్తామని హామీ**

పట్నా, దిల్లీ: మనదేశంలో ప్రస్తుతం మార్పు పవనాలు వీస్తున్నాయని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మిత్రపక్షాలతో కలిసి తాము ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చాక రైతుల రుణాలను మాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. బిహార్ రాజధాని పట్నాలోని గాంధీమైదాన్‌లో కాంగ్రెస్ నిర్వహించిన సభను ఉద్దేశించి రాహుల్ ఆదివారం ప్రసంగించారు. "రైతుల కష్టాలు తీర్చేందుకు, యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు అవసరమైనవన్నీ మేం చేస్తాం. పంటరుణాలు మాఫీ చేస్తాం. ఆహారశుద్ధి పరిశ్రమకు ఊతమిస్తాం" అని పేర్కొన్నారు.

ఇటీవల మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లలో తాము అధికారంలోకి వచ్చిన కొన్ని వారాల వ్యవధిలోనే హామీలు నెరవేర్చిన సంగతిని రాహుల్ గుర్తుచేశారు. అదే తరహాలో కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేశాక హామీలన్నీ నెరవేరుస్తామని పేర్కొన్నారు. పేదలందరికీ కనీస ఆదాయం సమకూరుస్తామన్నారు. రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందంలో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం అవినీతికి పాల్పడిందంటూ రాహుల్ మరోసారి విమర్శలు గుప్పించారు. బెంగళూరులోని హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్‌ఏఎల్)లో రఫేల్ విమానాల ఉత్పత్తి జరిగేలా కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు చర్చలు జరిపిందని ఆయన తెలిపారు. అలా ఒప్పందం కుదిరి ఉంటే కర్ణాటక, బిహార్, ఉత్తర్ ప్రదేశ్, ఒడిశా తదితర రాష్ట్రాల్లోని నిరుద్యోగ యువతకు ఉపాధి దొరికి ఉండేదని పేర్కొన్నారు. మోదీ వచ్చాక పరిస్థితి మారిపోయిందన్నారు. కేవలం పారిశ్రామికవేత్త అనిల్ అంబానీకి ప్రయోజనం చేకూరేలా ఆయన ఒప్పందం కుదిర్చారని ఆరోపించారు. రాష్ట్రీయ జనతాదళ్ నేత తేజస్వీ యాదవ్, కేంద్ర మాజీ మంత్రి శరద్ యాదవ్, బిహార్ మాజీ ముఖ్యమంత్రి జితన్‌రాం మాంఝీ, మధ్యప్రదేశ్ సీఎం కమల్‌నాథ్, రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గహ్లోత్, ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేశ్ బఘేల్, కాంగ్రెస్ సీనియర్ నేత అహ్మద్ పటేల్, లోక్‌సభ మాజీ స్పీకర్ మీరా కుమార్ తదితరులు ఈ సభలో పాల్గొన్నారు. తేజస్వీ మాట్లాడుతూ.. ప్రధాని అయ్యేందుకు అన్ని అర్హతలు రాహుల్‌కు ఉన్నాయన్నారు. అయితే, మిత్రపక్షాలను కలుపుకొని పోవాల్సిన బాధ్యత ఆయనపై ఉందని వ్యాఖ్యానించారు. కమల్‌నాథ్, గహ్లోత్, బఘేల్, అహ్మద్ పటేల్‌లతో కలిసి పట్నాకు వెళ్లే విమానంలో ఎకానమీ తరగతిలో తాను ప్రయాణిస్తున్న ఫొటోను రాహుల్ ఇన్‌స్టాగ్రాంలో పంచుకున్నారు.

> తొలుత సీట్లను తగ్గించడం ద్వారా అణగారినవర్గాల నుంచి విద్యావకాశాలను మోదీ లాగేసుకున్నారు. ఉపకారవేతనాలను నిలిపివేశారు. రోహిత్ వేముల వంటి యువకులపై దాడి చేశారు. ఇప్పుడు 13-పాయింట్ల రోస్టర్ ద్వారా విశ్వవిద్యాలయాల్లో అణగారినవర్గాలకు ఉద్యోగాలు దూరం చేస్తున్నారు.
>
> **-ట్విటర్‌లో రాహుల్**

అణగారినవర్గాలకు ఉద్యోగాలు దూరం

విశ్వవిద్యాలయాల్లో అణగారినవర్గాలకు ఉద్యోగ అవకాశాలను ప్రధాని మోదీ నిరాకరిస్తున్నారని రాహుల్ గాంధీ ఆరోపించారు. విశ్వవిద్యాలయాల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లను విభాగాలవారీగా వర్తింపజేయడంవల్ల వారికి లభించే ఉద్యోగాలు 25 శాతం నుంచి ఒక్కోసారి 100 శాతం వరకు తగ్గిపోయే అవకాశముందంటూ మీడియాలో వచ్చిన ఓ కథనాన్ని ఉటంకిస్తూ మోదీ ప్రభుత్వంపై రాహుల్ ఈ విమర్శలు గుప్పించారు.

ప్రభుత్వ ఆదాయం పెరిగితే
రైతులకు మరింత నగదు

- **పీఎం-కిసాన్ పథకంపై జైట్లీ వెల్లడి**

న్యూయార్క్: ప్రభుత్వ ఆదాయం పెరిగే కొద్దీ పీఎం-కిసాన్ పథకం కింద రైతులకు ప్రత్యక్షంగా అందజేయనున్న నగదును కూడా పెంచే అవకాశం ఉందని కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ తెలిపారు. ఇక్కడ చికిత్స పొందుతున్న ఆయన ఓ వార్తా సంస్థతో మాట్లాడారు. దేశంలోని 12 కోట్ల మంది చిన్న, సన్నకారు రైతులకు ఏటా రూ.6,000 నగదును నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో వేసేలా అమలు చేయనున్న నూతన పథకంపై ఆయన తన అభిప్రాయాలను పంచుకున్నారు. నెలకు రూ.500 ...అంటే రోజుకు రూ.17 ఇస్తున్నారని.. ఇది ఏమూలకు అని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ విమర్శించారు. దీనిపై జైట్లీ స్పందిస్తూ రాహుల్ ఇంకా ఎదగాల్సి ఉందని అన్నారు. ఆయన పోటీ చేయబోయేది జాతీయ ఎన్నికల్లో తప్ప, కళాశాల ఎన్నికల్లో కాదన్న విషయాన్ని గుర్తించుకోవాలని చెప్పారు. కేంద్ర పథకాల అమలుకు సాధారణంగా కేంద్ర ప్రభుత్వం 60 శాతం నిధులు ఇస్తే, రాష్ట్ర ప్రభుత్వాలు 40 శాతం నిధులు ఇస్తాయని, దీన్ని కూడా ఆ తరహాలోనే అమలు చేసుకోవచ్చని సూచించారు. కాంగ్రెస్ పక్ష నేత మల్లికార్జున ఖర్గే అన్నింటినీ రాజకీయ కోణంలోనే చూస్తారని, సీబీఐ డైరెక్టర్‌గా రిషి కుమార్ శుక్లా ఎంపికపైనా అవే కారణాలతో విమర్శిస్తున్నారు.

అయోధ్యపై ప్రభుత్వ అభ్యర్థన చరిత్రాత్మకం

అమిత్ షా వ్యాఖ్య

దిల్లీ: 'అయోధ్య'లోని వివాదరహిత భూముల్ని అసలు యజమానులకు అప్పగించేందుకు అనుమతించాలని ఇటీవల మోదీ ప్రభుత్వం సుప్రీం కోర్టును అభ్యర్థించడాన్ని చరిత్రాత్మక పరిణామంగా భాజపా అధ్యక్షుడు అమిత్ షా వర్ణించారు. రామ మందిర నిర్మాణానికి అవరోధాలు కలిగించవద్దని ప్రతిపక్ష పార్టీలకు ఆయన విజ్ఞప్తి చేశారు. 75ఏళ్ల పైబడినవారికి పార్టీ టికెట్లు ఇస్తారా అన్న ప్రశ్నకు స్పందిస్తూ.. "పదవులను చేపట్టడంపైనే వయోపరిమితి ఉంది. టికెట్లు ఎవరికి ఇవ్వాలన్నది పార్టీ పార్లమెంటరీ బోర్డు నిర్ణయిస్తుంది" అని షా అన్నారు.

చిదంబరం ప్రాసిక్యూషన్‌కు అనుమతి

దిల్లీ: కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరానికి ఇబ్బందికర పరిస్థితి ఎదురయింది. చాలాకాలం నుంచి ఐఎన్‌ఎక్స్ మీడియా కేసులో ఆరోపణల్ని ఎదుర్కొంటున్న ఆయన్ని ప్రాసిక్యూట్ చేసేందుకు కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)కి ప్రభుత్వ అనుమతి లభించింది. ఐఎన్‌ఎక్స్ కేసులో చిదంబరం మీద- మోసం, అక్రమ నగదు చలామణి నేరాలను మోపి ప్రాసిక్యూట్ చేయడానికి అనుమతించాలని సీబీఐ కోరిన మీదట కేంద్ర న్యాయ మంత్రిత్వశాఖ ఆదివారం పచ్చజెండా చూపింది. ప్రశ్నించే నిమిత్తం చిదంబరాన్ని కస్టడీలో తీసుకోవాల్సిన అవసరం ఉందని సీబీఐ, ఈడీ గత నెల 25న దిల్లీ హైకోర్టుకు తెలిపాయి. ఎయిర్‌సెల్-మ్యాక్సిస్ కేసులో ఆయన్ని ప్రశ్నించేందుకు సీబీఐ ఇదివరకే అనుమతి పొందింది. మాజీ మంత్రి తనయుడు కార్తీ చిదంబరంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గతంలోనే అభియోగాలు మోపి, అరెస్టు చేయడమే కాకుండా దేశ విదేశాల్లో ఆయనకు చెందిన రూ.54 కోట్ల విలువైన ఆస్తుల్ని జప్తు చేసింది. ఐఎన్‌ఎక్స్ మీడియాలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు కేంద్ర అనుమతులు వచ్చేలా చేసేందుకు తండ్రి పలుకుబడిన అడ్డం పెట్టుకుని అవినీతికి పాల్పడ్డారనేది ఆయనపై ఉన్న అభియోగం.

ఈశాన్య ఆస్ట్రేలియాలో వరదలు

సిడ్నీ: ఆస్ట్రేలియాలోని ఈశాన్య ప్రాంతాన్ని వరదలు ముంచెత్తాయి. భారీ వర్షాల ధాటికి వీధులన్నీ నీటితో పొంగి పొర్లుతున్నాయి. క్వీన్స్‌లాండ్ రాష్ట్రంలోని టౌన్స్‌విల్ నగరంలో రహదారులు జలమయమై రాకపోకలకు వీలులేని పరిస్థితి ఏర్పడింది. విద్యుత్ నిలిచిపోవడంతో వేల ఇళ్లు అంధకారంలో ఉన్నాయి. టౌన్స్‌విల్‌కు ఉత్తరాన ఉన్న ఇంగ్హామ్ పట్టణంలో 24 గంటల వ్యవధిలో 506 మి.మీ.ల మేర వర్షపాతం నమోదైందని వాతావరణ సంస్థ అధికారులు చెప్పారు. వందేళ్లకు ఒక సారి మాత్రమే ఈ స్థాయి వర్షాలు పడుతుంటాయని తెలిపారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే 20వేల ఇళ్లు ముంపునకు గురయ్యే ప్రమాదముందని చెప్పారు. ముంపును అడ్డుకునేందుకు సైన్యం వేల సంఖ్యలో ఇసుక సంచులను బాధితులకు పంచుతోంది.



మాతృప్రేమ

ప్రాణం లేని కన్నబిడ్డను వదల్లేక....అలాగే వీపున మోసుకుంటూ....అలలతాకిడికి జారిపోకుండా కాపాడుకుంటూ...సముద్రంలో తిరుగాడుతున్న ఓ అమ్మడాల్ఫిన్ పరిస్థితి కంటతడిపెట్టించేలా ఉంది. న్యూజిలాండ్‌లోని బే ఆఫ్ ఐలండ్స్ వద్ద వీపు మీద పిల్లడాల్ఫిన్‌ను మోసుకుంటూ ఈదుతున్న అమ్మడాల్ఫిన్ సమాచారం అధికారులకు అందింది. ఆ తల్లి ...మధ్యమధ్యలో ప్రాణం లేని తన పిల్లను వదిలేసి కొంతదూరం సాటి డాల్ఫిన్ల బృందంతో ఈదుకుంటూ ముందుకెళ్లేది. ఆ తర్వాత మనసు చిక్కబట్టుకోలేక మళ్లీ తన వీపునెక్కించుకుని పిల్లతో సహా మళ్లీ నీళ్లలో ప్రయాణం సాగించేది. కన్నబిడ్డను వదల్లేక ఆ అమ్మమనసు పడుతున్న బాధను చూసిన అధికారులు ఆ ప్రాంతంలో పడవలను జాగ్రత్తగా నడపాలని సూచించారు.

– వెల్లింగ్‌టన్ (న్యూజిలాండ్)

యోగి హెలికాప్టర్‌కు అనుమతి నిరాకరణ

- **టెలిఫోన్ ద్వారా ప్రసంగించిన యూపీ ముఖ్యమంత్రి**

లఖ్‌నవూ, బేలూర్‌ఘాట్: ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ హెలికాప్టర్ దిగడానికి పశ్చిమబెంగాల్ ప్రభుత్వం అనుమతి నిరాకరించింది. ఫలితంగా ఆదివారం రెండుచోట్ల బహిరంగ సభల్లో ప్రసంగించాల్సిన యోగి.. టెలిఫోన్ ద్వారానే తన సందేశాన్ని ప్రజలకు వినిపించాల్సి వచ్చింది. దక్షిణ దినాజ్‌పూర్‌లోని బేలూర్‌ఘాట్, ఉత్తర దినాజ్‌పూర్‌లోని రాణిగంజ్‌లో భాజపా ఆధ్వర్యంలో నిర్వహించనున్న బహిరంగ సభల్లో యోగి ప్రసంగించడానికి పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తొలుత అంగీకరించింది. యోగి హెలికాప్టర్లు ఆయా ప్రదేశాల్లో దిగడానికి మాత్రం స్థానిక జిల్లాయంత్రాంగం అనుమతించలేదని యూపీ సీఎం కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ పరిణామంపై భాజపా తన అధికారిక సామాజిక మాధ్యమంలో స్పందిస్తూ 'దీదీ భయపడింది' అంటూ ఓ చిత్రాన్ని పోస్ట్ చేసింది. ఇందులో కర్ర చేబూనిన ఆదిత్యనాథ్.. మమతను తరుముతున్నట్లు ఉంది.

టెలిఫోన్ ద్వారా సభలను ఉద్దేశించి ప్రసంగించిన యోగి.. బెంగాల్ ప్రభుత్వానికి కౌంటింగ్ మొదలైందన్నారు. టీఎంసీ ప్రభుత్వం "ప్రజా-ప్రజాస్వామ్య" వ్యతిరేకమని అభివర్ణించారు. పశ్చిమబెంగాల్ భాజపా అధ్యక్షుడు కైలాశ్ విజయవర్గీయ స్పందిస్తూ "ఇదేం కొత్త కాదు. మేం ఎప్పుడు సభ నిర్వహించాలని ప్రయత్నించినా ఏదో ఒక ప్రతిబంధకం సృష్టిస్తున్నారు. ఇది సిగ్గుచేటు" అని విమర్శించారు.

రంగంలోకి తులసి గాబార్డ్

మాస్కో: అమెరికా అధ్యక్ష పదవికి తాను పోటీ పడనున్న విషయాన్ని డెమోక్రటిక్ నేత తులసి గాబార్డ్ అధికారికంగా ప్రకటించారు. అధ్యక్ష ఎన్నికల కోసం ప్రచార పర్వాన్ని ప్రారంభించారు. 'స్వదేశంలో, విదేశాల్లో శాంతిస్థాపన దిశగా ఉద్యమించేందుకు నాతో చేతులు కలపండి. అందరికీ స్వేచ్ఛ, న్యాయం, సమానత్వం, అవకాశాలు అందిస్తామంటూ అమెరికా చేసిన వాగ్దానం ఈ ఉద్యమంతో సాకారమవుతుంది. నేడు మా ప్రచార పర్వాన్ని మొదలుపెడుతున్నాం" అని ట్విటర్‌లో గాబార్డ్ పేర్కొన్నారు. అమెరికా ప్రస్తుత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై ఆమె విమర్శలు గుప్పించారు. ప్రభుత్వాల మార్పునకు వ్యతిరేకంగా గతంలో ప్రచారం చేసిన ట్రంప్.. ఇప్పుడు మాత్రం వెనెజువెలా, ఇరాన్‌లలో ప్రభుత్వాల మార్పిడి దిశగా ఒత్తిడి చేస్తున్నారంటూ మండిపడ్డారు.

మోదీ, మమతలను ఓడించండి

- **పిలుపు ఇచ్చిన లెఫ్ట్‌ఫ్రంట్**
- **మోదీ హయాంలో పెరిగిన మతతత్వం: ఏచూరి**
- **అన్ని వ్యవస్థల ధ్వంసం: సుధాకర్‌రెడ్డి**

కోల్‌కతా: కేంద్రంలో భాజపాను, రాష్ట్రంలో తృణమూల్ కాంగ్రెస్‌ను ఓడించాలని లెఫ్ట్‌ఫ్రంట్ పిలుపునిచ్చింది. రెండుచోట్ల అవినీతి రాజ్యమేలుతోందని, ప్రజాస్వామ్యం గొంతు నొక్కుతున్నారని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆరోపించారు. అవినీతిరహిత ప్రభుత్వాలు ఏర్పడాలంటే మోదీ, మమతా బెనర్జీలను సాగనంపాల్సిందేనన్నారు. బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొన్న లక్షల మందిని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. మోదీ హయాంలో మతతత్వం పెచ్చరిల్లిందన్నారు. మోదీ మిత్రులు రూ.15 లక్షల కోట్లు బ్యాంకులకు ఎగనామం పెట్టారని, కొందరు విదేశాలకు పారిపోయారని, అయినా వారిపై ఎలాంటి చర్య తీసుకోవడం లేదని ఆరోపించారు. తిరిగి భాజపాను ఎన్నికల్లో గెలిపించడానికి ఇలా దోపిడీ చేసిన డబ్బును విరాళాలు, బాండ్లరూపంలో కొంత వెనక్కి రప్పించనున్నారన్నారు. కేంద్ర ఆర్థికవిధానాలపై ప్రజల్లో ఆగ్రహం పెల్లుబికుతోందని సీపీఐ ప్రధాన కార్యదర్శి ఎస్.సుధాకర్‌రెడ్డి అన్నారు. "భాజపా ప్రభుత్వం ఇచ్చిన ఇతర హామీల్లాగే బడ్జెట్ కూడా ఓ పెద్ద అబద్ధం(జుమ్లా). దేశంలోని అన్ని వ్యవస్థలను ప్రభుత్వం నాశనం చేస్తోంది. పార్లమెంటు కూడా సరిగ్గా పనిచేయడం లేదు" అని వ్యాఖ్యానించారు.



బహిరంగ సభలో చేతులు కలిపిన బిమన్ బోస్, సురవరం సుధాకర్ రెడ్డి, సీతారాం ఏచూరి

మూడేళ్ల విరామం తరువాత వచ్చిన బుద్ధదేవ్ భట్టాచార్జీ

పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, కమ్యూనిస్టు దిగ్గజం బుద్ధదేవ్ భట్టాచార్జీ(74) మూడేళ్ల విరామం తరువాత ఆదివారం వామపక్షాలు నిర్వహించిన ఓ బహిరంగ సభలో పాల్గొన్నారు. సభా వేదికపై ఆయన ఆసీనులు కాకపోయినా, కారులోనే ఉండి సభ జరుగుతున్న తీరును గమనించారని లెఫ్ట్‌ఫ్రంట్ ఛైర్మన్ బిమన్‌బోస్ ప్రకటించారు. అనారోగ్యంతో బాధపడుతున్న బుద్ధదేవ్ కొంతసేపటి తరువాత సభ నుంచి వెళ్లిపోయారు.

అంధ ఓటర్లకు బ్రెయిలీ లిపిలో చీటీలు

దిల్లీ: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో అంధ ఓటర్లకు బ్రెయిలీ లిపిలో ఉన్న పోలింగ్ చీటీలు ఇవ్వాలని ఎన్నికల సంఘం (ఈసీ) నిర్ణయించింది. అందరికీ అందుబాటులో ఎన్నికలు అన్న విధానంలో భాగంగా దీన్ని అమలు చేయాలని అన్ని రాష్ట్రాల ఎన్నికల అధికారులను ఆదేశించింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బ్రెయిలీ లిపి చీటీలను ఉపయోగించారు. ఈవీఎంలను ఇప్పటికే అంధులు ఉపయోగించడానికి వీలుగా రూపొందించారు. అభ్యర్థుల పేర్లు, గుర్తులు బ్రెయిలీలోనే ఉంటాయి. బ్రెయిలీలో ఉండే ఓటరు గుర్తింపు కార్డులు కూడా ఇవ్వాలని ఈసీ భావిస్తోంది.

నాకేమైనా జరిగితే ప్రధానిదే బాధ్యత

అన్నా హజారే హెచ్చరిక

రాలేగాణ్ సిద్ధి, ముంబయి: ప్రముఖ సామాజిక ఉద్యమకారుడు అన్నా హజారే ప్రభుత్వానికి హెచ్చరికలు జారీ చేశారు. నిరాహార దీక్ష చేస్తున్న తనకు ఏమైనా జరిగితే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఇచ్చిన హామీలను కేంద్రప్రభుత్వం రానున్న కొన్నిరోజుల్లో నెరవేర్చకపోతే తన 'పద్మ భూషణ్'ను వెనక్కి ఇచ్చేస్తానని ప్రకటించారు. కేంద్రంలో లోక్‌పాల్, రాష్ట్రాల్లో లోకాయుక్తల ఏర్పాటును డిమాండ్ చేస్తూ మహారాష్ట్రలోని తన స్వగ్రామం రాలేగాణ్ సిద్ధిలో గత నెల 30 నుంచి అన్నా నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్నారు. గత ఐదు రోజుల్లో అన్నా 3.8 కిలోల బరువు తగ్గినట్లు వైద్యులు ఆదివారం వెల్లడించారు. రక్తపోటు, రక్తంలో చక్కెర నిల్వలు పెరిగాయని తెలిపారు. అన్నా దీక్షకు మద్దతుగా రాలేగాణ్ సిద్ధి గ్రామస్థులు ఆదివారం ఆందోళన చేపట్టారు. సుపా గ్రామం వద్ద అహ్మద్‌నగర్-పుణె రహదారిపై రాకపోకలను అడ్డుకున్నారు.



బిహార్‌లోని వైశాలి జిల్లాలో ఆదివారం సీమాంచల్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పడంతో పక్కకు పడిపోయిన పెట్టెలు.. సహాయక చర్యలు చేపడుతున్న సిబ్బంది

బిహార్‌లో పట్టాలు తప్పిన రైలు

- **ఆరుగురు దుర్మరణం**

సోన్‌పూర్ (బిహార్): విరిగిన పట్టాపై దూసుకువెళ్లిన సీమాంచల్ ఎక్స్‌ప్రెస్ ఆదివారం తెల్లవారుజామున బిహార్‌లోని వైశాలి జిల్లాలో పట్టాలు తప్పింది. ఈ దుర్ఘటనలో కనీసం ఆరుగురు ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. మరో 29 మంది గాయపడ్డారు. జోగ్‌బని నుంచి ఆనంద్‌విహార్ (దిల్లీ)కి వెళ్తున్న ఈ రైలుకు చెందిన 11 పెట్టెలు పట్టాల నుంచి పక్కకు పడిపోయాయి. తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో తామంతా గాఢనిద్రలో ఉన్నప్పుడు పెద్ద కుదుపుతో శబ్దం చేసుకుంటూ రైలు పెట్టెలు పడిపోవడంతో ఏం జరిగిందో అర్థం కాలేదని ప్రయాణికులు చెప్పారు. భారీ పేలుడు స్థాయిలో చప్పుడు రావడంతో ఉలిక్కిపడ్డామని, బెర్తుల మీద నుంచి కిందకి పడిపోయామని వారు పేర్కొన్నారు. తిరగబడిన పెట్టెల నుంచి బయటకు వచ్చేందుకు వారంతా ఇబ్బందులు పడ్డారు. ప్రమాదాన్ని బాంబు పేలుడుగా భావించిన సమీప గ్రామ ప్రజలు చిమ్మ చీకట్లోనే ప్రమాదస్థలికి వచ్చారు. అది రైలు ప్రమాదంగా గుర్తించి ప్రయాణికులకు సాయం చేశారు. సహాయక బృందాలు వచ్చేలోగానే స్థానికుల వద్ద ఉన్న గ్యాస్ కట్టర్లతో బోగీల నుంచి ప్రయాణికులను బయటకు తీసేందుకు కృషి చేశారు. ప్రైవేటు ఆసుపత్రులకు సమాచారం ఇచ్చి అంబులెన్సుల్ని వారే రప్పించారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించనున్నట్లు రైల్వే మంత్రిత్వ శాఖ తెలిపింది. తీవ్రంగా గాయపడినవారికి రూ.లక్ష చొప్పున, స్వల్పంగా గాయపడినవారికి రూ.50,000 వంతున అందిస్తామని ప్రకటించింది. ప్రమాదంపై విచారణకు ఆదేశించినట్లు తెలిపింది.

మోదీ, రాహుల్‌ల సంతాపం: రైలు ప్రమాదంలో ప్రాణనష్టంపై ప్రధాని మోదీ, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు మోదీ సంతాపం తెలిపి, క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.


పాక్ సైనికాధికారులపై వారెంట్లు

ముంబయి ఇద్దరు పాకిస్థాన్ సైనికాధికారులపై ముంబయి (26-11) ఉగ్ర దాడుల కేసులో బెయిల్‌కు వీల్లేని వారెంట్లు జారీ అయ్యాయి. పాక్ సైనిక మేజర్లు అబ్దుల్ రెహ్మాన్ పాషా, ఇక్బాల్‌లపై ముంబయి అదనపు సెషన్స్ కోర్టు ఈ వారెంట్లను జారీ చేసింది. పాషా పదవీ విరమణ చేయగా, ఇక్బాల్ పాక్ గూఢచర్య సంస్థ ఐఎస్‌ఐలో అధికారిగా కొనసాగుతున్నట్లు సమాచారం. ముంబయి నేర విభాగం పోలీసులు.. వీరిద్దరినీ వెతికిపట్టుకోవాల్సిన నిందితులుగా పేర్కొంటూ అభియోగపత్రం దాఖలు చేశారు. వీరిపై వారెంట్లు జారీ చేయాలని కోర్టుకు ప్రభుత్వ న్యాయవాది ఉజ్జ్వల్ నికమ్ విజ్ఞప్తి చేశారు. కేసులో సాక్షిగా మారిన నిందితుడు డేవిడ్ హెడ్లీ ఇచ్చిన వాంగ్మూలంతో దాడుల కుట్రలో పాషా, ఇక్బాల్‌ల పాత్రకు సంబంధించి మరిన్ని వివరాలు వెల్లడయ్యాయని అందులో పేర్కొన్నారు. కోర్టు ఈ అభ్యర్థనను ఆమోదించింది. ఉగ్ర దాడుల్లో పాక్‌లోని ముష్కర సంస్థలతోపాటు ఆ దేశ సైన్యానికి కూడా క్రియాశీల పాత్ర ఉందన్న భారత్ వాదనకు హెడ్లీ వాంగ్మూలం బలం చేకూర్చిందని ఉజ్జ్వల్ అన్నారు. 2008, నవంబర్ 26న 10 మంది పాకిస్థాన్ ఉగ్రవాదులు ముంబయికి చేరుకుని నగరంలోని వివిధ చోట్ల దాడులకు తెగబడిన సంగతి తెలిసిందే. 166 మంది ప్రజలను, 18 మంది భద్రత సిబ్బందిని వారు పొట్టనపెట్టుకున్నారు.

పద్మశ్రీ అవార్డు వెనక్కి

ఇంఫాల్: పౌరసత్వ సవరణ బిల్లు-2016కు వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనలకు సంఘీభావంగా మణిపుర్‌కు చెందిన ప్రఖ్యాత సినీ దర్శకుడు అరిబమ్‌శ్యామ్‌శర్మ(83) తన పద్మశ్రీ అవార్డును వెనక్కి ఇచ్చేస్తున్నట్లు ప్రకటించారు. ఇంఫాల్‌లోని తన నివాసంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మణిపుర్ ప్రజలు రక్షణ కోరుకుంటున్నారన్నారు. ఈశాన్యరాష్ట్రాల గోడును పట్టించుకోవడం లేదని ఆరోపించారు. భారతీయ సమాఖ్య అనేది రాష్ట్రాల కలయికతో ఏర్పడిందనేది మర్చిపోకూడదు. ఈశాన్య రాష్ట్రాలు ఉమ్మడిగా ఏదైనా కేంద్రానికి విన్నవిస్తే.. ప్రభుత్వం అంగీకరించాలి." అని అరిబమ్ వ్యాఖ్యానించారు.

36750 పైనే లాభాల జోరు



సమీక్ష : సానుకూల అంతర్జాతీయ సంకేతాలు, తాత్కాలిక బడ్జెట్ ప్రకటన నేపథ్యంలో గత వారం సూచీలు లాభాలతో ముగిశాయి. భవిష్యత్ రేట్ల పెంపుపై ఆచితూచి అడుగేయనున్నట్లు అమెరికా ఫెడరల్ రిజర్వ్ వెల్లడించడం, అంతర్జాతీయంగా మదుపర్ల సెంటిమెంట్‌ను బలోపేతం చేసింది. దేశీయ తయారీ పీఎంఐ గణాంకాలు ఇందుకు తోడయ్యాయి. అమెరికా- చైనాల మధ్య వాణిజ్య ఒప్పందం కుదరొచ్చన్న అంచనాలతో ప్రపంచ మార్కెట్లు సానుకూలంగా కదలాడాయి. దేశీయంగా కంపెనీల త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో.. షేరు ఆధారిత కదలికలు చోటుచేసుకున్నాయి. భారత తయారీ పీఎంఐ 53.2 శాతానికి చేరడం, వాహన సంస్థల విక్రయాలు మెరుగవ్వడం మెప్పించాయి. రెండు నెలల తర్వాత.. జనవరిలో జీఎస్‌టీ వసూళ్లు మళ్లీ రూ.లక్ష కోట్ల మైలురాయిని అధిగమించాయి. మొత్తం మీద ఈ పరిణామాలతో గత వారం సెన్సెక్స్ 1.2 శాతం పెరిగి 36,469 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 1 శాతం లాభంతో 10,894 పాయింట్ల దగ్గర స్థిరపడింది. ఐటీ, మన్నికైన వినిమయ వస్తువులు, వాహన షేర్లు రాణించగా, లోహ, చమురు-గ్యాస్, బ్యాంకింగ్ స్క్రిప్‌లు డీలాపడ్డాయి. విదేశీ సంస్థాగత మదుపర్లు (ఎఫ్ఐఐలు) నికరంగా రూ.4322 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేయగా, డీఐఐలు, ఫండ్ల కొనుగోళ్లు రూ.964 కోట్లుగా నమోదయ్యాయి.

లాభపడ్డ, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 4:5గా నమోదు కావడం.. చిన్న, మధ్య శ్రేణి షేర్లలో అప్రమత్తత కొనసాగడాన్ని సూచిస్తోంది.

ఈవారంపై అంచనా } గత వారం తీవ్ర ఒడుదొడుకులు ఎదుర్కొన్న మార్కెట్.. చివరకు లాభాలతో ముగిసింది. కీలక మద్దతు స్థాయి అయిన 35650- 35750 శ్రేణి దిగువకు చేరిన సెన్సెక్స్.. 35,375 స్థాయి వద్ద 5 వారాల కనిష్ఠానికి చేరింది. అనంతరం గట్టిగా పుంజుకుని 36,469 పాయింట్ల స్థాయికి పెరిగింది. కీలకమైన 36,750 స్థాయిని అధిగమిస్తే మార్కెట్ల లాభాలు కొనసాగొచ్చు. 35,750 పాయింట్ల స్థాయి దిగువకు చేరితే.. తిరిగి బలహీనపడే అవకాశం ఉంది.

ప్రభావిత అంశాలు } అంతర్జాతీయ సంకేతాలు, దేశీయ పరిణామాలు ఈ వారం మార్కెట్లకు దిశానిర్దేశం చేయనున్నాయి. దేశీయంగా చూస్తే.. ఆర్‌బీఐ ద్రవ్యపరపతి విధాన సమీక్షా సమావేశాలు కీలకం కానున్నాయి. ఆర్‌బీఐ గవర్నర్‌గా శక్తికాంత దాస్ పగ్గాలు చేపట్టాక, ఇదే తొలి పరపతి సమీక్ష కావడంతో మార్కెట్లు దృష్టి పెట్టాయి. ప్రభుత్వం ద్రవ్యలోటు లక్ష్యాన్ని అందుకోలేకపోవడంతో , ఈసారి పావు శాతం మేర రేట్ల కోత ఉండొచ్చన్న అంచనాలు ఉన్నాయి. మూడో త్రైమాసిక కంపెనీల ఫలితాలు సమీపకాలంలో మార్కెట్లకు కీలకం కానున్నాయి. ముడిచమురు ధరలు, డాలర్‌తో రూపాయి కదలికలు, ఎఫ్ఐఐ, డీఐఐల పెట్టుబడుల ధోరణి నుంచి మదుపర్లు సంకేతాలు అందిపుచ్చుకోవచ్చు. అంతర్జాతీయంగా చూస్తే.. అమెరికా- చైనా వాణిజ్య పరిణామాలు, ప్రపంచవ్యాప్త రాజకీయ వార్తలు మార్కెట్లపై ప్రభావం చూపొచ్చు. అమెరికా, చైనా, బ్రిటన్ ఆర్థిక గణాంకాలు, 7న వెలువడనున్న బీఓఈ వడ్డీ రేట్ల నిర్ణయాలపై మదుపర్లు ఓ కన్నేయొచ్చు.

తక్షణ మద్దతు స్థాయిలు: 35,953, 35,740, 35,375;
తక్షణ నిరోధ స్థాయిలు: 36,778, 36,945, 37,489

మార్కెట్లు 36,750 పాయింట్ల ఎగువకు చేరితే.. జోరు కొనసాగే అవకాశం ఉంది.

– సతీశ్ కంతేటి, జెన్ మనీ

నేటి బోర్డు సమావేశాలు: టాటా ఇన్వెస్ట్‌మెంట్, అబాన్ ఆఫ్‌షోర్, బలరామ్‌పూర్ చీనీ, బేయర్‌క్రాప్, ఎక్సెల్ ఇండస్ట్రీస్, ఫ్యూచర్ రిటైల్, ఐడీబీఐ బ్యాంక్, లక్ష్మీవిలాస్ బ్యాంక్, కేఈఐ ఇండస్ట్రీస్, రిలయన్స్ నావల్, స్టార్ సిమెంట్, టెక్స్‌మ్యాకో రైల్, వర్ల్‌పూల్





కోడిగుడ్లు

3న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)

హైదరాబాద్	397	వరంగల్	399
చిల్లరగా (ఒక గుడ్డు)	4.55	విశాఖపట్నం	400
బెంగళూరు	425	చెన్నై	435
4వ తేదీకి...		చిత్తూరు	428
విజయవాడ/గోదావరి	397	నమక్కల్	425

బడ్జెట్‌తో సూచీలు ముందుకు!

- ఆర్‌బీఐ పరపతి విధానంపైనా దృష్టి • సంస్థల ఆర్థిక ఫలితాలపైనా కన్ను • 10770-11100 శ్రేణిలో నిఫ్టీ
- ఎఫ్ఎమ్‌సీజీ, వాహన షేర్లకు సానుకూలతలు • యంత్ర పరికరాలు, సిమెంటు రంగాలూ పైకే

స్టాక్ మార్కెట్ ఈ వారం

దేశీయ సూచీలు ఈ వారం రాణించే అవకాశం ఉంది. తాత్కాలిక బడ్జెట్ నుంచి మదుపర్లు సంకేతాలు అందిపుచ్చుకుంటారని విశ్లేషకులు పేర్కొంటున్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నేతృత్వంలో మంగళవారం మొదలయ్యే మూడు రోజుల ద్రవ్య పరపతి విధాన సమీక్షను సైతం మదుపర్లు గమనించనున్నారు. 'అంచనాలకు అనుగుణంగా ఎన్నికలకు ముందు ప్రజాకర్షక పథకాలను ప్రభుత్వం ప్రకటించింది. ద్రవ్య లోటుపై భారీగా ప్రభావం చూపే అంశాలేవీ లేకపోవడం వల్ల మార్కెట్ సానుకూలంగానే స్పందించవచ్చ'ని ఓ బ్రోకరేజీ సంస్థ అంచనా వేస్తోంది. అయితే వచ్చే ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటు లక్ష్యమైన 3.4 శాతాన్ని సాధించడం ప్రభుత్వానికి కష్టమవుతుందని మూడీస్ ఇన్వెస్టర్స్ సర్వీసెస్ పేర్కొనడం ప్రభావం చూపొచ్చు. ఈ వారం ఫలితాలను వెలువరించే అదానీ పోర్ట్స్, బీపీసీఎల్, సిప్లా, గెయిల్ ఇండియా, గ్రాసిమ్ ఇండస్ట్రీస్, హెచ్‌పీసీఎల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఎంఅండ్ఎం, టాటా మోటార్స్, టెక్ మహీంద్రాలపై మదుపర్లు దృష్టి సారించే అవకాశం ఉంది. నిఫ్టీ 10770-11100 శ్రేణిలో కదలాడొచ్చని సాంకేతిక నిపుణులు అంటున్నారు. వివిధ రంగాలపై విశ్లేషకులు ఏమంటున్నారంటే..

- బుధవారం వెలువడే వొడాఫోన్ ఐడియా ఫలితాలపై **టెలికాం** షేర్ల కదలికలు ఆధారపడి ఉంటాయి. గత వారం వెలువడ్డ భారతీ ఎయిర్‌టెల్ ఫలితాల తరహాలోనే ఈ కంపెనీ కూడా వినియోగదారు సగటు ఆదాయంలో వృద్ధి నమోదు చేస్తుందన్న అంచనాలున్నాయి.
- మంగళవారం వెలువడే బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ ఫలితాలపై మదుపర్లు దృష్టి సారించే అవకాశం ఉంది. ప్రభుత్వ రంగ **చమురు** కంపెనీల షేర్లు ఈ వారం స్థిరీకరణకు లోనయ్యే అవకాశం ఉంది.
- **యంత్ర పరికరాల** షేర్లు ఈ వారం లాభాలు కొనసాగించే అవకాశం ఉంది. ఎల్ అండ్ టీ ఫలితాలు అంచనాలను మించడం ఇందుకు నేపథ్యం.
- **వాహన** రంగ కంపెనీలు ఈ వారం రాణించే అవకాశం ఉంది. కేంద్ర బడ్జెట్‌లో రైతులకు పీఎమ్ కిసాన్ పథకాన్ని ప్రకటించడం ఇందుకు నేపథ్యం. జనవరి నెల వాహన విక్రయాల గణాంకాలు కూడా ప్రభావం చూపొచ్చు. జనవరిలో ప్రయాణికుల కార్ల విక్రయాలు 4% తగ్గడం తెలిసిందే.
- మూలధన నిధులు లభించవచ్చన్న అంచనాల మధ్య ఈ వారం **బ్యాంకు** షేర్లు రాణించవచ్చు. పీఎన్‌బీ, ఐడీబీఐ బ్యాంక్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌ల ఫలితాలను గమనించవచ్చు.
- **ఔషధ** రంగ కంపెనీల షేర్లు రాణించే అవకాశం ఉంది. లుపిన్, సిప్లా ఫలితాలపై మదుపర్లు దృష్టి సారించవచ్చు.
- దేశవ్యాప్తంగా **సిమెంటు** బస్తా ధర రూ.5-50 మేర పెరగొచ్చన్న అంచనాల మధ్య సిమెంటు కంపెనీల షేర్లు ఈ వారం రాణించే అవకాశం ఉంది.
- గత వారం రాణించిన **ఐటీ** రంగ షేర్ల నుంచి ఈ వారం మదుపర్లు లాభాలు స్వీకరించే అవకాశం ఉంది. మంగళవారం ఫలితాలు వెల్లడయ్యే టెక్ మహీంద్రాపై మదుపర్లు కన్నేయవచ్చు.
- డిసెంబరు త్రైమాసిక ఫలితాల నుంచి **లోహ** రంగ షేర్లు సంకేతాలు అందిపుచ్చుకోవచ్చు. జేఎస్‌డబ్ల్యూ స్టీల్ బుధవారం వెలువరించే ఫలితాల్లో అంతక్రితం త్రైమాసికంతో పోలిస్తే 17 శాతం ఎక్కువగానే ఏకీకృత నికర లాభం నమోదు చేయవచ్చని అంచనా.
- బడ్జెట్‌లో ప్రకటించిన పీఎమ్ కిసాన్ పథకం; పన్ను ప్రయోజనాల వంటివి **ఎఫ్ఎమ్‌సీజీ** రంగ సెంటిమెంటును మెరుగుపరచాయి. వీటి వల్ల గ్రామీణ గిరాకీ పెరిగి, వినియోగ ఉత్పత్తుల కంపెనీల విక్రయాలు మెరుగవుతాయన్న అంచనాలున్నాయి.

సిమెంట్	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
ఏసీసీ	1,415.55	1,468.40	1,374.90
అంబుజా సిమెంట్స్	212.50	218.20	206.70
ఇండియా సిమెంట్స్	81.35	88.60	76.40
శ్రీ సిమెంట్	15,782.00	16,380.70	15,300.70
అల్ట్రాటెక్ సిమెంట్	3,483.65	3,582.00	3,396.90

ఐటీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌సీఎల్ టెక్	1,043.85	1,074.30	995.30
ఇన్ఫోసిస్	757.05	772.70	736.70
టీసీఎస్	2,029.95	2,057.60	1,984.30
టెక్ మహీంద్రా	746.60	764.30	719.10
విప్రో	371.55	378.10	360.20

ఎఫ్ఎమ్‌సీజీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
బ్రిటానియా ఇండస్ట్రీస్	3251.00	3331.00	3161.00
కోల్గేట్ పామోలివ్	1293.45	1323.80	1267.50
డాబర్ ఇండియా	451.85	464.40	435.10
హెచ్‌యూఎల్	1799.30	1868.80	1726.70
ఐటీసీ	280.85	287.80	275.60
మారికో	376.45	385.90	362.60

లోహ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హిందాల్కో ఇండస్ట్రీస్	211.40	217.90	200.20
జిందాల్ స్టీల్	129.70	141.10	122.60
జేఎస్‌డబ్ల్యూ స్టీల్	274.95	287.20	260.50
సెయిల్	46.25	48.80	44.60
టాటా స్టీల్	474.70	487.60	463.60
వేదాంతా	162.15	188.60	144.90

టెలికాం	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భారతీ ఎయిర్‌టెల్	311.85	328.50	296.70
ఆర్‌కామ్	11.60	12.30	11.10
రిలయన్స్ ఇండస్ట్రీస్	1249.95	1272.00	1216.10
వొడాఫోన్ ఐడియా	30.90	32.10	29.60

చమురు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
బీపీసీఎల్	341.00	353.00	332.40
హెచ్‌పీసీఎల్	234.00	240.30	226.40
ఐఓసీ	137.20	139.60	134.90
ఓఎన్‌జీసీ	141.80	145.10	138.10
ఆయిల్ ఇండియా	171.55	174.80	166.00

యంత్రపరికరాలు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భెల్	64.35	66.60	62.50
సీజీ పవర్	38.00	39.50	36.40
ఎల్ అండ్ టీ	1324.60	1345.60	1302.50
థెర్మాక్స్	1095.75	1111.00	1071.50
సీమెన్స్	1031.10	1056.00	1007.80

వాహన	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
ఐషర్ మోటార్స్	19,663.40	20,696.70	18,559.40
హీరో మోటోకార్ప్	2,807.25	2,971.60	2,542.90
ఎం అండ్ ఎం	688.40	729.60	659.90
మారుతీ సుజుకీ	6,962.30	7,491.10	6,388.20
టాటా మోటార్స్	181.65	188.70	176.00
టీవీఎస్ మోటార్	516.65	547.60	485.60

బ్యాంకింగ్	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	2090.45	2135.10	2054.30
ఐసీఐసీఐ బ్యాంక్	354.65	372.30	340.00
ఐడీఎఫ్‌సీ బ్యాంక్	47.05	47.60	46.50
ఇండస్ఇండ్ బ్యాంక్	1515.15	1554.30	1477.30
ఎస్‌బీఐ	284.40	310.40	269.00
యెస్ బ్యాంక్	185.60	204.00	172.10

ఫార్మా	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అరబిందో ఫార్మా	797.80	815.30	771.30
డాక్టర్ రెడ్డీస్	2791.25	2879.00	2671.30
గ్లెన్‌మార్క్ ఫార్మా	661.85	676.30	639.30
లుపిన్	883.10	898.20	862.80
సన్ ఫార్మా	423.25	433.80	411.80
వోకార్డ్	449.75	464.30	431.30

అమెజాన్ ప్యాంట్రీ ఆగింది

ఎఫ్‌డీఐ కొత్త నిబంధనల ఫలితమే

దిల్లీ: ఇ కామర్స్ పోర్టళ్లలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ)కు సంబంధించి, ఈనెల 1 నుంచి దేశీయంగా అమల్లోకి వచ్చిన కొత్త నిబంధనల ప్రభావం అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లపై భారీగానే పడింది. అమెజాన్ దేశీయ విభాగమైన అమెజాన్.ఇన్‌లో, నిత్యావసరాలు సరఫరాకు ఉద్దేశించిన అమెజాన్ ప్యాంట్రీ సేవలు కూడా ప్రస్తుతానికి దేశీయంగా నిలిచిపోయాయి. దీంతోపాటు మొబైల్ విడిభాగాలు, బ్యాటరీలు సహా ఇతర ఉత్పత్తులను పెద్దఎత్తున జాబితా నుంచి అమెజాన్.ఇన్ తొలగించింది. దేశీయ విపణిలోకి దీర్ఘకాల దృక్పథంతో ప్రవేశించిన అమెజాన్, 5 బిలియన్ డాలర్ల (సుమారు రూ.35,000 కోట్ల) పెట్టుబడులు పెట్టాలన్న ప్రణాళికకు కట్టుబడి ఉందని అమెజాన్ ముఖ్య ఆర్థిక అధికారి (సీఎఫ్ఓ) బ్రెయిన్ ఒసావ్‌స్కై తెలిపారు. అయితే ప్రస్తుతం ప్రభుత్వ తాజా నిబంధనల వల్ల ఇ కామర్స్ రంగంపై పడే ప్రభావం విషయంలో అనిశ్చితి నెలకొందని, పరిస్థితిని అధ్యయనం చేస్తున్నామని వివరించారు.

35 సీపీఎస్ఈల్లో వాటా విక్రయం

దిల్లీ: మొత్తం 35 కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ (సీపీఎస్ఈ)ల్లో వ్యూహాత్మక వాటా విక్రయానికి ఆర్థిక శాఖ రంగం సిద్ధం చేస్తోంది. ప్రస్తుతం పవన్‌హాన్స్‌లో వాటా విక్రయ ప్రక్రియ కొనసాగుతోంది. సీపీఎస్ఈల్లో వ్యూహాత్మక వాటా విక్రయ ప్రక్రియ వేగవంతం అయ్యేలా ముందుకెళ్లబోతున్నామని పెట్టుబడులు, ప్రజా ఆస్తుల నిర్వహణ విభాగం (దీపమ్) కార్యదర్శి అతాను చక్రవర్తి తెలిపారు. ఇప్పటికే అనుమతులు పొందిన జాబితాలో హిందుస్థాన్ ఫ్లోరోకార్బన్, హిందుస్థాన్ న్యూస్ ప్రింట్, హెచ్ఎల్ఎల్ లైఫ్ కేర్, సెంట్రల్ ఎలక్ట్రానిక్స్, బ్రిడ్జ్ అండ్ రూఫ్ ఇండియా, ఎన్ఎండీసీకి చెందిన నగార్నార్ స్టీల్ ప్లాంట్, ఐటీడీసీకి చెందిన సిమెంట్ కార్పొరేషన్ తదితర సంస్థలున్నాయి.

ఐటీ రిటర్నుల కేసులన్నీ ఆన్‌లైన్‌లోనే!

- వ్యక్తిగత హాజరు అవసరం లేదు • సీబీడీటీ ఛైర్మన్ సుశీల్ చంద్ర



దిల్లీ: ఆదాయపు పన్ను (ఐటీ) రిటర్నుల మదింపు ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్‌లోనే జరగబోతోంది. రెండేళ్లలో ఇది పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుందని కేంద్రీయ ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) ఛైర్మన్ సుశీల్ చంద్ర అభిప్రాయపడ్డారు. ఐటీ కేసుల్ని పరిష్కరించేందుకు అనుసరిస్తున్న ప్రక్రియల్ని సులభతరం చేసేందుకు బెంగళూరులోని సెంట్రలైజ్డ్ ప్రాసెసింగ్ సెంటర్ (సీపీసీ)లో 'సీపీసీ 2.0'ను ఏర్పాటు చేశాం. దీని ద్వారా గత ఏడాది సుమారు 2.06 లక్షల కేసుల్ని ఆన్‌లైన్‌లోనే పరిష్కరించాం. రిటర్ను ప్రక్రియను సులభతరం చేసేందుకు.. 'మూలంలో పన్ను కోత (టీడీఎస్)కు అనుసరించిన విధానం ఆధారంగా పన్ను చెల్లింపుదార్లకు, వారి వివరాలు ముద్రించిన ప్రీ-ఫిల్డ్ రిటర్ను దరఖాస్తు పంపిస్తున్నాం. తదుపరి వారి నుంచి వచ్చిన వివరాలు సంతృప్తికరంగా అనిపిస్తే ఆ రిటర్నులను ఆమోదిస్తున్నాం. లేదంటే పరిశీలనకు పంపుతున్నామ'ని సుశీల్ చంద్ర వివరించారు.

- ✦ సీపీసీ 2.0కు సాంకేతిక సహకారం అందిస్తున్న సంస్థతో ప్రస్తుతం చర్చలు జరుపుతున్నాం. 24 గంటల్లో మదింపు ప్రక్రియ పూర్తయి పన్ను చెల్లింపుదారుడికి రిఫండ్ ఇచ్చేలా వీలవుతుందేమో చూడమంటున్నాం. ఈ వ్యవస్థ బహుశా రెండేళ్లలో అందుబాటులోకి రావచ్చని అనుకుంటున్నాం. ఇది జరిగితే, పన్ను చెల్లించే వారి సంఖ్య మరింత పెరుగుతుందని భావిస్తున్నాం.
- ✦ ప్రస్తుతం చాలా తక్కువ ఐటీ రిటర్నుల (0.46 శాతం) విషయంలో పరిశీలన (స్క్రూటినీ) అవసరమవుతోంది. దాదాపు 99.54 శాతం ఐటీ రిటర్నులు సవ్యంగానే ఉంటుండటంతో వాటిని ఆమోదిస్తున్నాం.
- ✦ గత ఏడాది కాలంలో దాదాపు 2.06 లక్షల రిటర్నుల మదింపుల్ని వ్యక్తుల హాజరు అవసరం లేకుండానే (ఫేస్‌లెస్ విధానం) పూర్తి చేశాం. రాబోయే రోజుల్లో దీన్ని మరింత మెరుగుపరుస్తాం. వచ్చే కొన్నేళ్లలో అన్ని ఐటీ రిటర్నుల మదింపులు, పరిశీలనలు పూర్తిస్థాయిలో వ్యక్తుల అవసరం లేకుండానే నిర్వహిస్తాం.
- ✦ సగటు పన్ను చెల్లింపుదారుడి రిటర్నులను ఇకపై రెండు దశల్లో ఆమోదించబోతున్నాం. తొలి దశలో ధ్రువీకరణ మాత్రమే చేస్తాం. పన్ను మదింపు అధికారి (అసెసింగ్ ఆఫీసర్) రెండో దశలో దాన్ని ఆమోదిస్తారు. ఇందుకోసం సీబీడీటీ ఓ విధానాన్ని రూపొందిస్తోంది.
- ✦ పన్ను చెల్లింపుదారుడి టీడీఎస్ గురించి మాకున్న సందేహం మేరకు వారి స్పందన కోరుతూ మెయిల్ పంపిస్తాం. దానికి వారు ఆన్‌లైన్‌లోనే స్పందించాలి. దీనిపై తదుపరి పరిశీలన అవసరం లేదని మా బృందం భావిస్తే మదింపు ప్రక్రియ పూర్తి చేస్తుంది. ఒకవేళ పరిశీలన అవసరమైతే ఆన్‌లైన్‌లోనే వారిని వివరాలు కోరడం జరుగుతుంది. దానికి స్పందించి పన్ను చెల్లింపుదారుడు పూర్తి వివరాలు పంపితే, వాటిని పరిశీలించి డిక్లరేషన్ జారీ చేస్తాం.

నలుగురు ఫండ్ సీఈఓలు, రేటింగ్ సంస్థ అధిపతికి సెబీ సమన్లు

జీ ఎంటర్‌టైన్‌మెంట్ కేసు

దిల్లీ: జీ ఎంటర్‌టైన్‌మెంట్ కేసులో మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ దర్యాప్తు సాగుతోంది. బిర్లా మ్యూచువల్ ఫండ్, ఐసీఐసీఐ మ్యూచువల్ ఫండ్, హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్, రిలయన్స్ మ్యూచువల్ ఫండ్ సీఈఓలతో పాటు రేటింగ్ సంస్థ బ్రిక్‌వర్క్స్ సీఈఓకు సెబీ సభ్యుడు మదాబీ పూరి సమన్లు జారీ చేశారు. నేడు వీరిని విచారించే అవకాశం ఉంది. గత నెల 27న రుణదాతలతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు జీ ఛైర్మన్ సుభాష్ చంద్ర పేర్కొన్నారు. ఆ తర్వాత రోజు 96-97 శాతం మంది రుణదాతలు ఒప్పందానికి ఆమోదం తెలిపారని ఆయన కుమారుడు అన్నారు. ఆ తర్వాత షేరు రూ.310 నుంచి రూ.380కు పెరిగింది. అయితే గత శుక్రవారం నాటికి ఎటువంటి ఒప్పందం కుదరలేదని స్పష్టమైంది. ఈ నేపథ్యంలో ఇద్దరు రుణదాతలు షేర్లను సైతం విక్రయించారు. దీంతో జనవరి 27, 28న సుభాష్ చంద్ర, ఆయన కుమారుడు చేసిన ప్రకటనలు మోసపూరితంగా, తప్పుదోవ పట్టించేవిగా ఉన్నట్లు సెబీ అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో సెబీ కఠిన చర్యలు చేపట్టనుంది.

స్పెక్ట్రమ్ వాపసు ఇస్తాం: టాటా టెలీ

దిల్లీ: వేలం నిర్వహించకనే, 15 సర్కిళ్లలో తమకు కేటాయించిన స్పెక్ట్రమ్‌ను వాపసు ఇచ్చేస్తామని ప్రభుత్వానికి టాటా టెలీ ప్రతిపాదించింది. భారతీ ఎయిర్‌టెల్‌లో విలీనానికి ముందే ఇలా చేస్తామని టెలికాం విభాగానికి తెలిపింది. 800-1800-2100 మెగాహెర్ట్జ్ విభాగాల్లో మొత్తం 19 సర్కిళ్లకు సంబంధించి 178 మెగాహెర్ట్జ్ స్పెక్ట్రమ్‌ను టాటా టెలీ కలిగి ఉంది. ఇందులో 71.3 మెగాహెర్ట్జ్ స్పెక్ట్రమ్‌ను మాత్రమే మార్కెట్ ధర చెల్లించకుండా ఎయిర్‌టెల్‌కు బదలాయించే వీలుంది. 800 మెగాహెర్ట్జ్‌ను 4జీ సేవల కోసం వినియోగించే వీలుంది. 2జీ సేవల కోసమే వినియోగించే స్పెక్ట్రమ్‌ను ఎయిర్‌టెల్‌కు బదలాయించే వీలు లేదు. వేలం నిర్వహించకుండా కేటాయించిన 4జీ సేవల స్పెక్ట్రమ్‌ను కనుక ఎయిర్‌టెల్‌కు బదిలీ చేయాలంటే, ప్రస్తుత మార్కెట్ ధరను టాటా టెలీ చెల్లించాల్సి వస్తుంది.

ఎన్‌సీఎల్‌టీకి ఆర్‌కామ్

దిల్లీ: జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)కు రుణ పరిష్కార ప్రణాళిక ప్రతిపాదన సమర్పించనున్నట్లు రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) తెలిపింది. ప్రస్తుతం కోర్టు వెలుపల అమలు చేస్తున్న ఆస్తుల విక్రయ ప్రణాళిక మాదిరిగానే ఇది ఉంటుందని వెల్లడించింది. దివాలా పరిష్కార ప్రక్రియకు వెళ్లడానికి అనిల్ అంబానీ నేతృత్వంలోని ఆర్‌కామ్ గత వారం నిర్ణయించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆర్‌కామ్ ఆస్తుల విక్రయానికి 100% రుణదాతల అనుమతి లభించడం సవాలుగా మారింది. కంపెనీ ఆస్తుల విక్రయానికి టెలికమ్యూనికేషన్ల విభాగం (డాట్), టీడీశాట్, పలు కోర్టుల వద్ద న్యాయపరమైన సమస్యలు తలెత్తాయి. ఎన్‌సీఎల్‌టీ 66 శాతం మెజారిటీ నిబంధనతో తమకు 100 శాతం అనుమతులు లభిస్తాయని కంపెనీ భావిస్తోంది.

కార్పొరేషన్ బ్యాంక్ సీఈఓగా భారతి

మంగళూరు: కార్పొరేషన్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్, ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈఓ)గా పీవీ భారతి బాధ్యతలు స్వీకరించారు. కార్పొరేషన్ బ్యాంక్ పగ్గాలు చేపట్టిన తొలి మహిళ భారతీనే కావడం గమనార్హం. ఇంతకు ముందు ఆమె కెనరా బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా వ్యవహరించారు. కెనరా బ్యాంక్ జనరల్ మేనేజర్ (నష్ట నిర్వహణ విభాగం)గా 2016 సెప్టెంబరు నుంచి పనిచేశారు.

నారాయణా హృదయాలయ గ్రూప్ ఎండీగా రూపర్ట్

దిల్లీ: నారాయణా హృదయాలయ గ్రూప్ సీఈఓ, ఎండీ అశుతోశ్ రఘువంశీ రాజీనామా చేశారు. అశుతోశ్ రాజీనామాను కంపెనీ బోర్డు ఆమోదించింది. కొత్త ఎండీ, సీఈఓగా ఎమ్మాన్యుయేల్ రూపర్ట్‌ను నియమిస్తున్నట్లు సంస్థ ఎక్స్ఛేంజీలకు ఇచ్చిన సమాచారంలో పేర్కొంది. సంస్థ వ్యవస్థాపక సభ్యుల్లో రూపర్ట్ ఒకరు. గ్రూప్ సీఓఓగా వీరేన్ శెట్టిని నియమించారు.

పసిడి స్థిరీకరణ!


కమొడిటీస్ ఈ వారం

● బంగారం, వెండి



పసిడి ఏప్రిల్ కాంట్రాక్టు గత వారం రూ.32,500 వద్ద సానుకూలంగా ప్రారంభమైంది. ఆ తర్వాత రూ.32,822 వద్ద బ్రేకవుట్ కోసం మదుపర్లు ఎదురుచూశారు. ఊహించినట్లుగానే ఆ స్థాయిని కాంట్రాక్టు అధిగమించి రూ.33,445 వద్ద వారం గరిష్ఠ స్థాయిని చేరింది. కొంత కాలం పాటు వడ్డీ రేట్ల పెంపు జోలికి వెళ్లబోమంటూ అమెరికా ఫెడరల్ రిజర్వ్ ఇచ్చిన సంకేతాలు ఇందుకు దోహదం చేశాయి. దీంతో వారం మొత్తం మీద కాంట్రాక్టు 2.82% లాభంతో రూ.33,416 వద్ద ముగిసింది. పసిడి కాంట్రాక్టు మరింత పెరిగేందుకు అవకాశం ఉన్నప్పటికీ.. ఈవారాన్ని స్థిరీకరణతో ప్రారంభించొచ్చని భావిస్తున్నాం. మధ్య, దీర్ఘకాలానికి కాంట్రాక్టు పెరిగినప్పుడల్లా షార్ట్ పొజిషన్లు జత చేసుకోవడం మంచిది. అయితే రూ.33,741 ఎగువన ఈ వ్యూహాన్ని అమలుచేయాలి. వెండి మార్చి కాంట్రాక్టు గతవారం రూ.39,885 వద్ద ఆరంభమైంది. అనంతరం అమ్మకాల ఒత్తిడికి లోనై రూ.39,665 స్థాయికి దిగివచ్చింది. ఆ తర్వాత కొనుగోళ్ల దన్నుతో పుంజుకుని రూ.40,786 వద్ద వారం గరిష్ఠ స్థాయిని చేరింది. ఆఖరుకు 1.74 శాతం లాభంతో రూ.40,580 వద్ద స్థిరపడింది. ఈవారం రూ.39,901 కంటే దిగువన ట్రేడ్ కాకుంటే లాంగ్ పొజిషన్లు కొనసాగించడం మంచిది. ఒకవేళ ఇప్పటికే లాంగ్ పొజిషన్లుంటే రూ.41,022- 41,464 మధ్య లాభాలు స్వీకరించడం ఉత్తమం. షార్ట్ పొజిషన్లు ఉన్నవాళ్లు రూ.41,804 వద్ద స్టాప్‌లాస్ పెట్టుకుని వాటిని కొనసాగించొచ్చు.

● ప్రాథమిక లోహాలు



రాగి ఫిబ్రవరి కాంట్రాక్టు సాంకేతికంగా సానుకూలంగా కనిపిస్తోంది. ఈరోజు రూ.439.30 కంటే పైన ముగిస్తే.. కాంట్రాక్టు మరింత ముందుకెళ్లే అవకాశం ఉంటుంది. ఒకవేళ ఈ స్థాయి దిగువకే పరిమితమైతే అమ్మకాల ఒత్తిడి ఎదురవ్వొచ్చు. గతవారం షార్ట్ పొజిషన్లు తీసుకుంటే రూ.445.60 దిగువకు స్టాప్‌లాస్ సవరించుకోవాలి. సీసం ఫిబ్రవరి కాంట్రాక్టుకు సంబంధించి రూ.153 దరిదాపులో లాభాలు స్వీకరించడం మంచిది. జనవరి ఫ్యూచర్ కాంట్రాక్టు గడువు తీరిపోనున్న నేపథ్యంలో కొంత అమ్మకాల ఒత్తిడికి అవకాశం ఉండటమే ఇందుకు కారణం. లాంగ్ పొజిషన్లున్న ట్రేడర్లు రూ.146 వద్ద తప్పక స్టాప్‌లాస్ పరిగణించాలి. జింక్ ఫిబ్రవరి కాంట్రాక్టు ఈవారం సానుకూలంగా కదలాడొచ్చు. ప్రస్తుత స్థాయిల వద్ద కొనుగోళ్లకు మొగ్గు చూపొచ్చు. అయితే జనవరి కాంట్రాక్టు గడువు తీరిపోనున్న దృష్ట్యా అమ్మకాల ఒత్తిడికి ఆస్కారం ఉన్నందున, రూ.194.55 వద్ద స్టాప్‌లాస్ పెట్టుకోవడం మంచిది. అల్యూమినియం ఫిబ్రవరి కాంట్రాక్టు ఈ రోజు రూ.135 కంటే పైన నిలదొక్కుకుంటే, సానుకూలంగా కదలాడొచ్చు. అందువల్ల రూ.133.05 వద్ద స్టాప్‌లాస్ పెట్టుకుని రూ.135.95 ఎగువన లాంగ్‌పొజిషన్లు తీసుకోవడం మంచి వ్యూహం అవుతుంది. నికెల్ ఫిబ్రవరి కాంట్రాక్టు గత మూడు వారాల్లో 8 శాతానికి పైగా పెరిగినందున రూ.962 స్థాయికి దరిదాపులో లాభాలు స్వీకరించడం మంచిది.

గతవారం పొజిషన్లు ఇలా

కమొడిటీ	ప్రారంభం	ముగింపు	వృద్ధి/(క్షీణత)
	(రూ.లలో)		(శాతంలో)
రాగి (ఫిబ్రవరి)	427.45	438.70	2.63
సీసం (ఫిబ్రవరి)	149.25	151.65	1.64
జింక్ (ఫిబ్రవరి)	190.70	199.50	4.61
అల్యూమినియం (ఫిబ్రవరి)	134	134.30	0.22
నికెల్ (ఫిబ్రవరి)	843.20	906.10	7.46
ముడి చమురు (ఫిబ్రవరి)	3,802	3,970	4.42
సహజ వాయువు (ఫిబ్రవరి)	216	196.80	(8.89)
సీపీఓ (జనవరి)	563.90	566.50	0.46

● ఇంధన రంగం



ముడి చమురు ఫిబ్రవరి కాంట్రాక్టు ఈవారం రూ.4,085 కంటే పైన కదలాడితే మరింత రాణించేందుకు అవకాశం ఉంటుంది. రూ.4,143 వరకు వెళ్లొచ్చు. సహజ వాయువు ఫిబ్రవరి కాంట్రాక్టుకు వాతావరణ అంచనాలు దిశానిర్దేశం చేస్తాయి. ఈ అంచనాల్లో ఏమైనా మార్పులు చోటుచేసుకుంటే, కాంట్రాక్టుకు సమీపకాలంలో ఒడుదొడుకులు ఎదురుకావచ్చు. సాంకేతికంగా ఓవర్‌సోల్డ్ పరిధిలో ఉన్నందున.. ధర తగ్గినప్పుడల్లా కొనుగోలు చేసే వ్యూహంతో ముందుకెళ్లొచ్చు. ముడి పామోలిన్ నూనె (సీపీఓ) ఫిబ్రవరి కాంట్రాక్టు ఈవారం కూడా పెరిగేందుకు అవకాశం ఉంది. అయితే సమీప నిరోధ స్థాయి వద్ద అమ్మకాల ఒత్తిడి ఎదురుకావచ్చు. అందువల్ల లాభాలు స్వీకరించడం మంచిది.

– ఆర్ఎల్‌పీ కమొడిటీ అండ్ డెరివేటివ్స్

ఛాంపియన్



న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌లో భారత్‌కు అదిరే ముగింపు. ఆఖరిదైన ఐదో వన్డేలో ఆల్‌రౌండ్ ప్రదర్శన చేసిన టీమ్‌ఇండియా ఆతిథ్య జట్టుకు పంచ్ ఇచ్చింది. అంబటి రాయుడు (90; 113 బంతుల్లో 8×4, 4×6) సమయోచిత ఇన్నింగ్స్ ఆడుకోవడంతో న్యూజిలాండ్‌తో ఐదో వన్డేలో భారత్ 35 పరుగుల తేడాతో గెలిచి సిరీస్‌ను 4-1తో ముగించింది. రాయుడితో పాటు ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య (45; 22 బంతుల్లో 2×4, 5×6) చెలరేగి ఆడాడు. రాయుడికి 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్', షమికి 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' లభించాయి. మూడు టీ20ల సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్ బుధవారం జరగనుంది.

ఆఖరి పంచ్ అదిరేలా..

రాణించిన రాయుడు, పాండ్య

ఐదో వన్డేలో కివీస్‌పై భారత్ గెలుపు • 4–1తో సిరీస్ కైవసం

వెల్లింగ్టన్

న్యూజిలాండ్‌తో నాలుగో వన్డేలో అనూహ్యంగా కుప్పకూలి.. దారుణ పరాజయం చవిచూసిన భారత్.. ఐదో వన్డేలో బదులు తీర్చుకుంది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో టీమ్‌ఇండియా 35 పరుగుల తేడాతో కివీస్‌ను ఓడించింది. మొదట బ్యాటింగ్ చేసిన భారత్ 49.5 ఓవర్లలో 252 పరుగులు చేసింది. చాహల్ (3/41), షమి (2/35), పాండ్య (2/50) విజృంభించడంతో ఛేదనలో న్యూజిలాండ్ 44.1 ఓవర్లలో 217 పరుగులకే ఆలౌటైంది.

18 పరుగులకే 4 వికెట్లు..: స్వింగ్‌కు అనుకూలిస్తున్న పిచ్‌పై టాస్ గెలిచి అనూహ్యంగా బ్యాటింగ్ ఎంచుకున్నాడు కెప్టెన్ రోహిత్‌శర్మ. హెన్రీ (4/35), బౌల్ట్ (3/39) విజృంభించడంతో భారత్ 18 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిపోయింది. హెన్రీ వేసిన బంతి స్వింగ్ అయి రోహిత్ (2) వికెట్లను కూల్చగా.. బౌల్ట్ బౌలింగ్‌లో బంతిని అప్పర్‌కట్ చేయడానికి ప్రయత్నించిన ధావన్ (6) థర్డ్‌మన్‌కు చిక్కాడు. కొత్త కుర్రాడు శుభ్‌మన్ గిల్ (7), ధోని (1) ఇలా వచ్చి అలా వెళ్లారు. నాలుగో వన్డేలోలా భారత్ మళ్లీ కుప్పకూలుతుందా అనిపించిన సమయంలో రాయుడు, విజయ్‌శంకర్ (45; 64 బంతుల్లో 4×4)తో కలిసి సమయోచితంగా ఆడాడు. రాయుడు ఆరంభంలో నెమ్మదిగా ఆడగా.. శంకర్ వీలు చిక్కినప్పుడల్లా మంచి షాట్లు కొట్టాడు. అర్ధసెంచరీకి చేరువైన శంకర్.. రాయుడితో సమన్వయ లోపంతో రనౌట్ అయ్యాడు. ఈ స్థితిలో జాదవ్ (34) తోడుగా రాయుడు ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లాడు. కుదురుకున్నాక రాయుడు భారీ షాట్లకు దిగాడు. గ్రాండ్‌హోమ్ బౌలింగ్‌లో వరుస రెండు ఫోర్లు కొట్టి అర్ధసెంచరీ పూర్తి చేసుకున్న రాయుడు. మన్రో బౌలింగ్ మోకాళ్లను వంచుతూ రెండు భారీ సిక్స్‌లు బాదాడు. సెంచరీ చేసేలా కనిపించిన అంబటి.. హెన్రీ బౌలింగ్‌లో మరో షాట్‌కు ప్రయత్నించి ఔటయ్యాడు.



చాహల్ (3/41)

జాదవ్ కూడా అతని వెనుకే వెనుదిరగడంతో భారత్ 203/7తో పోరాడే స్కోరు చేసే అవకాశం లేదనిపించింది. ఈ స్థితిలో హార్దిక్ పాండ్య చెలరేగి ఆడి భారత్‌కు మెరుగైన స్కోరు అందించాడు. ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో భారత్ రెండు వికెట్లు కోల్పోయి 4 పరుగులే చేసింది.

విజృంభించిన బౌలర్లు: ఛేదన మరీ కష్టం కాకపోయినా న్యూజిలాండ్ చతికిల పడిందంటే కారణం భారత బౌలర్ల క్రమశిక్షణే. పేసర్లు భువనేశ్వర్ (1/38), షమి, పాండ్యలకు తోడు స్పిన్నర్లు చాహల్, జాదవ్ (1/34) రాణించడంతో న్యూజిలాండ్ క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. ఓపెనర్లు మన్రో (24), నికోల్స్ (8)ను షమి ఔట్ చేయగా.. రాస్ టేలర్ (1)ను పాండ్య ఎల్బీగా వెనక్కి పంపాడు. 38 పరుగులకే 3 వికెట్లు కోల్పోయిన కివీస్‌ను కెప్టెన్ విలియమ్సన్ (39), లేథమ్ (37) ఆదుకునే ప్రయత్నం చేశారు. ఈ ఇద్దరి జోడీ కుదురుకుంటున్న దశలో విలియమ్సన్‌ను ఔట్ చేసిన జాదవ్ కివీస్‌ను దెబ్బ కొట్టాడు. లేథమ్, నీషమ్ (44; 32 బంతుల్లో 4×4, 2×6)తో కలిసి మరో ప్రమాదకర భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. ఈ దశలో విజృంభించిన చాహల్.. లేథమ్, గ్రాండ్‌హోమ్ (11), ఆస్టల్ (10) వికెట్లు తీసి కివీస్‌ను పరాజయం దిశగా నడిపించాడు. ఉన్నంతసేపు భారీ షాట్లు ఆడిన నీషమ్.. ధోని సమయస్ఫూర్తితో రనౌట్‌గా వెనుదిరగడంతో న్యూజిలాండ్ ఓటమి ఖాయమైంది.

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (బి) హెన్రీ 2; ధావన్ (సి) హెన్రీ (బి) బౌల్ట్ 6; శుభ్‌మన్ (సి) శాంట్నర్ (బి) హెన్రీ 7; రాయుడు (సి) మన్రో (బి) హెన్రీ 90; ధోని (బి) బౌల్ట్ 1; విజయ్ శంకర్ రనౌట్ 45; జాదవ్ (బి) హెన్రీ 34; పాండ్య (సి) బౌల్ట్ (బి) నీషమ్ 45; భువనేశ్వర్ (సి) టేలర్ (బి) బౌల్ట్ 6; షమి రనౌట్ 1; చాహల్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం:** (49.5 ఓవర్లలో ఆలౌట్) **252; వికెట్ల పతనం:** 1-8, 2-12, 3-17, 4-18, 5-116, 6-190, 7-203, 8-248, 9-252; **బౌలింగ్:** హెన్రీ 10-1-35-4; బౌల్ట్ 9.5-2-39-3; నీషమ్ 5-0-33-1; గ్రాండ్‌హోమ్ 7-0-33-0; మన్రో 10-0-47-0; శాంట్నర్ 3-0-18-0; ఆస్టల్ 5-0-35-0

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: మన్రో (బి) షమి 24; నికోల్స్ (సి) జాదవ్ (బి) షమి 8; విలియమ్సన్ (సి) ధావన్ (బి) జాదవ్ 39; టేలర్ ఎల్బీ (బి) పాండ్య 1; లేథమ్ ఎల్బీ (బి) చాహల్ 37; నీషమ్ రనౌట్ 44; గ్రాండ్‌హోమ్ ఎల్బీ (బి) చాహల్ 11; శాంట్నర్ (సి) షమి (బి) పాండ్య 22; ఆస్టల్ ఎల్బీ (బి) చాహల్ 10; హెన్రీ నాటౌట్ 17; బౌల్ట్ (సి) షమి (బి) భువనేశ్వర్ 1; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం:** (44.1 ఓవర్లలో ఆలౌట్) **217; వికెట్ల పతనం:** 1-18, 2-37, 3-38, 4-105, 5-119, 6-135, 7-176, 8-194, 9-204;

బౌలింగ్: భువనేశ్వర్ 7.1-0-38-1; మహ్మద్ షమి 8-0-35-2; పాండ్య 8-1-50-2; విజయ్ శంకర్ 4-0-19-0; చాహల్ 10-0-41-3; జాదవ్ 7-0-34-1



రాయుడు 90

భళా.. రాయుడు

అంబటి రాయుడు నాలుగో స్థానంలో మరో కీలక ఇన్నింగ్స్ ఆడాడు. జట్టు క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు పరిస్థితికి ఎదురు నిలిచి పోరాడిన రాయుడు.. 90 పరుగులు చేసి తన విలువను చాటుకున్నాడు. ప్రపంచకప్‌లో ఆడే భారత జట్టులో స్థానం కోసం మిడిలార్డర్‌లో పోటీ తీవ్రంగా ఉన్న నేపథ్యంలో రాయుడు సాధించిన ఈ పరుగులు ఎంతో అమూల్యమైనవే. ఇప్పటికే మిడిలార్డర్‌లో స్థానం కోసం దినేశ్ కార్తీక్‌తో రాయుడికి పోటీ ఉంది. గత కొంత కాలంగా అంబటి ఆట నేపథ్యంలో అవకాశాలు కూడా అతనికే ఉన్నాయి. తాజా ఇన్నింగ్స్‌తో అతను ఆ బెర్తును పక్కా చేసుకున్నట్లే. ఈ సిరీస్‌లో 5 మ్యాచ్‌లు ఆడిన రాయుడు.. 63.33 సగటుతో 190 పరుగులు చేసి అత్యధిక స్కోరర్‌గా నిలిచాడు. తొలి వన్డేలో 13 పరుగులతో నాటౌట్‌గా నిలిచిన రాయుడు.. రెండో వన్డేలో 47, మూడో వన్డేలో అజేయంగా 40 పరుగులు చేశాడు నాలుగో వన్డేలో డకౌట్ అయినా.. ఆఖరి వన్డేలో జట్టును గెలిపించే ఇన్నింగ్స్ ఆడాడు. ఆరంభంలో వికెట్లు పడినా ఇన్నింగ్స్‌కు స్థిరత్వాన్ని తెస్తూ కీలక ఇన్నింగ్స్‌లు ఆడాడు అంబటి.

పాండ్య పవర్



భారత్ పోరాడే స్కోరు చేసిందంటే కారణం ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యనే. అతడు తనదైన శైలిలో వరుస సిక్స్‌లతో చెలరేగిపోయాడు. ఆస్టల్ వేసిన ఓవర్లో రెండో బంతిని డీప్ మిడ్ వికెట్ మీదుగా సిక్సర్ బాదిన పాండ్య.. ఆఫ్ స్టంప్ మీద పడిన ఫుల్ బంతిని డీప్ కవర్స్‌లో సిక్స్ కొట్టేశాడు. మూడో సిక్స్ అయితే కళ్లు చెదిరిపోయింది. మిడిల్ వికెట్ మీద పడిన ఈ బంతిని క్రీజులో ఎక్కువ కదలకుండానే భుజ బలాన్ని ఉపయోగించి స్టాండ్స్‌లోకి పంపాడు హార్దిక్. అతని మెరుపులతోనే భారత్ ఊహించని స్కోరు చేయగలిగింది. బౌలింగ్‌లోనూ మెరుగైన ప్రదర్శన చేసిన అతను రెండు వికెట్లు తీసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు.

5

హ్యాట్రిక్ సిక్స్‌లు కొట్టడం పాండ్యకు ఇది ఐదోసారి. గతంలో షాదాబ్ ఖాన్, పుష్పకుమార, ఆడమ్ జంపా, ఇమాద్ వసీం బౌలింగ్‌లోనూ అతను వరుసగా మూడు సిక్స్‌లు బాదాడు.

ధోని మార్క్ రనౌట్

36 ఓవర్లకు కివీస్ స్కోరు 175/6. గెలవాలంటే న్యూజిలాండ్ ఇంకో 78 పరుగులే చేయాలి. ఒకవైపు నీషమ్ భారీ షాట్లతో విరుచుకుపడుతున్నాడు. అతని జోరు చూస్తే భారత్‌కు ముప్పు తప్పదేమో అనిపించింది. ఈ స్థితిలో ధోని మరోసారి తన సమయస్ఫూర్తి ప్రదర్శించాడు. జాదవ్ వేసిన బంతిని ఆడబోయిన నీషమ్ బంతిని మిస్ అయ్యాడు. ప్యాడ్‌కు తగిలిన బంతి వికెట్ల వెనక్కి వెళ్లింది. పరుగు తీద్దామని కొంచెం ముందుకు కదిలాడు నీషమ్.. కానీ ఆ కొన్ని సెకన్లు చాలు ధోనికి. ఎప్పుడెప్పుడు అతను క్రీజు దాటుతాడా అన్నట్లు చూసిన మహి.. బంతిని అందుకుని మెరుపు వేగంతో వికెట్లకు కొట్టేశాడు. దీంతో నీషమ్ నమ్మలేనట్లు చూస్తూ పెవిలియన్ చేరాడు. మ్యాచ్‌ను మలుపు తిప్పింది ఈ రనౌటే.





గెలుపు సంబరం

విండీస్ మళ్లీ కొట్టింది

- రెండో టెస్టులో ఇంగ్లాండ్‌పై ఘనవిజయం
- 2-0తో సిరీస్ కైవసం

నార్త్ సౌండ్: తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించిన వెస్టిండీస్ రెండో టెస్టులో 10 వికెట్ల తేడాతో ఇంగ్లాండ్‌ను చిత్తు చేసి సిరీస్‌ను చేజిక్కించుకుంది. 119 పరుగుల లోటుతో మూడో రోజు, శనివారం రెండో ఇన్నింగ్స్‌లో బరిలోకి దిగిన ఇంగ్లాండ్.. రోచ్ (4/52), హోల్డర్ (4/43) ధాటికి 132 పరుగులకే కుప్పకూలింది. 24 పరుగులు చేసిన బట్లరే టాప్ స్కోరర్. 14 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని విండీస్ వికెట్ కోల్పోకుండా ఛేదించింది. క్రెయిగ్ బ్రాత్‌వైట్ (5 నాటౌట్), క్యాంప్‌బెల్ (11 నాటౌట్) లాంఛనాన్ని పూర్తి చేశారు. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ 187 పరుగులకు ఆలౌట్‌కాగా.. విండీస్ 306 పరుగులు చేసింది. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో వెస్టిండీస్ 2-0 ఆధిక్యం సంపాదించింది. తొలి టెస్టులో వెస్టిండీస్ 381 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించిన సంగతి తెలిసిందే. 1994 తర్వాత ఇంగ్లాండ్‌పై వరుసగా రెండు టెస్టుల్లో నెగ్గడం విండీస్‌కు ఇదే తొలిసారి.

"టాస్ వేసే ముందే పిచ్ పరిశీలించాను. పిచ్‌పై కాస్త తేమ ఉన్నట్లు అనిపించింది. ప్రపంచకప్ ముందున్న నేపథ్యంలో ఇలాంటి పిచ్‌పై ఆరంభంలో బ్యాటింగ్ చేస్తే ఆ సవాల్‌ను ఎలా ఎదుర్కొగలం అనే ఉద్దేశంతోనే టాస్ గెలిచినా బ్యాటింగ్ ఎంచుకున్నా. ఆరంభంలోనే నాలుగు వికెట్లు కోల్పోయాం. ఇది మాకో అనుభవం. తొలి 30 ఓవర్లలో రన్‌రేట్ గొప్పగా ఏమీ లేదు.. కానీ చివరికి 250పైన స్కోరు చేయగలిగాం"

\- రోహిత్‌శర్మ



ఖవాజా 101 నాటౌట్

శ్రీలంక ఎదురీత

ఆస్ట్రేలియాతో రెండో టెస్టు

కాన్‌బెర్రా: ఆస్ట్రేలియాతో రెండో టెస్టులో శ్రీలంక ఎదురీదుతోంది. పరాజయం తప్పించుకోవాలంటే అసాధారణ ప్రదర్శన చేయాల్సిందే. ఓవర్‌నైట్ స్కోరు 123/3తో మూడో రోజు, ఆదివారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన లంక 215 పరుగులకు ఆలౌటైంది. స్టార్క్ (5/54) లంక పతనాన్ని శాసించాడు. 319 పరుగుల భారీ ఆధిక్యం సంపాదించిన ఆసీస్.. ఫాలో ఆన్ ఇవ్వలేదు. రెండో ఇన్నింగ్స్‌లో బరిలోకి దిగిన ఆ జట్టు 196/3 వద్ద డిక్లేర్ చేసింది. ఖవాజా (101 నాటౌట్) శతకం సాధించాడు. హెడ్ (59 నాటౌట్) రాణించాడు. 516 పరుగుల భారీ విజయం లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన శ్రీలంక.. ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోకుండా 17 పరుగులు సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 534/5 వద్ద డిక్లేర్ చేసింది.



మాట్లాడనంటే మాట్లాడను..

టెన్నిస్ స్టార్ రఫెల్ నాదల్ వ్యక్తిగత విషయాల్లో చాలా గోప్యంగా ఉంటాడు. తన సొంత వ్యవహారాల గురించి ఎక్కడా మాట్లాడడానికి ఇష్టపడడు. అందుకే తన ప్రియురాలు మరియా పరెలోతో నిరుడు నిశ్చితార్థం చేసుకున్న సంగతి, ఈ ఏడాదే పెళ్లి చేసుకోబోతున్న సంగతి మీడియాలో రావడంతో చాలా ఇబ్బందిపడిపోతున్నాడు. ఓ విలేకరి నాదల్‌ను అతడి పెళ్లి గురించి అడగబోగా వ్యక్తిగత విషయాలు మాట్లాడనని స్పష్టం చేశాడు. "నా వ్యక్తిగత విషయాల గురించి నేనెప్పుడూ మాట్లాడలేదు. ఇప్పుడు కూడా మాట్లాడను" అని అన్నాడు. స్పెయిన్‌లో నాదల్ ఇరుగు పొరుగు కూడా అతడి గురించి మీడియాతో మాట్లాడేందుకు ఇష్టపడట్లేదు. "నాదల్ గురించి నేనేమీ చెప్పను. అతడి వ్యక్తిగత జీవితాన్ని నేను గౌరవిస్తా. అతడు మా ఇంటి పక్కనే నివసిస్తున్నాడు. మాకు అదే సంతోషం. ఎప్పుడైనా కనిపిస్తే హాలో చెప్పగలుగుతున్నాం" అని ఓ మహిళ చెప్పింది. నిరుడు మే నెలలో నాదల్-పరెలో నిశ్చితార్థం జరిగిందని.. ఈ ఏడాది సెప్టెంబరులో యుఎస్ ఓపెన్ తర్వాత వారి పెళ్లి జరగనుందని మొదటిసారి ఓ స్పానిష్ పత్రిక వెల్లడించింది.



విదర్భ కట్టడి

- తొలి ఇన్నింగ్స్‌లో 200/7
- సౌరాష్ట్రతో రంజీ ఫైనల్

నాగ్‌పూర్: రంజీ ఫైనల్లో తొలి రోజు సౌరాష్ట్రదే పైచేయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న డిఫెండింగ్ ఛాంపియన్ విదర్భను ఆ జట్టు కట్టడి చేసింది. ఆదివారం ఆట ముగిసే సమయానికి విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో 7 వికెట్ల నష్టానికి 200 పరుగులు చేసింది. అక్షయ్ వాద్కర్ (45), మోహిత్ కలే (35) రాణించారు. సౌరాష్ట్ర కెప్టెన్ జయ్‌దేవ్ ఉనద్కత్.. పరుగుల యంత్రం వసీం జాఫర్ వికెట్ సహా 2 వికెట్లు పడగొట్టాడు. సౌరాష్ట్ర బౌలర్లు ఆద్యంతం విదర్భ బ్యాట్స్‌మెన్‌పై ఒత్తిడి కొనసాగించారు. భారీ భాగస్వామ్యాలు నమోదు కానివ్వలేదు. ఓపెనర్ సంజయ్ (2)ను ఔట్ చేయడం ద్వారా ఉనద్కత్ విదర్భ పతనాన్ని ఆరంభించాడు. అక్కడి నుంచి విదర్భ క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. కీలకమైన బ్యాట్స్‌మెన్ ఫజల్ (16), జాఫర్ (23) కూడా త్వరగా ఔటయ్యారు. ఫజల్ రనౌట్ కాగా.. జాఫర్‌ను ఉనద్కత్ ఔట్ చేశాడు. కలే, సతీష్ (32) ఆరంభాలను సద్వినియోగం చేసుకోలేకపోయారు. విదర్భ ఓ దశలో 139/6తో నిలిచింది. వాద్కర్, కర్నెవార్ (31 బ్యాటింగ్) ఏడో వికెట్‌కు 57 పరుగులు జోడించడంతో కోలుకుంది.

విదర్భ తొలి ఇన్నింగ్స్: 200/7 (వాద్కర్ 45, కాలే 35, సతీష్ 32, కర్నెవార్ 31 నాటౌట్, జాఫర్ 23; ఉనద్కత్ 2/26)

కాలికట్.. అలవోకగా..

ప్రొ వాలీబాల్ లీగ్

కోచి: ప్రొ వాలీబాల్ లీగ్‌లో కాలికట్ హీరోస్ శుభారంభం చేసింది. లీగ్ రెండో రోజు, ఆదివారం జరిగిన మ్యాచ్‌లో కాలికట్ 4-1తో చెన్నై స్పార్టన్స్‌ను అలవోకగా ఓడించింది. అజిత్ లాల్ అద్భుతంగా ఆడడంతో కాలికట్ 15-8, 15-8, 13-15, 15-11, 15-11తో సొంత ప్రేక్షకుల మధ్య అదిరిపోయే ప్రదర్శన చేసింది. లాల్ 14 పాయింట్ల (13 స్పైక్స్, 1 బ్లాక్)తో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. చెన్నైకి రూడీ విర్హాఫ్ 8 పాయింట్లు సాధించాడు. సోమవారం అహ్మదాబాద్ డిఫెండర్స్‌తో బ్లాక్ హాక్స్ హైదరాబాద్ తలపడనుంది.

సిరీస్ దక్షిణాఫ్రికాదే

జొహానెస్‌బర్గ్: పాకిస్థాన్‌తో మూడు టీ20ల సిరీస్‌ను దక్షిణాఫ్రికా మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 2-0తో గెలుచుకుంది. ఆదివారం రెండో టీ20లో దక్షిణాఫ్రికా 7 పరుగుల తేడాతో గెలిచింది. మిల్లర్ (65 నాటౌట్), డుసెన్ (45), మలన్ (33) మెరవడంతో మొదట దక్షిణాఫ్రికా 3 వికెట్లకు 188 పరుగులు చేసింది. ఛేదనలో పాకిస్థాన్ 7 వికెట్లకు 181 పరుగులే చేయగలిగింది. బాబర్ అజామ్ (90) శ్రమ వృథా అయింది. తలత్ 55 పరుగులు చేశాడు.



సింధు చమక్

ముంబయిలో జరిగిన లాక్మే ఫ్యాషన్ షోలో సింధు ఇలా..

ఈసారి 2.57 లక్షల వ్యయ రిటర్నులు!

• పంచాయతీ ఎన్నికల అభ్యర్థులంతా అందజేయవచ్చని ఎస్‌ఈసీ అంచనా • ఇప్పుడు ఎంపీడీవోకూ ఇవ్వొచ్చు

ఈనాడు - హైదరాబాద్

రాష్ట్రంలో ఇటీవల నిర్వహించిన పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసిన మొత్తం 2.57లక్షల మంది అభ్యర్థుల నుంచి ఈసారి ఎన్నికల వ్యయ రిటర్నులు అందవచ్చని రాష్ట్ర ఎన్నికల సంఘం(ఎస్‌ఈసీ) అంచనా వేస్తోంది. ఇంతకు ముందు 2013 ఎన్నికల్లో పోటీ చేసి ఖర్చు వివరాలను అందజేయని 11,103 మంది అభ్యర్థులను మూడేళ్ల పాటు ఎన్నికల్లో పోటీకి అనర్హులుగా ప్రకటించడంతో అభ్యర్థుల్లో చైతన్యం పెరిగినట్టు ఎస్‌ఈసీ భావిస్తోంది. ఎన్నికల ప్రక్రియ ముగిసిన తేదీ నుంచి 45 రోజుల్లోగా రిటర్నును దాఖలు చేయాలని చట్టం చెబుతోంది.

పంచాయతీ ఎన్నికల్లో సర్పంచి, వార్డు సభ్యుల పదవులకు పోటీ చేసిన వారు ఆయా పంచాయతీల జనాభా ఆధారంగా నిర్ణీత గరిష్ఠ మొత్తాలను మించి ఖర్చు పెట్టరాదనే నిబంధనలున్నాయి. అభ్యర్థులు వీటిని పాటిస్తూనే ఖర్చుల తుది వివరాలను నిర్ణీత నమూనా పత్రంలో పొందుపర్చి సంబంధిత ఎంపీడీవోకు అందజేయాలి. వాటిని ఎంపీడీవో.. ఎన్నికల సంఘానికి పంపించాలి. గతంలో వ్యయ వివరాలను నేరుగా జిల్లా ఎన్నికల అధికారికి అందజేయాలనే నిబంధనలు సంక్లిష్టంగా ఉండేవి. మారుమూల గ్రామాల్లోని పదవులకు పోటీ చేసిన వారికి వ్యయ నివేదికలను పంపాలనే అవగాహన ఉండేది కాదు. ఓటమి చెందిన వారైతే ఎన్నికల అంశాన్నే పక్కన పెట్టేవారు. రిజర్వుడ్ స్థానాల్లోని వారైతే ఇక తదుపరి కాలంలో ఆయా స్థానాలు తమకు ఎలాగు రిజర్వు కావు కనుక వ్యయ వివరాలు ఇచ్చి మాత్రం ప్రయోజనం ఏమిటని భావించేవారు. ఇంతకు ముందు 2013 పంచాయతీ ఎన్నికల్లో వ్యయ రిటర్నులను అందజేయని అభ్యర్థుల వివరాలను పరిశీలించిన ఎస్‌ఈసీ .. మొత్తం 11,103 మందిని మూడేళ్ల పాటు ఎన్నికల్లో పోటీకి అనర్హులుగా ప్రకటించింది. వీరిలో విజయం సాధించిన 9మంది సర్పంచులు, 1,300 మంది వార్డు సభ్యులు సైతం ఉన్నారు. రాష్ట్ర విభజన, ఇతర కారణాల కారణంగా జాప్యం జరిగి వారిపై 2018లో నిషేధం విధించారు. దీంతో వీరంతా ఇటీవల ముగిసిన పంచాయతీ ఎన్నికల్లోనే కాకుండా రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో సైతం పోటీ చేసేందుకు వీలులేని పరిస్థితి ఏర్పడింది.

ఇప్పుడు అవగాహన పెరిగింది

ఎన్నికల వ్యయ వివరాలను అందజేయకుంటే మూడేళ్లపాటు పంచాయతీరాజ్ సంస్థల ఎన్నికల్లో పోటీకి అనర్హులుగా ప్రకటిస్తారనే అవగాహన ఇప్పుడు అభ్యర్థుల్లో బాగా పెరిగినట్టు ఎన్నికల సంఘం భావిస్తోంది. త్వరలోనే మండల, జడ్పీ ఎన్నికలు వస్తున్నందున వాటిలోనూ తమ అదృష్టాలను పరీక్షించుకోవాలనుకునేవారు ఇప్పుడు ఉత్సాహంగా రిటర్నులు అందజేయవచ్చని భావిస్తూ సంబంధిత మార్గదర్శకాలను జిల్లాలకు అందజేసింది. ప్రస్తుత రిజర్వేషన్లు పదేళ్లపాటు అమలు కానున్నందున మునుపటి మాదిరి నిర్లిప్తత అభ్యర్థుల్లో ఉండదని అధికారులు భావిస్తున్నారు.

రిటర్ను ఇలా ఇవ్వాలి

- ప్రతి అభ్యర్థి సంబంధిత ఎంపీడీవోకు ఎన్నికల వ్యయం తుది రిటర్నును అందజేసి రశీదును పొందాలి. రిటర్నుపై అభ్యర్థి, అతని ఏజెంటు(నియమించి ఉంటే) సంతకం చేయాలి.
- వివరాలను ఎన్నికల సంఘం రూపొందించిన నిర్ణీత నమూనా పత్రంలో మాత్రమే పొందుపర్చాలి. అలా కాకుండా ఇతరత్రా సమర్పించే నివేదికలు చెల్లుబాటు కావు. ఇతర కాగితాలపై వ్యయ వివరాలను రాసిచ్చినప్పటికీ లెక్కలు సమర్పించనట్టుగానే పరిగణించి వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటారు.



పోలీసు జాగిలానికి అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు

వరంగల్ పోలీసు కమిషనరేట్ డాగ్‌స్క్వాడ్ విభాగంలో ఏడేళ్లపాటు సేవలందించిన శునకం 'స్టెల్లా' ఆదివారం మరణించింది. పోలీసు అధికారులు. . విభాగంలోని ఇతర శునకాలను తీసుకొచ్చి వాటి సమక్షంలో స్టెల్లాకు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు చేశారు. ముఖ్య అధికారుల పర్యటనల సందర్భంగా ముందస్తు తనిఖీల్లో చురుకుగా వ్యవహరించేది. పేలుడు పదార్థాల గుర్తింపులో కీలకపాత్ర పోషించేది. 12 ఏళ్ల ఈ శునకం వృద్ధాప్యం కారణంగా మృతి చెందింది. ఏఆర్ ఏసీపీ శ్రీనివాస్, ఆర్ఐ సతీష్, డాగ్ శిక్షకుడు ప్రభాకర్, డాగ్‌స్క్వాడ్ ఇన్‌ఛార్జి రమేశ్, సిబ్బంది శ్రద్ధాంజలి ఘటించి గౌరవ వందనం సమర్పించారు. **- వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే**

మౌనశ్రీ మల్లిక్‌కు సినారె పురస్కారం ప్రదానం

కరీంనగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: మనిషిని ప్రేమించే తత్వం, తాత్విక చింతనలు మౌనశ్రీ మల్లిక్ కవిత్వంలో అంతర్లీనంగా దాగి ఉంటాయని సినారె శాశ్వత పురస్కార ప్రదాత డాక్టర్ ఎడవల్లి విజయేంద్రరెడ్డి అన్నారు. ఆదివారం కరీంనగర్ పట్టణం కశ్మీర్‌గడ్డలోని ఐఎంఏ హాలులో సినీ గేయ రచయిత, కవి మౌనశ్రీ మల్లిక్ రచించిన 'తప్త స్పృహ' గ్రంథానికి సినారె పురస్కారం ప్రదానం చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. మల్లిక్ కవిత్వంలో భావజాల గాఢతతోపాటు లోతైన అర్థాలు స్ఫురిస్తాయన్నారు. సభాధ్యక్షుడు దాస్యం సేనాధిపతి మాట్లాడుతూ..తప్త స్పృహ గ్రంథం నిండా మనసు తడి నిండి ఉందన్నారు. గ్రంథాన్ని కవి, పండితులు నంది శ్రీనివాస్ సమీక్షించారు. పురస్కార గ్రహీత మౌనశ్రీ మల్లిక్ మాట్లాడుతూ..సినారె స్ఫూర్తితో ఎన్నో పాటలు రాశానని, ఆయన ఏకలవ్య శిష్యుడిగా కవిత్వం రాయటం ప్రారంభించానని వెల్లడించారు.



మౌనశ్రీ మల్లిక్‌కు సినారె పురస్కారం అందిస్తున్న ఎడవల్లి విజయేంద్రరెడ్డి తదితరులు



'తెలంగాణలో సుస్థిర వ్యవసాయం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ వినోద్‌కుమార్, వ్యవసాయ వర్సిటీ వీసీ ప్రవీణ్‌రావు, పుస్తక రచయిత రమేశ్, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మండలి ఛైర్మన్ స్వామిగౌడ్, ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఏపీ మాజీ సీఎస్ అజేయ కల్లం

తెలంగాణ దేశానికే దిక్సూచి

• ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ రచించిన పుస్తకావిష్కరణ సభలో స్పీకర్ పోచారం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం వ్యవసాయంతోపాటు ఇతర రంగాల్లో దేశానికి దిక్సూచిగా నిలుస్తోందని శాసనసభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న రైతుబంధు, రైతుబీమా పథకాలకు దేశవ్యాప్తంగానే కాకుండా ఐక్యరాజ్య సమితి నుంచీ ప్రశంసలు వచ్చాయన్నారు. వేములవాడ శాసనసభ్యుడు చెన్నమనేని రమేష్ జన్మదినం సందర్భంగా ఆయన రచించిన 'తెలంగాణలో సుస్థిర వ్యవసాయం' పుస్తకాన్ని పోచారం ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శాసనసభాపతి మాట్లాడుతూ.. సుస్థిర వ్యవసాయానికి సమగ్ర ప్రణాళిక, దూరదృష్టి, ఆర్థిక వనరులు, సాంకేతికత అవసరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటుతో ఉన్నత విద్యావంతులు కూడా నేడు వ్యవసాయ రంగంలోకి ప్రవేశిస్తున్నారని చెప్పారు. మండలి ఛైర్మన్ స్వామిగౌడ్ మాట్లాడుతూ.. వ్యవసాయానికి ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోందని చెప్పారు. ఎంపీ వినోద్‌కుమార్ మాట్లాడుతూ. . తెలంగాణ ప్రభుత్వ పథకమైన రైతుబంధును చూసి కేంద్రం ఆ తరహా పథకాన్ని చేపట్టడం రాష్ట్రానికి గర్వకారణమని అన్నారు. చెన్నమనేని మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణలో వ్యవసాయానికి కొత్త వెలుగులొచ్చాయన్నారు. ఆరుదశాబ్దాల సంక్షోభం నుంచి రాష్ట్రం బయటపడిందని చెప్పారు. వ్యవసాయాన్ని సుస్థిరంగా ఎలా తీసుకెళ్లాలి, సవాళ్లను ఎలా అధిగమించాలనే కోణంలోనే తాను రచనలు చేశానని తెలిపారు. కార్యక్రమంలో మండలి చీఫ్ విప్ పాతూరి సుధాకర్ రెడ్డి, రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఏపీ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి అజేయ కల్లం, మాజీ మంత్రులు హరీశ్‌రావు, జూపల్లి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

వీరశైవులను ఓబీసీలుగా గుర్తించాలి

వీరశైవ శంఖారావంలో వక్తల డిమాండ్

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: వీరశైవ లింగాయత్‌లపై ప్రభుత్వాలు వివక్ష చూపుతున్నాయని, దశాబ్దాల కాలంగా ఎలాంటి సహాయ సహకారాలు అందించడం లేదని ఆ సామాజికవర్గ నేతలు గళం విప్పారు. తమను ఓబీసీలుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కర్నూలులో ఆదివారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల వీరశైవ లింగాయత్‌ల శంఖారావం కార్యక్రమాన్ని నిర్వహించారు. జహీరాబాద్ ఎంపీ బి.బి. పాటిల్ మాట్లాడుతూ.. వీరశైవులు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా ఎంతో వెనుకబడి ఉన్నారన్నారు. వారిని ఓబీసీ కేటగిరీలో చేర్చే అంశంపై పార్లమెంట్‌లో చర్చిస్తానన్నారు. పాల్తూరు పీఠాధిపతి చెన్నవీర శివాచార్యులు మాట్లాడుతూ.. సిద్ధ గంగ పీఠాధిపతి శివకుమార స్వామికి భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు.

జూనియర్ కళాశాలల గుర్తింపునకు దరఖాస్తు గడువు పెంపు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో అన్ని యాజమాన్యాల కింద గల జూనియర్ కళాశాలలు గుర్తింపు, అదనపు సెక్షన్ల మంజూరు కోసం దరఖాస్తు చేసుకునే గడువును ఈ నెల 12 వరకు పొడిగించినట్లు ఇంటర్ విద్యాశాఖ కార్యదర్శి అశోక్ తెలిపారు. రూ.3 వేల అపరాధ రుసుముతో 25వ తేదీ వరకు, రూ.5 వేల అపరాధ రుసుముతో మార్చి 8 వరకు, రూ.10 వేల అపరాధ రుసుముతో వచ్చే నెల 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కళాశాల ప్రాంగణాల మార్పు, యాజమాన్య సంస్థలు, పేర్ల మార్పిడి వంటి వాటికి మార్చి 20 తర్వాత దరఖాస్తుకు అవకాశం ఉండదని చెప్పారు.

కొత్త పంచాయతీరాజ్ చట్టంపై నేడు సదస్సు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో కొత్త పంచాయతీరాజ్ చట్టంపై అవగాహన సదస్సు సోమవారం ప్రగతిభవన్‌లో జరగనుంది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి, పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు, జిల్లా పరిషత్, మండల పరిషత్ అధికారులు, పంచాయతీ అధికారులు ఇందులో పాల్గొననున్నారు. కొత్తగా ఎన్నికైన సర్పంచులను జిల్లాకు కొంత మంది చొప్పున దీనికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కొత్త పంచాయతీరాజ్ చట్టం అమలుపై ముఖ్యమంత్రి కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు. ముందుగా అధికారులకు శిక్షణ ఇచ్చి, వారి ద్వారా సర్పంచులకు, ఉప సర్పంచులకు శిక్షణ ఇవ్వాలని సీఎం నిర్ణయించారు.

2,126 యూనిట్ల రక్తదానం

లక్ష్మారెడ్డి జన్మదినం సందర్భంగా అభిమానుల స్పందన

జడ్చర్ల గ్రామీణం, న్యూస్‌టుడే: జడ్చర్ల ఎమ్మెల్యే, మాజీ మంత్రి డా. సి.లక్ష్మారెడ్డి జన్మదినం సందర్భంగా రికార్డు స్థాయిలో 2,126 మంది రక్తదానం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలోని బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ఆదివారం ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్, సీఎల్ఆర్ యువసేన, సీఎస్ఆర్ సేవాట్రస్టు సహకారంతో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. తెరాస కార్యకర్తలు, అభిమానులు, విద్యార్థులు, ప్రజా, వ్యాపార సంఘాల నేతలు తరలివచ్చి రక్తదానం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఒకేచోట నిర్వహించిన శిబిరంలో అత్యధికంగా 2,126 మంది రక్తదానం చేయడం రికార్డని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మహబూబ్‌నగర్ అధ్యక్షుడు నటరాజ్ ప్రకటించారు. లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. 15 ఏళ్లుగా తన జన్మదినం సందర్భంగా రక్తదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామన్నారు.



అవయవ దానానికి అంగీకరిస్తూ సంతకం చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92, Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00